# శ్రీవిద్యా దర్శనము



క్రోవి పార్థసారథి

# శ్రీవిద్యాదర్శనము



"శ్రీవిద్యారత్నాకర", శ్రీవిద్యావిశారద"

క్రోవిపార్థసారథి

ప్రథమ ముద్రణ : ఫిబ్రవరి 1997

ద్వితీయ ముద్రణ : జూన్ 1998

ప్రతులు : 500.



సర్వస్వామ్యములు : శ్రీవి మంజూషకు చెందుతాయి



మూల్యము : రూ. 50/=



ప్రతులకు:

కె.మంజూష

23–11 /1– 10 / 2, దేవీనిలయం

ఓగిరాలవారివీధి, సత్యనారాయణపురం

విజయవాడ - 520 011.

✆ 530672

Phone : 2707 (Tenkasi)

HIS HOLINESS JAGADGURU

SRI SIVA CHIDANANDA BHARATHI SWAMI

Sri Siddheswari Peetadhipati

Courtallam - 627 802

(Via) Tenkasi - Tirunelveli Dist. ----- South India

With Narayanasmritis

---

# అభినందన

5-5-1997

దేవీ పూజలో కౌళ, సమయమతములు, శ్రీ చక్రాంతర్గత రహస్యములు.
భిన్న సంప్రదాయములలో పంచదశీమహామంత్రము, షట్చక్రభేదన-
దేవి సాక్షాత్కారము మొదలైన విషయములు పామరులకు కూడా
అర్థమయ్యేరీతిలో
శ్రీ క్రోవి పార్థ సారథిగారు వ్రాసిన

**"శ్రీ విద్యాదర్శనము"**

గ్రంథావిష్కరణ సమయమున వారిని అభినందిస్తూ
కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠ మహా సంస్థానామోదమున గ్రంథకర్తను

**" శ్రీ విద్యారత్నాకర"**

అను బిరుదరాజముతో సన్మానించడమయినది.

ఇతి నారాయణస్మృతిః

[illegible]

పరమహంస పరివ్రాజకాచార్య
శ్రీశ్రీశ్రీ చిదానంద భారతీ స్వామి వారు
భువనేశ్వరీ పీఠము
గన్నవరం - కృష్ణాజిల్లా

# శ్రీ ముఖము

నారాయణ స్మరణ పూర్వకముగా వ్రాయునది. చిరంజీవి క్రోవి పార్థసారథి రచించిన శ్రీవిద్యాదర్శనమును ఆమూలాగ్రము విన్నాను. శ్రీ విద్యను శ్రీ చక్రమును గూర్చి తెలియగోరు వారికీపొత్తము బాగా ఉపకరించును. శ్రీ విద్యయనబడు పంచదశిలోని వర్ణముల సమ్మేళనమునకు హేతువులు ఫలితాలు సప్రమాణంగా నిరూపింపబడినవి. సౌందర్యలహరి యందలి శ్లోకములను కూడ సారవంతముగా వివరించినారు. చతుర్భిః శ్రీకంఠై : అను శ్లోకముననుసరించి 4 శివ చక్రములు, ఐదు శక్తి చక్రములు కలిసి నవావరణాత్మకమైన శ్రీచక్రమైనదని వివరించుచూ మతాంతరము ననుసరించి వేర్వేరు చక్రములు దీనిలో లీనమైయున్నవని నిపుణముగా నిరూపించినారు. శ్రీ చక్రము మానవశరీరమందలి నవధాతువులకు బ్రహ్మాండములోని నవగ్రహములకును, శరీరములోని [illegible] చక్రములకు నవావరణములకును సమన్వయము చాల హేతుబద్ధముగా నిరూపింపబడినది.

శ్రీచక్రార్చనలోని సమయాచారమును కౌలా చారమును విశదీకరించి మకారపంచకము పేర మద్యపాన స్త్రీసంగమాది దురాచార భూయిష్ఠమైన కౌలాచారమును నిస్సంకోచముగా ఖండించుట ఇందు ప్రశంసనీయము. శ్రీ శంకరాచార్యులకు పూర్వము కౌలాచారుల సాంగత్య దోషమున పండితులందు కూడ చోటుచేసికొనిన కౌలా చారమును శ్రీ శంకరులవారు ఖండించి ఒక త్రోవకు తెచ్చిరి. క్రిందటి శతాబ్దములో శ్రీ శృంగేరీ విరూపాక్ష పీఠాధిపతులైన జగద్గురు శ్రీ కల్యాణానంద భారతీస్వామి వారును కౌలాచారమును అతి హేయముగా వర్ణించి ఖండించిరి. ఇపుడీ గ్రంథకర్తయు ఈ దురాచారమును త్రోసి పుచ్చుట అభినందనీయము.

శ్రీ చక్ర భూప్రస్తార నిర్మాణమును రేఖాచిత్రముతో లిఖించుట తన్మార్గగాముల కావశ్యకమగు వివిధ రేఖా నిర్మాణముల ప్రదర్శించిరి. బిందువు చతురస్రములో పడునని తెల్పుట మాత్రము సంశయాస్పదమైనది.

శ్రీవిద్యా జిజ్ఞాసువులకీ గ్రంథము అత్యంత ఉపయుక్తము. శ్రీ చక్రనగర సామ్రాజ్ఞిమైన శ్రీభువనేశ్వరీ దేవి గ్రంథకర్త కితోధిక శ్రద్ధాబుద్ధులను అయురారోగ్యములను ప్రసాదించి ఉపాసకులకు ఉపకారమొనర్చుగాక!

శ్రీ భువనేశ్వరీ పీఠము
గన్నవరం - కృష్ణాజిల్లా

నారాయణస్మృతిః
శ్రీ చిదానంద భారతీ స్వామి

ROTARY CLUB
VIJAYAWADA

జ్యోతిష్య విజ్ఞాన పీఠము
విజయవాడ. 5-5-1997



గ్రంథకర్త పార్థసారథిని సన్మానిస్తున్న గన్నవరం భువనేశ్వరీ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ చిదానంద భారతీస్వామి.
శ్రీ విద్యాదర్శనము గ్రంథావిష్కరణ చేస్తున్న కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శివచిదానంద భారతీస్వామి

**Office of the Commissioner**
**Endowments Department, A.P. Hyderabad.**

L. Di S. No.J3/4846/98 Dt.31.3.98

Sub : Endowments Department - Religious, Purchase of the Books **"SriVidya Darsanam"** and **"SriVidya Darsanam** Written by Sri Krovi Pardhasaradhi - Vijayawada - commended orders issued-Reg.

Ref : 1. Representation dated. 23-1-96 from Sri Krovi Pardha Saradhi, Vijayawada.

In the reference cited, Sri Krovi Pardha Saradhi, Vijayawada has stated that he wrote the books by name **"SriVidhya Darpanam"** and requested to commend these two books for purchase by the Executive Authorities of the temples.

The above two books are very useful for the temples and they deserve to find a place in the libraries of the temple. The price of books are given below.

## *1. SriVidya Darpanam*

| | |
|---|---|
| 1. Ordinary book | Rs. 45/- |
| 2. Bound book | Rs. 60/- |
| 3. **SriVidya Darsanam** | Rs. 30/- |

All the Executive Officers of 6(a) temples irrespective of the cadre are requested to pruchase one set of books from the author by placing an order and keep them in the temple libraries and make them available to the devotees as well as public.

By order of the Commissioner


sd/- R.S. Ramamoorthy
Asst Commissioner (HO)

To

Superintendent

All the Executive Officers of 6(a) temples.
copy to Sri KroviPardha Saradhi, D.No.23-11/1-10/2, Devi Nilayam, ogirala vari street, satyanarayanapuram, Vijayawada. 11.
Copy to all the Deputy Commissioners and Asst. Commissioner to issue similar instructions to the Executive officer working under their respective jurisdiction.

శ్రీచక్రనగరసామ్రాజ్ఞి





'శ్రీ విద్యాదర్పణము' గ్రంథావిష్కరణ చేస్తున్న దత్త పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి

# ప్రణతులు

భారతదేశంలో అనాదిగా వివిధరీతుల్లో దేవతారాధనలు జరుగుతున్నాయి. జగద్గురు శ్రీ శంకర భగవత్పాదులవారు భిన్న మతాలను ఖండించి అద్వైత మతస్థాపన చేశారు. వారు సమన్వయ పరచిన షణ్మతాలలో భగవతీ ఆరాధన ఒకటి.

శ్రీవిద్యా దర్శనము అనే ఈ చిన్న పుస్తకములో పరతత్త్వం (శ్రీ లలితాదేవి) తత్త్వాన్ని ఉపాసనా విధానాన్ని శక్తిమేరకు విశదీకరించటం జరిగినది.

"దేవీపూజ - ఆచారాలు" అనే శీర్షికలో వివిధ సంప్రదాయాలలో జరిగే దేవీపూజ, పాటించే ఆచారవ్యవహారాలను వివరించడం జరిగింది. శాక్తేయానికి, పంచదశీ మహామంత్ర విశిష్టతకు సంబంధించిన విషయాలు " పంచదశీ మహామంత్రం" అనే శీర్షిక క్రింద వివరించటం జరిగింది. ఈ మహామంత్రానికి యంత్రరూపమే... శ్రీచక్రము. శ్రీచక్రస్వరూపములు రేఖనంలోని భేదం, "శ్రీ చక్రము" అనే శీర్షికలో పటముతో సహా నిరూపించబడినవి.

గురుముఖతః దీక్ష తీసుకున్న తరువాత సాధన ఎలా చెయ్యాలి? షట్చక్రభేదము చేసి దేవీసాక్షాత్కారం ఎలా పొందాలి? అనే విషయాలు షట్చక్రభేదన అనే శీర్షిక క్రింద విశదీకరించబడినవి.

శ్రీవిద్యను సౌందర్యలహరి ప్రమాణ గ్రంథంగా చెప్పబడుతోంది. ఈ పరమోత్కృష్ట గ్రంథంలోని అనేక అద్భుతాలు, సౌందర్యలహరి - శ్రీ విద్య అన్న అంశంలో విపులీకరించ బడ్డాయి. ఇందులోని కొన్ని వ్యాసాలు పత్రికలలో ప్రచురించబడినాయి.

నేను ఈ పుస్తకాన్ని గన్నవరం భువనేశ్వరీ పీఠాధిపతులు పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ చిదానంద భారతీస్వామి వారి వద్దకు తీసికొని వెళ్ళినప్పుడు వారు నన్ను అత్యంత అభిమానంతో ఆదరించారు. ఎంతో ఓపికతో కూర్చొని, పుస్తకాన్ని ఆమూలాగ్రం చదివించుకొని, విని, పుస్తక ప్రచురణకోసం నన్ను ప్రోత్సహించి ఈ పుస్తకానికి శ్రీవిద్యా దర్శనము అని నామకరణం కూడా చేసిన వయోజ్ఞాన వృద్ధులైన శ్రీ స్వామివారి పాదారవిందాలకు నా నమస్సుమాంజలి.

ఈ పుస్తకరచనలో ఉత్తేజపరచిన కె.బి.ఎస్. కళాశాల తెలుగు లెక్చరరు శ్రీ గరిమెళ్ళ సోమయాజులు శర్మ గారికి, నాకు అన్ని విధాల సహకరించిన మిత్రులు మా కళాశాల తెలుగు లెక్చరరు శ్రీ పింగళి వెంకట కృష్ణారావుగారికి, నా శ్రీమతి రమాదేవికి నా కృతజ్ఞతలు.

నాయెడ గల ప్రేమాభిమానంతో ఈ పుస్తకానికి పీఠికలు, తొలిపలుకులు వ్రాసిన డాక్టరు ప్రసాదరాయకులపతిగారికి, డా॥ కుందుర్తి సత్యనారాయణమూర్తి గారికి, శ్రీ గరిమెళ్ళ సోమయాజులు శర్మ గారికి నా కృతజ్ఞతలు.

ఈ పుస్తక ప్రచురణకు భూరి విరాళము సమర్పించిన దివి శాతవాహన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు గారికి, ఇతర దాతలకు ఆదేవి ఆయురారోగ్య ఐశ్వర్యములనిచ్చి సదా కాపాడాలని ప్రార్థిస్తున్నాను. ముద్రణలో కొన్ని తప్పులు దొర్లినాయి. వాటిని ద్వితీయ ముద్రణలో సరిచూచుకుంటానని సవినయంగా మనవిచేస్తున్నాను.

సామాన్యపాఠకునికి కూడా అర్థం కావాలనే ఉద్దేశ్యంతో అతిసరళమైన భాషలో నాచేతనైనమేరకు చేసిన ఈ ప్రయత్నాన్ని పండితపామరులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

# ద్వితీయ ముద్రణ

శ్రీ విద్యా దర్శనము 5-5-97 న విజయవాడ లోని రోటరీక్లబ్ ఆడిటోరియంలో కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠాధిపతుంచే జ్యోతిష విజ్ఞాన పీఠం వారి ఆధ్వర్యంలో ఆవిష్కరింపబడింది, మొదటి ముద్రణకు గన్నవరం భువనేశ్వరీ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ చిదానంద భారతీస్వామి వారు, డా॥ ప్రసాదరాయకులపతిగారు, గరిమెళ్ళసోమయాజుల శర్మగారు, డా॥ కుందుర్తి సత్యనారాయణమూర్తి గారలు పీఠికలు ఇచ్చారు. వీరందరికీ నా కృతజ్ఞతలు. ఈ పుస్తక ముద్రణకు బాల విరాళం అందించిన శాతవాహన కళాశాల ప్రిన్సిపల్ శ్రీ T.J.S. అలంకార్ రావు గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు

ఈ పుస్తకాన్ని ఆదరించిన శ్రీవిద్యోపాసకులకు శతకోటినమస్కారాలు.

పండితులు, ఉపాసనాపరులు ఏవైనా సూచనలుచేస్తే వాటిని సవినయంగా స్వీకరిస్తాను.

1-6-98

బుధజన విధేయుడు
క్రోవి పార్థసారథి



గ్రంథ ముద్రణకు ఆర్థిక సహాయం చేసిన శాతవాహన కళాశాల ప్రిన్సిపల్ శ్రీ T.J.S. అలంకార్‌రావుగారు


# విషయసూచిక


| విషయము | | పేజీనంబరు |
|---|---|---|
| 1. | సౌందర్యలహరి - శ్రీ విద్య | 1-7 |
| 2. | శంకర భగవత్పాదులు | 8-12 |
| 3. | దేవి అంటే ఎవరు? ఎక్కడ ఉంటుంది ? | 13-20 |
| 4. | పంచదశీ మహామంత్రము | 21-38 |
| 5. | శ్రీచక్రము | 39-60 |
| 6. | నవావరణపూజ | 61-67 |
| 7. | దేవీపూజ - ఆచారాలు | 68-80 |
| 8. | షట్చక్ర భేదన | 81-101 |






విజయవాటికలో ఇంద్రకీలాద్రి పై వెలసిన శ్రీ కనకదుర్గమ్మ వారి
దివ్య చరణారవిందములకు సమర్పించిన
**శ్రీ కుసుమము**



# సౌందర్యలహరి - శ్రీవిద్య

సౌందర్యలహరి వంద శ్లోకములతో దేవిని స్తుతి చేస్తూ వ్రాసిన గ్రంథం. శంకర భగవత్పాదుల వారికి ఎంత కాలానికీ దేవి తత్త్వం అర్థం కాలేదు. అప్పుడు వారు తమగురువైన గోవింద భగవత్పాదాచార్యుల వారి వద్దకు వచ్చి దేవీ తత్త్వాన్ని వివరించమని అడగగా, వారు తమ గురువైన గౌడపాదాచార్యుల వారి వద్దకు వెళ్ళమని చెప్పారు. అప్పుడు శంకరులు తమ పరమ గురువైన గౌడపాదాచార్యులవారి వద్దకు వెళ్ళగా వారు తాము వ్రాసిన 'సుభగోదయ స్తోత్రాన్ని' చదవమని చెప్పారు. ఆ గ్రంథం చదివిన తరువాత శంకరుల వారు దేవీ తత్త్వాన్ని అర్థం చేసుకుని సౌందర్యలహరిని వ్రాశారు. ఈ సౌందర్యలహరి 'సుభగోదయానికి' ఉదాహరణపూర్వక ,వ్యాఖ్య వంటిది అని పండితుల అభిప్రాయము.

ఈ గ్రంథం మొత్తం రెండు భాగాలుగా ఉంటుంది. దీనిలో మొదటి 41 శ్లోకములు 'ఆనందలహరి' అని 42 నుంచి 100 వరకు గల శ్లోకాలు 'సౌందర్యలహరి' అని చెప్పబడింది. దీనిలో మొదటి 41 శ్లోకాలలో మంత్ర, యంత్ర, తంత్రశాస్త్రం చెప్పబడింది. 42వ శ్లోకం దగ్గర నుండి దేవి కిరీటంతో ప్రారంభమై 91వ శ్లోకంలో పాదాలవరకు, దేవి స్థూలరూపాన్ని వర్ణించటం జరిగింది. 92 వ శ్లోకంనుండి 97వ శ్లోకం వరకు దేవీ స్వరూపము, మహిమ వర్ణించ బడినాయి. 98వ శ్లోకంలో కవి ప్రార్థన, 99 శ్లోకంలో ఉపాసకుని ఫల ప్రాప్తి. నూరవ శ్లోకంలో కవి తన నిరంహంకారత్వము చూపుతూ ఆ దేవి దయవల్లనే ఈ గ్రంథం వ్రాశానని చెప్పటం జరిగింది.

ఈ స్తోత్రాన్ని పరమశివుడే, పరదేవతను స్తుతిస్తూ చెప్పినదని, దానిని శంకరుల వారు గ్రంథస్థం చేశారని కూడా చెప్పబడింది. సమయమతాను వర్తులగు శ్రీవిద్యోపాసకులకు- ఇది ఉత్తమోత్తమమైన గ్రంథం. లోతుగా చూసినట్లైతే శంకరులు అద్వైతమతాన్ని ప్రచారం చేసినప్పటికీ ఈ సౌందర్యలహరి వ్రాసిన తీరునుబట్టి వారు శాక్తేయులు అనిపిస్తుంది. శాక్తేయులలో కౌళాచారులు, మిశ్రమాచారులు సమయాచారులు మొదలగు అనేక శాఖలు ఉన్నాయి.

"సాధకానాంహితార్థాయ బ్రహ్మణో రూపకల్పనా" అన్నారు. అనగా సాధకుడి యొక్క కోర్కెలను అనుసరించి భగవంతునికి రూపము కల్పించ బడుచున్నది.

ఇవి సగుణ, నిర్గుణ ఆరాధనలు అని చెప్పవచ్చు. సగుణ రూప బ్రహ్మనుగూర్చి చెప్పే గ్రంథాలలో 'ఆగమాలు' అని చెప్ప- బడే తంత్రగ్రంథములు ముఖ్యమైనవి. వీటి మొత్తాన్ని మంత్ర శాస్త్రం అని కూడా అంటారు. వీటిలో వైష్ణవ ఆగమాలు, శైవ ఆగమాలు, శక్తి ఆగమాలు విడివిడిగా ఉన్నాయి.

శక్తిని జగన్మాతగా, పరతత్వంగా చెప్పే ఆగమాలే శక్త్యాగమాలు. ఇవి మూడు రకాలు కౌళ, మిశ్రమ, సమయ ఆగమాలు. కౌళాచారులు కేవలము అర్థకామాలకే ప్రాధాన్యం ఇస్తారు. వీరికి మొత్తం 64 ఆగమాలు వ్యాఖ్యలతో కూడా లభిస్తున్నాయి. మిశ్రమాగమాలలో ధర్మ కర్మ ఉపాసనల వివరణ ఉన్నది. ఇవికూడా వ్యాఖ్యా సహితముగా లభిస్తున్నాయి. సమయమతానువర్తులది కేవలము పారమార్థికదృష్టి, జీవబ్రహ్మైక్యమే వీరి సిద్ధాంతము. వీరికి 'శుభాగపంచకము' అని పిలువ బడు సనక, సనందన, సనత్కుమార, వసిష్ఠ, శుకసంహితలు ప్రమాణాలు.

కుండలినీ శక్తిని జాగృతం చేసి, షట్చక్రాలను భేదించి సహస్రారం చేర్చటమే వీరి సాధన. కౌళమతము వారికి షట్చక్ర భేదనము లేదు. వారికి మూలాధారమందే ఉపాసన.

సౌందర్యలహరీ స్తోత్రమును చూస్తే శంకరాచార్యులవారు షట్చక్ర భేదనముచేసిన సమయ మతసిద్ధుడు అని తెలుస్తోంది. తనతపశ్శక్తినీ, అనుభవాన్ని జోడించి శంకరులు ఈ గ్రంథాన్ని వ్రాశారు.

సౌందర్యలహరికి దాదాపు 36 వ్యాఖ్యానాలు ఉన్నాయి. వాటిలో కొన్ని ఆయా ప్రాంతాలలోనే ప్రచారంలో ఉండగా, యావద్భారతదేశంలోను ప్రచారంలో ఉన్న వ్యాఖ్యానాలు చాలా తక్కువ. వాటిలో ప్రప్రథమంగా చెప్ప తగ్గది 'లక్ష్మీధర వ్యాఖ్య' ఇది భిన్న భిన్న సంప్రదాయముల వారి అభిప్రాయాలు కూడా క్రోడీకరించి వ్రాయ బడింది. ఈ నాటికి కూడా భారత దేశంలోని పండితులందరూ దీన్ని ప్రామాణికంగా అంగీకరిస్తున్నారు. మంత్రోపదేశంలేని వారు ఈ పుస్తకం చదువుతున్నప్పుడు తన యందు గురు భావముంచి ఈ పుస్తకాన్ని చదివినట్లైతే, తాను గురుస్థానంలో ఉండి వారిని అనుగ్రహిస్తాను. అని చెప్పిన మహాను భావుడాయన.

లక్ష్మీధరుడు తన వ్యాఖ్యలో పంచదశీ, షోడశీ నిరూపణ, శ్రీచక్ర నిరూపణ. చతుర్విధైక్య సంధానము, తంత్ర శాస్త్రము, శ్రీవిద్య, సాదాఖ్యకళ, చంద్రకళ, షట్చక్ర భేదనము, సహస్రార స్వరూపము నిరూపించేటప్పుడు ప్రదర్శించిన పాండిత్యము, ప్రజ్ఞా పాటవాలు అనన్య సామాన్యం. వీరి వ్యాఖ్యానమే లేక పోయినట్లైతే సౌందర్యలహరిలోని రహస్యాలు బహుశః మనకు తెలిసేవే కావు.

లక్ష్మీధరుడు కృష్ణానదీ తీరంలోని విజయవాడ సమీపంలో గల లొల్లగ్రామానికి చెందిన వాడని శ్రీ తుమ్మల పల్లి వారి అభిప్రాయము. హరితస గోత్రీకుడు. వీరి వంశములోని వారందరూ వేదవిదులు, పండితులు. విశ్వనాథభట్టారకులు వీరి జనకులు. ఒరిస్సాను పాలించిన వీరరుద్రగజపతి ఆస్థానంలో లక్ష్మీధరుడు పండితుడుగా ఉండేవాడు. గజపతుల పతనానంతరము శ్రీ కృష్ణదేవరాయల ఆస్థాన పండితుడయ్యాడు. శంకరాచార్యుల పరమ గురువైన గౌడపాదాచార్యుల వారు రచించిన సుభగోదయానికి కూడా లక్ష్మీ ధరుడు వ్యాఖ్య వ్రాశాడు.

సౌందర్యలహరికి వీరు వ్రాసిన వ్యాఖ్యను మైసూరు ప్రభుత్వం వారు ప్రచురించారు.

మిగిలిన వ్యాఖ్యలలో 'గంగహరి' అనువాడు తాంత్రిక దృష్టితో వ్రాసిన 'తత్త్వదీపిక' తంత్రవాదులకు ముఖ్యమైనది.

'కైవల్యాశ్రమి' అను పరివ్రాజకుడు వ్రాసిన 'సౌభాగ్య వర్ధని' వ్యాఖ్యా నానికి కూడా భారతదేశంలో ప్రచారం ఉంది.

'ప్రవరసేనుడు' వ్రాసినట్లుగా చెప్పబడుతున్న 'సుధావిద్యోతిని' వ్యాఖ్యకుడా చాలా ముఖ్యమైనది. దీనిలో తాంత్రిక జ్యోతిషపరమైన విషయాలు కూడా వ్రాయబడ్డాయి.

సౌందర్యలహరికి వ్రాసిన వ్యాఖ్యలన్నీ కూడా దేవీ పరంగానే వ్రాయటం జరిగింది. కానీ 'నృశింహకృత' వ్యాఖ్యమాత్రం ఇందుకు భిన్నంగా ఉంటుంది. దీనిలో ప్రతి శ్లోకానికి దేవీ పరంగానూ, విష్ణుపరంగానూ కూడా వ్యాఖ్య వ్రాయబడింది. ఇక తెలుగులో చూసినట్లైతే లక్ష్మీధరునివ్యాఖ్యకు యథాతథాంగా శ్రీ చదలవాడ జయరామశాస్త్రి గారు, లక్ష్మీధరము, సౌభాగ్యవర్ధని, అరుణామోదిని, డిండిమ

వ్యాఖ్యలను ఉదహరిస్తూ శ్రీ తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు గారు వాఖ్య వ్రాశారు.

ఇంతవరకు ఉన్న వ్యాఖ్యలన్నింటిలో కూడా ప్రతి శ్లోకానికీ అర్థము, తాత్పర్యము, అందులో అలంకారాలు, ఛందస్సు, మంత్ర, తంత్ర రహస్యాలు వివరించటం జరిగింది. కాని ఏవిషయాన్ని పూర్తిగా ఒక చోట వివరించటం జరగలేదు. సామాన్య మానవుడికి కూడా అర్థం కావాలి అనే ఉద్దేశ్యంతో కేవలం విషయ ప్రాధాన్యంగా, సౌందర్యలహరి లోని శ్లోకాలను, ఇతర మంత్ర, తంత్ర గ్రంధాలలోని విషయాలను వివరించే ప్రయత్నమే ఇది. ఈ విధమైన విషయాలను వివరించే అర్హత, సామర్థ్యము లేకపోయినప్పటికీ శంకరుల అనుగ్రహాన్ని, లక్ష్మీధరుని కృపా విశేషాన్ని, నమ్ముకుని ఈ ప్రయత్నం చేస్తున్నాను.

సౌందర్యలహరి లోని అద్భుతాలు:

కేవలం వంద శ్లోకాలు మాత్రమే కల గ్రంథం సౌందర్యలహరి. ఇది ఒక శతకం. చూడటానికి దేవి స్తుతిలా కనిపిస్తుంది. మయూర కవి వ్రాసిన సూర్యశతకము, బాణభట్టు చండీశతకము, దాశరధీ శతకములాగా శతకాలు అనేకానేకాలున్నాయి. వాటిల్లో కూడా రాముణ్ణో, కృష్ణుణ్ణో, కాళహస్తీశ్వరుణ్ణో స్తుతిచేస్తూ రాయటం జరిగింది. కాని సౌందర్యలహరికి ఉన్నంత ప్రాశస్త్యం మరి వాటికి లేదు. ఆ గొప్పదనం సౌందర్యలహరికి మాత్రమే ఎందుకు ఆపాదింపబడింది? సౌందర్యలహరి చూడటానికి దేవీస్తుతిలా కన్పించినా ఇందులోని శ్లోకాలు అనేక విషయాల్ని వెల్లడిచేస్తున్నాయి. దీనిలో మంత్ర, యంత్ర, తంత్రాలకు సంబంధించిన రహస్యాలు ఎన్నో ఉన్నాయి. మచ్చుకి వీటిలో కొన్ని చూద్దాం.

సౌందర్యలహరిలోని "శివశ్శక్తిః కామః క్షితిః" అనబడే 32 వ శ్లోకంలో పంచదశీ మహామంత్రం చెప్పబడింది. సంస్కృత భాషకు ఉన్న అక్షరాలను మూడు భాగాలుగా అంటే అ నుంచి అః వరకు మొదటి భాగము, క నుంచి త వరకు రెండవ భాగము, థ నుంచి స వరకు మూడవ భాగముగ చేసి వాటిలో సత్వరజస్, తమోగుణాలు, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల తత్త్వము, చంద్ర, సూర్య అగ్నుల తత్త్వము, జాగ్రత్,స్వప్న, సుషుప్తి అనబడే మూడు అవస్థలు,

షోడశనిత్యలు, పదహారు తిథులు,ప్రకట యోగిని మొదలైన తొమ్మిది మంది యోగినులను, అందులో అంతర్భావం చేసి ఒక్కొక్క భాగానికి ఒక్కొక్క ఖండము అని నామకరణం చేయటం జరిగింది. ఇందులో మొదటి ఖండాన్ని ఆగ్నేయ ఖండం అనీ, ద్వితీయ ఖండాన్ని సూర్య ఖండం అనీ, తృతీయ ఖండాన్ని సౌమ్య ఖండం అనీ అంటారు. ప్రతి ఖండానికీ చివర ఒక హ్రీంకారాన్ని ఏర్పాటు చేయటం జరిగింది. ఆ హ్రీంకారాలనే బ్రహ్మ గ్రంధి, విష్ణుగ్రంథి, రుద్ర గ్రంథి అంటారు. ఈ రకంగా 12 బీజాక్షరాలు మూడు హ్రీంకారాలు మొత్తం 15 అక్షరాలతో, అన్ని మంత్రాలకు నిలయమైనదిగా, అన్ని అవస్థలతో కూడినదిగా, సకల వేదసారమైనదిగా, సమస్త దేవతామయంగా, సర్వ వర్ణాత్మకంగా, సర్వ శక్తి సమన్వితంగా పంచదశీ మహా మంత్రం ఒప్పారు-తున్నది అని చెప్పబడింది. అలాగే 'స్మరం యోని లక్ష్మీం' అనే 33 వ శ్లోకంలో మంత్రోపాసన చెప్పబడింది. "చతుర్భిః శ్రీఖంఠైః" అనబడే 11వశ్లోకంలో శ్రీచక్రాన్ని గురించి వివరణ ఇవ్వబడింది.

శ్రీచక్రంలో 4 శివచక్రాలు, 5 శక్తిచక్రాలు మొత్తం 9 చక్రాలు ఉంటాయి. శ్రీచక్రాన్ని నవయోన్యాత్మకము అంటారు. ఈ నవయోనులు, నవధాతువులకు ప్రతీకలు. పంచభూతాలు శక్తి సంబంధాలు. మాయాదులు శివసంబంధాలు. ఇవి అన్నీ కలిపి 25 తత్వాలు నవయోనులందు అంతర్భావం పొందు తున్నాయి.

శ్రీచక్రంలో 43 కోణాలు, 24 సంధులు, 28 మర్మాలు ఉంటాయి. శ్రీచక్రాన్ని సృష్టి చక్రం అనీ, సంహార చక్రం అనే రెండు రకాలుగా వ్రాయటం జరుగుతుంది. ఇది భూ ప్రస్తారము, మేరు ప్రస్తారము, కైలాస ప్రస్తారము అని మూడు రకాలుగా ఉంటుంది. ఈ రకంగా శ్రీచక్రాన్ని గురించి ఈ శ్లోకంలో వివరించటం జరిగింది.

"చతుషష్ట్యాతంత్రైః" అనే 31 వ శ్లోకంలో కౌళాచారులకు ప్రమాణాలుగా చెప్పబడే 64 కౌళ ఆగమాలను, శుద్ధవిద్యను వివరించటం జరిగింది. శాక్తేయులను వారి కోరికలను బట్టి మూడు రకాలుగా విభజించవచ్చు.

1. కౌళాచారులు : వీరికి ఐహిక వాంఛల యందే ఆసక్తి ఎక్కువ. కౌళ ఆగమాలుగా పిలువబడే మహామాయాశాంబరము, యోగినిజ్వాలశాంబరము, భైరవాష్టకము, యమళాష్టకము, మాలిని, మహాసమ్మోహనము, కామికము, కళాసారము మొదలైన 64 తంత్రాలు, వీరికి ప్రమాణాలు.

2. మిశ్రమాచారులు : వీరికి చంద్ర కళా, జ్యోత్స్నావతి, కళానిధి, కులార్ణవ, కులేశ్వరి మొదలైన మిశ్రమాగమాలు ప్రమాణాలు.

3. సమయాచారులు : వీరిది కేవలము కైవల్యదృష్టి. జీవ బ్రహ్మైక్యమే వీరి సిద్ధాంతము. వీరికి శుభాగ పంచకము అని పిలుపవడే సనక, సనందన, సనత్కుమార, వసిష్ఠ,శుక, సంహితలు ప్రమాణాలు.

ఈ రకంగా దేవి పూజ, ఆచారాలు, తంత్రాలు ఈ శ్లోకంలో వివరించ బడ్డాయి.

"ముఖం బిందుం కృత్వా" అనబడే 19వ శ్లోకంలోనూ, 'నరంవర్షీ యాంసం' అనబడే 13వ శ్లోకంలోనూ స్త్రీవశీకరణం చెప్పబడింది. అలాగే 'మహీంమూలా ధారే' అన్న 9వ శ్లోకంలో పంచభూతాల వశీకరణ,'హిమానీహన్తవ్యం' అన్న 87 వ శ్లోకంలో సర్వవశీకరణ, 'పదం తే కీర్తీనాం' అన్న 88వ శ్లోకంలో సర్వ మృగవశీకరణ, 'అసౌ నాసావంశ' అనే 61వ శ్లోకంలో సకలపురుష వశీకరణ, 'శివేశృంగారార్ద్రా' అనే 51 వ శ్లోకంలో సకల జనవశీకరణ, 'అవిశ్రాన్తం' అన్న 64వ శ్లోకంలోనూ, 'భుజాశ్లేషాత్' అన్న 68వ శ్లోకంలోనూ రాజవశ్యము వివరించ బడ్డాయి.

'స్వదేహోద్భూతా' అనే 30 వ శ్లోకంలో అష్టసిద్ధులు
'నిసర్గ క్షీణస్య' అనే 79 వ శ్లోకంలో ఇంద్రజాలవిద్య
'గురుత్వం విస్తారం' అనే 81 వ శ్లోకంలో అగ్ని స్తంభన
'కరీన్ద్రాణాం' అనే 82 వ శ్లోకంలో జలస్తంభన
'పరాజేతుం రుద్రం' అనే 83 వ శ్లోకంలో గజ, తురగ సైన్యస్తంభన.
'శ్రుతీనాం మూర్ధానో' అనే 84 వ శ్లోకంలో పరకాయ ప్రవేశము.
'త్వదీయం సౌన్దర్యం' అనే 12 వ శ్లోకంలో వశిత్వసిద్ధి
'గిరా మాహు ర్దేవీం' అనే 97 వ శ్లోకంలో వాక్సిద్ధి,
'విశాలా కల్యాణీ' అనే 49 వ శ్లోకంలో నిధినిక్షేపాల దర్శనము చెప్ప బడింది.

రామరావణ సంగ్రామం జరుగుతున్నప్పుడు ఇంద్రజిత్తు నాగాస్త్రం ప్రయోగించి రామలక్ష్మణులను బందీల్నుగాచేశాడు. అప్పుడు గరుత్మంతుడు వచ్చి వారిని బంధవిముక్తులుగా చేశాడు. అలాగే మహా భారతయుద్ధంలో

భీష్ముడు వేసిన నాగాస్త్రాన్ని అర్జునుడు గారుడాస్త్రంతో అడ్డు కుంటాడు.

'కిరన్తీ మజ్గేభ్యః" అన్న 20వ శ్లోకంలో ఈ గారుడాస్త్రాన్ని గురించి చెప్పబడింది.

'జగత్సూతే ధాతా' అన్న 24 వ శ్లోకంలో భూత, ప్రేత, పిశాచ ఉచ్ఛాటన. 36 నుండి 41 వరకు 6శ్లోకాలలోనూ యోగం, ప్రాణాయామం చెప్పబడింది.

'తవాధారే మూలే' అన్న 41 వ శ్లోకంలో కౌళాచారులకు ఆరాధ్యమైన ఆధార చక్రము అందులో ఉపాసనక్రమము, 'తటిత్త్వన్తం శక్త్యా' అన్న 40వ శ్లోకంలో సమయాచారులు మణిపూరం నుండి దేవిని ఉపాసిస్తారని, అక్కడ నుండి ఆజ్ఞా చక్రం వరకు షట్చక్రాలను భేదించాలనీ సమయాచార ఉపాసనామార్గాన్ని 36 నుండి 41 వరకు గల శ్లోకాలలో విలోమంగా చెప్పటం జరిగింది.

'జపో జల్ప శ్శిల్పం' అనే 27వ శ్లోకంలో మంత్రసిద్ధి, భగవద్దర్శనము, "వహ త్యమ్బ స్తమ్బేర మదనుజ" అన్న 74వ శ్లోకంలో ముత్యాలు ఏరకంగా దొరుకుతాయి ? ఎక్కడ దొరికే రత్నాలు ఏ వర్ణంలో ఉంటాయి? 'గళే రేఖాస్తిస్రో' అన్న 69వ శ్లోకంలో సంగీత శాస్త్రము చెప్ప బడ్డాయి.'సుధాసిన్ధోర్మధ్యే' అనే 8వ శ్లోకంలో దేవి ఎక్కడ ఉంటుందీ, చింతామణి గృహము 'తటిల్లేఖా తన్వీం' అనే 21వ శ్లోకంలో సాదాఖ్యకల, 'త్వదీయం సౌన్దర్యం' అన్న 12వ శ్లోకంలో సాయుజ్యం వివరించబడ్డాయి.

"మృషా కృత్వా" అనే 86వ శ్లోకంలో దేవిసాన్నిహిత్యంలో ఉన్న సదాశివుడు, ఆ తన్మయత్వంలో పొరపాటున సవతి పేరు తలచగా కినిసిన దేవి, భర్తను తన కాలితో నుదుటన తన్నగా, గిరిజా కళ్యాణము సమయమున శివుని కోపాగ్నికి దహనమై పోయి అనంగుడుగా మిగిలిన మన్మధుడు, శివుని అవమానించటానికి ఇదే సరైన అదను అని తీర్మానించుకుని, దేవి కాలి అందెల మువ్వల యందు దూరి కిలకిలారావము గావించాడు అని వ్రాయ బడింది. శంకరుల సౌందర్యలహరిలో ఇలాంటి సాహితీ సౌరభాలు ఎన్నెన్నో గుబాళిస్తున్నాయి.

ఈ రకంగా సౌందర్య లహరిలో అనేకానేక రహస్య విషయాలు ఉండటం చేతనే దీనికి ఇంతమంది వ్యాఖ్యానాలు వ్రాయటం జరిగింది.

# శంకర భగవత్పాదులు

కేరళ దేశంలో పూర్ణానదీ తీరంలో 'కాలడి' అనే గ్రామముంది. ఆ గ్రామంలో ఆర్యాంబ, శివగురువు అనే నంబూద్రి బ్రాహ్మణ దంపతులు ఉండేవారు. వారికి చాలా రోజుల వరకు సంతానం లేదు. అప్పుడు వారు త్రిచూరులోని 'వృషాచలేశ్వరుణ్ణి' ఆరాధించగా, ఆ స్వామిదయవల్ల ఒక కుమారుడు కలిగాడు. కుమారుడికి 'శంకరుడు' అని నామకరణంచేసి అల్లారుముద్దుగా పెంచసాగారు. శంకరుడికి మూడు సంవత్సరాల వయసు వచ్చేటప్పటికి అతని తండ్రి శివగురువు పరమపదించాడు.

అప్పటినుండి తల్లి ఆర్యాంబయే కుమారుణ్ణి పెంచుతూ ఐదవ ఏట ఉపనయనం చేసింది. ఆర్యాంబ తన ఇంటి వద్ద ఉన్న ఆలయంలో నిత్యం కాత్యాయనీ దేవిని అర్చిస్తూ ఉండేది. ఒకరోజు తనకు ఆలయానికి వెళ్ళటానికి వీలుపడక బాల శంకరుణ్ణి పంపింది. అయన దేవి నైవేద్యానికి పాలు తీసుకు వెళ్ళాడు. ఆలయంలో దేవిని అర్చించి శంకరుడు దేవికి నైవేద్యంగా పాలు సమర్పించాడు. ఎంతకీ దేవి పాలు త్రాగలేదు. అది చూసి శంకరుడు గుక్క పెట్టి ఏడవటం మొదలు పెట్టాడు. శంకరుడి అవస్థ చూసి దేవి గిన్నెలోని పాలను తాగి వెళ్ళింది. శంకరుడు కనులు తెరచి చూసే సరికి గిన్నె ఖాళీగా కనిపించింది. శంకరుడు మళ్ళీ ఏడవటం మొదలు పెట్టాడు. శంకరుడు ఎందుకు ఏడుస్తున్నాడో దేవికి అర్థంకాలేదు. అప్పుడు దేవి శంకరుడికి ప్రత్యక్షమై అతని ఏడుపుకు కారణం అడిగింది. నీకు నైవేద్యం పెట్టిన తరువాత మా అమ్మ ఆ గిన్నెలోని కొన్ని పాలను నాకు ఇచ్చేది. ఇప్పుడు పాలన్నీ నువ్వే తాగేశావు, నాకు ఆకలి వేస్తోంది. నేనేంతాగాలి? అన్నాడు. దానికి దేవి చలించి శంకరుడికి స్తన్యం ఇచ్చింది. ఆ విధంగా దేవిస్తన్యం గ్రోలినందువల్లే శంకరుడు అంత గొప్ప వాడయ్యాడని ప్రతీతి.

శంకరుడు జన్మించటానికి ముందు భారతదేశంలో వేద విరుద్ధమైన మతాలు బాగా వ్యాప్తిలో ఉన్నాయి. శైవ, వైష్ణవ మతాలు చెలరేగి ప్రజలను అశాంతి పాలు చేస్తున్నాయి. వర్ణాశ్రమ వ్యవస్థ తారు మారయింది. బౌద్ధ, జైన

మతాలు అహింసను మాత్రం ప్రచారంచేస్తున్నాయి. యజ్ఞ యాగాదులను నిరసిస్తున్నాయి. కాపాలికులు భైరవోపాసకులై నరబలులు ఇస్తున్నారు. నాస్తికులు దేవుడు లేడు, వేదము ప్రమాణము కాదు అన్న వాదన లేవదీశారు. శివుడు గొప్ప వాడని కొందరు, విష్ణువు గొప్ప వాడని కొందరు యుద్ధాలు చేస్తున్నారు. ప్రజలు నిత్యం భయభ్రాంతులై బతుకును ఈడుస్తున్నారు.

అటువంటి సమయంలో కుమార స్వామి ఈలోకంలో కుమారిలభట్టు అనే పేరుతో అవతరించి అవైదిక చర్యలు ఖండిస్తున్నాడు. శంకరుడుద్భవించిన సమయమది. తల్లి శంకరుణ్ణి విద్యాభ్యాసం కోసం గురుకులంలో చేర్పించింది. మధుకరవృత్తి చేస్తూ శంకరుడు విద్యా భ్యాసంసాగిస్తున్నాడు. ఒక రోజు శంకరుడు ఒక ఇంటికి వెళ్ళి 'భవతీ బిక్షాందేహి' అన్నాడు. ఆ ఇంటి ఇల్లాలు తాము కడు పేదవారమని, తన భర్తకూడా బిక్షాటనకే వెళ్ళాడనీ తెలిపింది. అప్పుడు శంకరుడు ఆమెతో ఇంట్లో ఏది ఉంటే అది వెయ్యమని అడిగాడు. ఆ ఇల్లాలు ఇల్లంతా వెతకగా ఒక పండిన ఉసిరి కాయ కనిపించింది. దాన్నే ఆమె శంకరుడికి బిక్షగా వేసింది. అది చూసి చలించిన బాల శంకరుడు లక్ష్మీ దేవిని ప్రార్థన చేస్తే, వారింటి ముంగిట బంగారు ఉసిరి కాయల వర్షం కురిసింది. అప్పుడు శంకరుడు లక్ష్మీ దేవిని చేసిన స్తోత్రమే 'కనక ధారాస్తవము'గా పేరు పొందింది.

ఏకసంథాగ్రాహి అయిన శంకరుడు కేవలం రెండు సంవత్సరాలలోనే విద్యాభ్యాసంపూర్తి చేశాడు. శంకరుల కీర్తి ప్రతిష్ఠలు దశ దిశలా వ్యాపించసాగాయి. కేరళ రాజ్యాధిపతి శంకరులకు సాష్టాంగ ప్రణామం ఆచరించి కానుక లందించగా, శంకరులు వాటిని పేదలకు పంచి రాజును ఆశీర్వదించారు. క్రాంగనూరులో ఉన్న ఆలయంలో దేవి ఉగ్రమూర్తిగా ఉందని విని, తనతపశ్శక్తితో ఆమెను ప్రసన్న మూర్తిగా మార్చివేశారు.

ఒకనాడు గౌతమాది మహర్షులు వచ్చి శంకరుల ఆతిధ్యం అందుకుని, వారు చేయవలసిన మహత్కార్యము గుర్తు చేశారు. అప్పుడు శంకరులు తాను నిర్వహించ వలసిన మహత్కార్యానికి ముందు గృహత్యాగం చేసి సన్యాసం స్వీకరించాలి అని సంకల్పించారు.

ఒకరోజున తల్లి తో కలిసి శంకరుడు నదీస్నానానికి వెళ్ళగా అక్కడ ఒక

మొసలి శంకరుని కాలు పట్టుకుంది. అప్పుడు శంకరుడు తానింక బ్రతకననీ, సన్యసించటానికి అనుజ్ఞ ఇమ్మనీ వేడుకోగా తల్లి దుఃఖిస్తూనే సరేనంది. శంకరుడు ఆతుర సన్యాసం' స్వీకరించాడు. శంకరుడు సన్యసించటానికి ఒప్పుకోగానే విచిత్రంగా మొసలి శంకరుని పాదాన్ని వదలి వెళ్ళిపోయింది. శంకరులు నర్మదానదీ తీరానికి వెళ్ళి. అక్కడ గోవింద భగవత్పాదుల వారి వద్ద సంప్రదాయ సన్యాసం స్వీకరించాడు.

ఒక రోజు నర్మదా నదికి వరద వచ్చి ఊరును ముంచెత్తు తున్నది. ప్రజలు భయభ్రాంతులౌతున్నారు. అప్పుడు శంకరుడు నర్మదానదీ ప్రవాహాన్ని తన కమండలంలోకి ఆవాహన చేసి ప్రజలను రక్షించాడు. అది చూసిన గోవింద భగవత్పాదాచార్యుల వారు పరమానందం చెందారు. ఎందుకంటే గతంలో ఒకసారి వ్యాసమహర్షి గోవిందభగవత్పదాచార్యుల వద్దకు వచ్చి 'నర్మదానదిని కమండలంలో పట్టివేసే శిష్యుడు నీకు లభిస్తాడు. అతడే బ్రహ్మసూత్రాలకు భాష్యాలు వ్రాస్తాడు' అని చెప్పాడు. ఆ మాటలు ఇప్పుడు గుర్తు వచ్చి గోవింద భగవత్పాదాచార్యులు శంకరుణ్ణి కాశీ వెళ్ళి విశ్వేశ్వరుని దర్శనం చేసుకుని బ్రహ్మ సూత్రాలకు భాష్యం వ్రాయమని ఆశీర్వదించి పంపారు.

మార్గమధ్యంలో ఒక అడవి గుండా వెడుతుండగా చీకటి పడింది. శంకరుడు ఒకవటవృక్షంక్రింద విశ్రమించాడు. ఒక రాత్రి వేళ ఆచెట్టు మీదున్న బ్రహ్మ రాక్షసుడు శంకరుణ్ణి పట్టుకుని పీడించాడు. అప్పుడు శంకరుడు అతని ప్రశ్నలకు సమాధానాలు చెప్పగావిని, సంతసించి, వ్యాసమహర్షిని దర్శించే ఉపాయం చెప్పి శాపనిమోచనం పొంది అంతర్ధానం అయ్యాడు.

కాశీలో శంకరుడు కొంతమంది శిష్యులను ఏర్పరచుకుని బదరికా వనానికి వెళ్ళి, మందాకినీ నదీ తీరాన నివసిస్తూ ప్రస్థానత్రయము అని చెప్పబడే ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలతో పాటుగా 18 భాష్యములు, 40 ప్రకరణ గ్రంథములు, 74 లఘు గ్రంథములు వ్రాశాడు. వ్యాస మహర్షివృద్ధ బ్రాహ్మణ రూపంలో వచ్చి, బ్రహ్మ సూత్రాలకు శంకరుడు వ్రాసిన భాష్యంవిని ఆనందించి అద్వైతమత స్థాపన చెయ్యమని చెప్పి అంతర్ధానం అయ్యాడు.

పండితులందర్నీ వాదనలో ఓడిస్తూ అద్వైత మత స్థాపన చేస్తూ, తన సంచారంలో ప్రయాగలో కర్మసిద్ధాంతవాది అయిన కుమారిలభట్టును వాదనకు

పిలువగా, ఆయన ,శంకరుడు సాక్షాత్తూ శంకరుడని గ్రహించి ఓటమి నంగీకరించి, తన శిష్యుడైన మండనమిశ్రుణ్ణి గెలవమని చెప్పాడు. శంకరుడు మహిష్మతీ నగరం చేరి, వాదనలో మండనమిశ్రుణ్ణి ఓడించి ఆయనకు 'సురేశ్వరాచార్యులు' అని నామకరణంచేసి శిష్యునిగా చేర్చుకున్నారు.

ఎంత కాలానికీ శంకరుడికి దేవీ తత్వం గురించి పూర్తిగా అవగాహన కాలేదు. అప్పుడు తన గురువైన గోవింద భగవత్పాదాచార్యుల వద్దకు వెళ్ళి, దేవీ తత్వాన్ని గురించి అడగగా, వారు తమకు గురువైన గౌడపాదాచార్యుల వద్దకు వెళ్ళమని సూచించారు.

అప్పుడు శంకరుడు తన పరమగురువైన గౌడపాదాచార్యుల వారి వద్దకు వెళ్ళి దేవీ తత్వాన్ని గురించి అడగగా వారు తాము వ్రాసిన సుభగోయస్తుతి ని చదవమని చెప్పారు. ఆ రకంగా సుభగోదయ స్తుతి చదివిన తరువాత శంకరుడు శ్రీ శైలక్షేత్రానికి వచ్చి శివానన్దలహరి, సౌన్దర్యలహరి అనే గ్రంథాలు వ్రాశారు. మూకాంబా క్షేత్రంలో పుట్టిన దగ్గర నుండి జడుడు లాగా ఉన్న ప్రభాకరుడన్న బాలుణ్ణి అనుగ్రహించి అతనికి సన్యాసమిచ్చి 'హస్తామలకుడు' అని పేరుపెట్టారు. శంకరులు శృంగేరి చేరి, ఒకమఠాన్ని స్థాపించి, దానికి సురేశ్వరాచార్యులను పీఠాధిపతిగ చేశారు. అక్కడ మందబుద్ధి అయిన ఒక బాలుణ్ణి, కేవలం సంకల్పమాత్రంచేత పండితుణ్ణి చేసి, సన్యాసమిచ్చి 'తోట కాచార్యు'లని పేరు పెట్టారు.

శంకరుడు జైత్రయాత్ర చేస్తూ ద్వైతులను, శాక్తేయులను, లక్ష్మీ ఉపాసకులను, వీరశైవులను, వైష్ణవులను, పాంచరాత్రులను, హిరణ్యగర్భులను, సూర్య, అగ్ని, గణపతి ఉపాసకులను ఓడించి అద్వైత మత స్థాపన చేశారు.

తన జైత్ర యాత్రలో భాగంగా మగధ చేరాడు. అక్కడ ప్రజలు "అన్నీ తెలిసిన మీ బోటి వారికి నిర్గుణోపాసన తగి ఉన్నది. కాని మావంటి వారి సంగతి ఏమిటి? అని ప్రశ్నింపగా, శంకరుడు వారి కోరిక మన్నించి సగుణోపాసనకు అనువుగా షణ్మత స్థాపన చేసి, ఉపాసనా పద్ధతులు, బహు దేవతాస్తుతులు రచించాడు. అర్చన విధులలో అందరూ విధిగా అర్చించాలని నియమం ఏర్పాటు చేసి, వివిధ దేవతా సంపుటి అయిన పంచాయతనం ప్రవేశ పెట్టారు. పంచాయతనం అంటే అదిత్యుడు అంబిక, గణపతి, శివుడు, విష్ణువు

పంచాయతనం పంచ భూతాలకూ ప్రతీక.

| | |
|---|---|
| 1. వాయు తత్త్వాత్మకుడు | సూర్యుడు |
| 2. అగ్ని తత్త్వాత్మక | పరాశక్తి (అంబిక) |
| 3. పృధివీతత్త్వాత్మకుడు | గణపతి |
| 4. ఆకాశ తత్త్వాత్మకుడు | సదాశివుడు |
| 5. జలతత్త్వాత్మకుడు | నారాయణుడు |

ఈ ఐదుకాక సుబ్రహ్మణ్యేశ్వరుడికి కూడా ప్రత్యేకమైన అర్చన చెప్పాడు.

కాశ్మీర దేశంలో ఉన్న సర్వజ్ఞ శారదా పీఠం అధిష్టించిన వాడే జగద్గురువని విని అక్కడికి బయలు దేరారు. ఆ పీఠానికి ఎనిమిది దిక్కులందు, ఎనిమంది ఉద్దండులైన పండితులుంటారు. వారందరినీ ఓడించి పీఠాన్ని అధిష్టించ బోతుండగా సరస్వతీ దేవి ప్రత్యక్షమై 'స్త్రీ సంగమ దోషం నీకున్నది కాబట్టి ఈ పీఠం అధిష్టించటానికి నీవు అర్హుడవు కాదు' అన్నది దానికి శంకరుడు 'వేరొక శరీరంతో చేసిన పాపం ఆత్మను అంటదు' అని సమాధానమిచ్చి, ఆమెను నిరుత్తరను చేసి శారదా పీఠం అధిష్టించి జగద్గురువయ్యాడు.

అద్వైత ప్రచారంకోసం భారతదేశానికి నాలుగు వైపులా నాలుగు పీఠాలు స్థాపించారు. దక్షిణాన శృంగేరి యందు, పడమరన ద్వారక యందు, ఉత్తరాన బదరి యందు, తూర్పున పూరి యందు, ఆమ్నాయపీఠాలు ఏర్పాటు చేసి వాటియందు వరుసగా సురేశ్వర, హస్తామలక, తోటకాచార్య, పద్మపాదులను పీఠాధిపతులుగా నియమించి, కేదారము చేరి శిష్యులను ఆశీర్వదించి దత్తాత్రేయ గుహలోకి వెళ్ళి అదృశ్యులై పోయారు.

చేటీభవ న్నిఖిల ఖేటీ కదంబ తరు వాటీషు నాకిపటలీ
కోటీర చారుతర కోటీమణి కిరణ కోటీ కరంబితపదా
పాటీర గంధ కుచ శాటీ కవిత్వ పరిపాటీ మగాధిపసుతా
ఘోటీకులా దధిక ధాటీ ముదార ముఖవీటీ రసేన తనుతామ్

# దేవి అంటే ఎవరు? ఎక్కడ ఉంటుంది?

సృష్టిస్థితి వినాశానాం శక్తి భూతేసనాతని
గుణాశ్రయే గుణమయినారాయణి నమోస్తుతే

శంకర భగవత్పాదుల వారు సౌందర్యలహరి అనే గ్రంథంలో దేవిని స్తుతి చేస్తూ 100 శ్లోకాలు వ్రాశారు. ఇంతకీ దేవి అంటే ఎవరు ? మహాకాళి, మహాలక్ష్మి మహాసరస్వతుల స్వరూపమైన పరాత్పరి, జగదంబే ఆ జగన్మాత.

ఇంద్రియ గోచరమైన జ్ఞానము అన్ని ప్రాణులకు ఉంటుంది. అయితే ఇంద్రియ విషయాలను అవి వేరువేరుగా తెలుసుకుంటాయి. కొన్ని ప్రాణులు పగలు చూడ గలుగుతాయి. కొన్ని రాత్రులందు చూడగలుగుతాయి. మరికొన్ని పగలు, రాత్రి కూడా చూడ గలుగుతాయి. ఇంద్రియ జ్ఞానము కేవలము మనుషులకే కాదు పశువులకు పక్షులకు కూడా ఉంటుంది. అయినప్పటికీ దేవి యొక్క మాయ చేత జ్ఞానాన్ని కోల్పోయి, మమత అనే సుడి గుండంలో పడి మోహము అనే రొంపిలో కూరుకు పోతున్నారు. ఆ మహామాయ అంటే విష్ణువు యొక్క యోగ నిద్ర. విష్ణువు యొక్క తామసశక్తినే యోగనిద్ర అంటారు. ఆమె చేతనే చరాచర జగత్తు సమ్మోహనము చేయబడుతోంది. ఈ జగత్తు యావత్తు ఆమె చేతనే సృష్టించబడుతోంది. ఆవిడ గనక అనుగ్రహించి నట్లైతే మానవులకు కైవల్యం సిద్ధిస్తుంది. ఆమె పరావిద్య, ముక్తి హేతువు. శాశ్వత సంసార బంధానికీ ఆమెయే హేతువు. ఈశ్వరులకు ఈశ్వరి ఆమెయే. ఆమెయే నిత్య. ఆమెయే ఈ చరాచర జగత్తుగా మూర్తీ భవించినది. ఆమెయే ఈ లోకానికి పాలకురాలు. జగన్నిర్వాహకురాలు. సృష్టిస్థితిలయకారిణి. దుర్గాసప్తశతిలో ఈ విధంగా చెప్పబడింది.

త్వం స్వాహా త్వం స్వధా త్వం హి వషట్కారః స్వరాత్మికా।
సుధా త్వమక్షరే నిత్యే త్రిధామాత్రాత్మికా స్థితా ॥
అర్ధమాత్రా స్థితా నిత్యా యానుచ్చార్యావిశేషతః।
త్వమేవ సా త్వం సావిత్రీ త్వం దేవజననీ పరా ॥

త్వయైతద్ధార్యతే విశ్వం త్వయైతత్ సృజ్యతే జగత్।
త్వయైతత్ పాల్యతే దేవి త్వమత్స్యన్తే చ సర్వదా॥

విసృష్టౌ సృష్టిరూపా త్వం స్థితి రూపా చ పాలనే।
తథా సంహృతిరూపాన్తే జగతోఽస్య జగన్మయే॥

మహావిద్యా మహామాయా మహామేధా మహాస్మృతిః।
మహామోహా చ భవతీ మహాదేవీ మహాసురీ॥
ప్రకృతిస్త్వం చ సర్వస్య గుణత్రయవిభావినీ।
కాళరాత్రిర్మహారాత్రిర్మోహరాత్రిశ్చ దారుణా॥

త్వం శ్రీస్త్వమీశ్వరీ త్వం హ్రీస్త్వం బుద్ధిర్బోధలక్షణా।
లజ్జా పుష్టిస్తథా తుష్టిస్త్వం శాన్తిః క్షాన్తిరేవ చ॥

ఖడ్గినీ శూలినీ ఘోరా గదినీ చక్రిణీ తథా।
శఙ్ఖినీ చాపినీ బాణభుశుణ్డీపరిఘాయుధా॥

సౌమ్యా సౌమ్యతరాశేషసౌమ్యేభ్యస్త్వతిసున్దరీ।
పరాపరాణాం పరమా త్వమేవ పరమేశ్వరీ॥

బ్రహ్మదేవుడు ఆ పరాత్పరిని ఈ విధంగా ప్రార్థిస్తాడు. తల్లీ దేవతలప్రీత్యర్థము హోమకుండంలో ఆహుతులు సమర్పించేటప్పుడు చెప్పే 'స్వాహా' అను మంత్రము నీవే. పితృ దేవలకు తర్పణచేయునప్పుడు చెప్పే 'స్వధా' అనే మంత్రము నీవే. యజ్ఞము, యజ్ఞ మూలమున సాధింపబడు స్వర్గము కుడా నీవే. దేవతలకు ఆహారమగు సుధవు నీవే. నీవు నాశనము లేని దానవు, శాశ్వతవు. అ, ఉ, మ్. అను మూడు మాత్రలతో కూడిన ఓం కారము నీవు. ఓంకార ఉచ్చారణనంతరము లయించు సూక్ష్మశబ్ద ప్రవాహమైన 'అర్థమాత్ర' లేక 'నాదము' నీవే.

ఈ జగత్తునీచేతనే సృష్టించబడుచున్నది. నీ చేతనే పాలింపబడు చున్నది. చివరకు నీ చేతనే మింగివేయబడుచున్నది. తల్లీ నీవు జగత్సృష్టి కాలమున సృజన శక్తి గను స్థితికాలమున పాలనశక్తిగను, లయకాలమున సంహారణశక్తి గను ఉంటావు. మహాజ్ఞానమయివి, అజ్ఞానమయివి నీవే. నీవు మహాబుద్ధివి,

మహాస్మరణశక్తివి, మహాభ్రాంతివి, మహాదేవివి. మహాసురివి అనగా ఎంతటి శుభశక్తివో అంతటి అశుభశక్తివికూడా నీవే.

సర్వస్వమునకు మూలకారణమైన ప్రకృతివి నీవే. సత్వ, రజస్, తమస్సులనబడు త్రిగుణములు నీవే. కల్పాంత ప్రళయ కాలపు కాళరాత్రివి నీవే. అంతిమ ప్రళయ కాలపు మహా రాత్రివి నీవే, భయంకరమగు మోహరాత్రివి నీవే. నీవే లక్ష్మివి, ఈశ్వరివి, జ్ఞాన చిహ్నమగు బుద్ధివి. లజ్జ, పుష్టి, తుష్టి, శాంతి, ఓరిమికలదానవునీవే. ఖడ్గము, శూలము, గద, చక్రము, శంఖము, ధనుర్బాణములు, భుశుండి, ఇనుపకట్ల గుదియ (పరిఘా) అను ఆయుధములు ధరించిన భయంకరివి. శరణాగతులకు క్షేమంకరివి. శత్రువులకు, అవిధేయులకు భయంకరివి. శుభ ప్రదమైన వస్తువులన్నింటిలో అత్యంత శుభప్రదమైన దానవు. పరాపరములకు అతీతమైన పరమేశ్వరి నీవే. చతుశ్శతిలో శివుడు పార్వతికి ఈ విధంగా చెపుతున్నాడు. శ్లో॥ శృణుదేవి మహాజ్ఞానం సర్వజ్ఞానోత్తమం ప్రియే

యేన విజ్ఞాన మాత్రేణ భవాబ్ధౌ న నిమజ్జతి॥

త్రిపురా పరమా శక్తి రాద్యా జాతా మహేశ్వరి
స్థూల సూక్ష్మ విభాగేన త్రైలోక్యోత్పత్తి మాతృకా॥

కబలీకృతనిశ్శేష తత్త్వ గ్రామ స్వరూపిణీ
యస్యాం పరిణతాయాంతు నకించిత్పర మిష్యతే॥

దేవీ! ఎల్ల జ్ఞానములకన్న ఉత్తమమైన జ్ఞానమును నీకు చెప్పెదనువినుము. ఏ విషయము తెలిసినంతమాత్రము చేత మానవుడు సంసార సాగరమున మునిగి పోడో అజ్ఞానము ఇది. మహేశ్వరి, త్రిపుర, పర, అను శక్తి ఆమెయే. స్థూల సూక్ష్మ విభాగముల చేత ముల్లోకములకు ఉత్పత్తి కారణమైన ఆమెయే జగన్మాత! ఈ విధంగా దేవతలచేత అనేక చోట్ల అనేక విధాలుగా కీర్తించబడటం చేత సర్వమంత్రమయి, సర్వయంత్రమయి, సర్వతంత్రమయి, సర్వజగన్మయి కూడా దేవియే అని తెలుస్తుంది.

అయితే ఆ దేవి ఎక్కడ ఉంటుంది ? సౌందర్యలహరిలో ఈ విధంగా ఉంది

శ్లో॥ సుధాసిన్ధోర్మధ్యే సురవిటపివాటీపరివృతే
మణిద్వీపే నీపోపవనవతి చిన్తామణిగృహే
శివాకారే మఞ్చే పరమశివపర్యఙ్కనిలయామ్

అంటే పాలసముద్రము మధ్య ఉన్న రతనాల దీవిలో, కల్పవృక్షములతో చుట్టబడిన కదంబవనంలో చింతామణులతో కట్టబడిన గృహంలో శక్తి స్వరూపమైన త్రికోణాకారమంచమందు పరమ శివుని పర్యంకమున ఉన్నది అని అర్థం.

ఇదే విషయం. భైరవయామళము, వామకేశ్వ రతంత్రము, బహురూపాష్ట కాలలో కూడా చెప్ప బడింది.

శ్లో॥ బిందుస్థానం సుధా సింధుః పంచయోన్య స్సురద్రుమాః।
తత్రైవ నీపశ్రేణీచ, తన్మధ్యే మణిమంటపమ్॥

శ్లో॥ తత్ర చింతామణి కృతం దేవ్యా మందిర ముత్తమమ్।
శివాత్మకే మహామంచే మహేశా నోపబర్హణే॥

శ్లో॥ అతిరమ్యతరే తత్ర కశిపుశ్చ సదాశివః।
భృతకాశ్చ చతుష్పాదా మహేంద్రశ్చ పతద్గ్రహః॥

శ్లో॥ తత్రాస్తే పరమేశానీ మహాత్రిపురసుందరీ।
శివార్కమండలం భిత్త్వా, ద్రావయంతీందుమండలమ్॥

శ్లో॥ తద్భూతామృతస్యంది పరమానంద నందితా।
కులయోషి త్కులంత్యక్త్వా, పరం పర్షణ మేత్యసా॥

బిందుస్థానమే పాలసముద్రం. పంచయోనులే కల్పవృక్షాలు. అక్కడ కదంబవనంమధ్యలో మణిమంటపం. ఆమణులు చింతామణులు. చింతామణి అంటే కోరిన కోర్కెలు తీర్చే శక్తి గలది అని ప్రతీతి. అటువంటి చింతామణులు అనేకానేకాలతో నిర్మించిన దేవీమందిరం అత్యుత్తమము. శక్తి రూపమైన మంచమున పరమేశ్వరుడు తలగడ, బ్రహ్మాదులు సేవకులు, ఇంద్రుడు తమ్మిపడిగ, అక్కడ మహాత్రిపురసుందరి ఉంటుంది.

'త్వాంగౌరీం త్రిపురాం పరాత్పరకళాం శ్రీచక్ర సంచారిణీం' అనుట చేతనూ, 'శ్రీచక్రనగర సామ్రాజ్ఞి' అనుట చేతనూ దేవి శ్రీ చక్రమునందు సంచరిస్తూ ఉంటుంది అనీ, శ్రీచక్రపురానికి ఆమెయే మహారాజ్ఞి అని తెలుస్తున్నది.

బిందు త్రికోణ వసుకోణ దశారయుగ్మ
మన్వశ్రదళ సంయుత షోడశారమ్
వృత్తత్రి భూపుర యుతం పరిత శ్చతుర్ద్వాః
శ్రీచక్ర మేత దుదితం పరదేవతయాః.

బిందువు, త్రికోణము, అష్టకోణము, దశకోణయుగ్మము, చతుర్దశకోణము, అష్టదళము, షోడశదళము, మేఖలాత్రయము, భూ పురత్రయము ఉన్న శ్రీచక్రంలో పరదేవత అయిన ఆపరమేశ్వరి ఉంటుంది. ఇదే విషయాన్ని భైరవయామళంలో

శ్లో॥ చతుర్భి శ్శివచక్రైశ్చ శక్తిచక్రైశ్చ పంచభిః
నవ చక్రైశ్చ సంసిద్ధం శ్రీచక్రం శివయోర్వపుః ॥

శివచక్రములు నాలుగు, శక్తి చక్రములు ఐదు, మొత్తం తొమ్మిది చక్రములతో కూడిన శ్రీ చక్రము శివశక్తుల శరీరమై ఉన్నది. వీటిని పట్టి దేవి శ్రీచక్ర నివాసి అని స్పష్టమౌతున్నది. సౌందర్యలహరిలో ఈ విధంగా ఉంది.

శ్లో॥ గతా స్తే మఞ్చత్వం ద్రుహిణహరి రుద్రేశ్వర భృతః
శివస్స్వచ్ఛచ్ఛాయా ఘటిత కపట ప్రచ్ఛద పటః।
త్వదీయానాం భాసాం ప్రతిఫలన రాగారుణతయా
శరీరీ శృంగారో రస ఇవ దృశాం దోగ్ధి కుతకమ్॥

బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, ఈశ్వరుడు అను నలుగురు కామరూపులయిన వారు కాబట్టి, నీకు, దగ్గరగా ఉండి నిన్ను సేవించు కోవాలనే కోరిక ఉన్న వారు కాబట్టి, నీవు పడుకునే మంచానికి కోళ్ళుగా ఉండి, నిన్ను సేవించు కుంటున్నారు. తెల్లని రంగుగల సదాశివుడు నీవు కప్పుకొను దుప్పటి అయి, నీశరీరపు ఎర్రని కాంతులతో తాను కూడా ఎర్రగా ప్రకాశిస్తున్నాడు. అని చెప్పబడింది. దీనివల్ల దేవి ఈశ్వరులందరకూ ఈశ్వరి, పరమేశ్వరి అని తెలుస్తోంది.

శ్లో॥ సుధాబ్ధౌ నందనోద్యానే, రత్నమంటప మధ్యమాం
బాలార్క మండలాభాసాం, చతుర్బాహుం త్రిలోచనామ్॥

శ్లో॥ పాశాంకుశ శరాం శ్చాపం ధారయంతీం, శివాం శ్రియం (శ్రియే)
ధ్యాత్వాచ హృద్గతం చక్రం వ్రతస్థః పరమేశ్వరమ్
పూర్వోక్త ధ్యానయోగేన చింతయన్ జపమాచరేత్.—

పాల సముద్రంలోని నందనోద్యానంలో, రత్నమంటపం మధ్యలో

నాలుగు చేతులు, మూడు కనులు కలిగి, చేతులయందు పాశము, అంకుశము, ధనస్సు, బాణములు ధరించి బాలభాస్కరుని వలె ప్రకాశిస్తున్న భగవతిని హృదయంలో ధ్యానించి, అర్చించి జపమాచరించవలెను. అంటే షట్చక్రాలను భేదించి. సహస్రారంచేర్చి దేవిని అక్కడ ధ్యానించాలి ఇదేవిషయాన్ని. భగవత్పాదులు ఈ విధంగా చెబుతున్నారు.

"సుధాసింధు మధ్యే సురవిటపివాటీ పరివృతే మణిద్వీపే నీపోపవనవతి చింతామణి గృహే
స్ఫురత్సర్వసింహాసనే రత్నపీఠే శివాంకే నిషణ్ణాం భజామ్యన్నపూర్ణామ్."

ఒకకల్పవృక్షానికే మన కోర్కెలు తీర్చేశక్తి ఉన్నది. ఒక చింతామణికే మన ఇష్టార్థ దాతృత్వం ఉంది. మరి అలాటి కల్పవృక్షాలు, చింతామణులు కోకొల్లలుగా ఉన్న ప్రదేశంలో దేవి ఉంది. అంటే దేవి ఉన్న ప్రదేశం చాలా ఉత్తమమైంది. అక్కడికి చేరాలి. ఆమెను దర్శించాలి. ఆమెను ధ్యానించాలి అని సంకల్పించనంత మాత్రం చేతనే ఇష్టకామ్యాలు నెరవేరతాయి. ఆ దేవి ఎలా ఉంటుందీ అంటే భగవత్పాదులు సౌందర్యలహరి లో చెప్పినట్లుగా

శ్లో॥ క్వణత్కాఞ్చీదామా కరికలభ కుంభ స్తననతా
పరిక్షీణామధ్యే పరిణత శరచ్చంద్రవదనా
ధనుర్బాణాన్ పాశం సృణి మపి దధానా కరతలైః
పురస్తా దాస్తాం నః పురమథితు రాహో పురుషికా॥

మెరయుచున్న మణుల మొలనూలు, గున్న ఏనుగు కుంభములతో సాటివచ్చు స్తనద్వయము, సన్నని నడుము, శరత్కాలములోని నిండు జాబిల్లి వంటి మొగము, చెరకువిల్లు, పూబాణాలు, పాశము, అంకుశము తన నాలుగు చేతులందు ధరించి ప్రకాశించుచున్నది. త్రిపురాసురసంహారము చేసిన శివుని యొక్క అహంకారముగా భాసించుచున్నది. ఇదే విషయాన్ని లక్ష్మీధరుడు తన 'కర్ణావతంసస్తుతిలో' ఈ విధంగా చెప్పారు.

భవాని శ్రీహస్తైర్వహసి ఫణిపాశం,స్ప్రణిమథో
దనుః సాంద్రం పౌష్పంశరమథజపస్రక్కుకవరాయ్.
అథ ద్వాభ్యాంముద్రామభయవర దానై కరిపికే

క్వణద్వీణాం వ్యాఖ్యా ముద్రపి చ కరాభ్యాం చ బిభ్రషే.

ఓ భవానీ, నీవు హస్తముల చేత సర్పరూప పాశము, అంకుశము, పుండ్రేక్షుచాపము, పుష్ప బాణము, జపమాల, శుకవరము, మరి రెండు హస్తములచేత వీణ ధరించి ఉన్నావు.ఇదేవిషయాన్ని కాళిదాసు ఇలా అన్నాడు.

చతుర్భుజే చంద్రకళావతంసే కుచోన్నతే కుంకురాగశోణే
పుండ్రేక్షు పాశాంకుశ పుష్పబాణహస్తే నమస్తే జగదేక మాతః
అంతేకాదు. మన పూజావిధానంలో కూడా ఈ విధంగానే చెప్పబడింది.
ప్రాగామ్నాయమయ ప్రాగ్ద్వారే ద్వారశ్రీయైనమః
దక్షిణామ్నాయమయ దక్షిణద్వారే ద్వారశ్రీయై నమః
పశ్చిమాయ్నాయమయ పశ్చిమద్వారే ద్వారశ్రీయైనమః
ఉత్తరామ్నాయమ ఉత్తరద్వారే ద్వారశ్రీయైనమః
తన్మధ్యే క్షీరసాగరాయనమః
క్షీరసాగరమధ్యే రత్న ద్వీపాయనమః
రత్న ద్వీపమధ్యే కల్ప వృక్షవాటికాయైనమః

తన్మ ధ్యే రత్న సింహాసనాయైనమః రత్న సింహాసనోపరిస్థితా శ్రీ రాజరాజేశ్వరీ పరాభట్టారికాయైనమః ఇతియోని ముద్రాంప్రణమేతు.

వీటన్నింటి నీపట్టి చూసి నట్లైతే దేవి పాలసముద్రంలో, రతనాలదీవిలో, కల్పవృక్ష ఛాయలో, చింతామణి గృహంలో పాశము, అంకుశము, ధనుర్బాణములు ధరించి కోట్లకొలది సూర్య చంద్రుల కాంతితో ప్రకాశిస్తూ శివునితో కూడి ఉంటుందని తెలుస్తున్నది.. అటువంటి దేవిని గనకపూజించినట్లైతే అంబాస్తవంలో చెప్పినట్లుగా

"యః స్ఫటికాక్షగుణ పుస్తక కుండికాఢ్యాం
వ్యాఖ్యా సముద్యతకరాం శరదిందుశుభ్రామ్।
పద్మాసనాం చ హృదయే భవతీముపాస్తే
మాతః స విశ్వకవితాం కిం చక్రవర్తీ॥"

మార్కేండేయుడు చెప్పినట్లుగా

"స్తుతా సంపూజితా పుష్పై ర్ధూపగంధాదిభి స్తథా।
దదాతి వి త్తం పు త్రాంశ్చ మతిం ధర్మే తథా శుభమ్॥"

"సా చింతితా చ విజ్ఞానం తుష్టా బుద్ధిం ప్రయచ్ఛతి"

"ఆరాధితా సైవ నృణాం భోగస్వర్గాప వర్గదా"

"శరణాగత దీనా ర్త పరిత్రాణ పరాయణా॥
సర్వస్యా ర్తి హరే దేవి నారాయణి నమో స్తుతే."

భక్తి చేత నమస్కరించినంత మాత్రము చేతనే దేవి మనకు శుభముల నిచ్చును. ఆమెను కీర్తించి నంత మాత్రము చేతనే, సౌభాగ్యము, సారూప్య, సౌశీల్యాదికము ఇచ్చును. పశు, పుత్ర, ధనలాభము, దారిద్ర్యనాశనము అభీష్ట సిద్ధికలుగుతాయి.

అయితే దేవిని పూజించే టప్పుడు రాగద్వేషాలకు అతీతంగా ఉండాలి. 'వామకేశ్వరతంత్రం'లో చెప్పినట్లుగా

శ్లో॥ పాశాంకుశౌ తదీయౌతు రాగద్వేషాత్మకౌ స్మృతౌ
శబ్ద స్పర్శాదయో బాణాః మన స్తస్యాఃధనుః॥
కరణేంద్రియచక్రస్థాం దేవీం సంవిత్స్వరూపిణీమ్
విశ్వాహంకార పుష్పేణ పూజయే త్సర్వసిద్ధిభాక్॥
ఇయం ఉపాసనా (అయ ముపాసనవిధిః.) క్రియాత్మకో నాదరణీయః

దేవి యొక్క పాశాంకుశములే రాగద్వేషములు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలనబడే పంచతన్మాత్రలే బాణాలు. మనస్సే ఆమె ధనస్సు. శ్రీచక్రము నందున్న ఆ దేవిని అహంకారమను పుష్పముచేత పూజించినట్లైతే సాధకుడు సర్వసిద్ధులూ పొందుతాడు.

# పంచదశీ మహామంత్రము

దైవాధీనం జగత్సర్వం, మంత్రాధీనంతుదైవతమ్

చరాచర జగత్తు అంతా కూడా దైవము యొక్క అధీనంలో ఉంది. దైవం మంత్రానికి అధీనం అయిఉంది. కాబట్టి మంత్రానికి ప్రాముఖ్యం ఉంది. 'మననాత్త్రాయత ఇతి మంత్రః' మననము వలన మననము చేయు వానిని రక్షించు దానిని మంత్రము అంటారు. దేవతలయొక్క దయకు పాత్రులు కావాలంటే మంత్ర జపంచేయ్యాలి. దీన్నే 'ఉపాసన' అంటారు. ప్రాచీన కాలం నుంచీ మన దేశంలో అనేకమైన ఉపాసనామార్గాలున్నాయి. వీటిలో గాణాపత్యం, శైవం, వైష్ణవం, శాక్తేయం వంటివి ఎక్కువ ప్రాచుర్యం పొందాయి. శక్తిని ఆరాధించే వారిని శాక్తేయులు అంటారు. శాక్తేయంలో బహు విధమార్గాలున్నాయి. వీటిలో శ్రీ విద్య బహుళ ప్రాచుర్యం పొందింది. శ్రీవిద్యనే చంద్రకళా విద్య అని కూడా అంటారు. శ్రీవిద్యలో పంచదశీ మహామంత్రం ముఖ్యమైనది.

అరణి మథిస్తే అగ్ని ఎలాపుడుతుందో అలాగే మంత్రాన్ని జపించినట్లైతే శక్తి పుడుతుంది. ఆశక్తి సాధకునికి సర్వార్థాలూచేకూరుస్తుంది. బీజాక్షరాలచే సంపుటం చేయబడిన మంత్రజపం వల్ల దేవతానుగ్రహం త్వరగా కలుగుతుంది. ఆయా దేవతల యొక్క తత్త్వాలకు అనుగుణమైన బీజాక్షరాలు ఋషులచేత మంత్రాలకు సంపుటీకరణం చేయబడ్డాయి.

పరమేశ్వరునికి బీజం ఓంకారము. అలాగే ఈం లక్ష్మీబీజం, ఐం వాగ్బీజం, క్లీం మన్మథ బీజం, హ్రీం శక్తి బీజం, గం గణపతి బీజం. దేవతలకే కాక పంచభూతాలకు కూడా విడి విడిగా బీజాక్షరాలున్నాయి. లం పృథివీ బీజం, హం ఆకాశ బీజం,యం వాయు బీజం, రం అగ్ని బీజం, వం అమృత బీజం.

ప్రతి మంత్రంలోనూ దేవతపేరూ, బీజాక్షరాలూ ఉంటాయి. మనం అనేక విధాలయిన యంత్రాలు కూడా చూస్తూ ఉంటాం. ప్రతి యంత్రంలోనూ ఆయాదేవతలకు సంబంధించిన మంత్రాలు, బీజాక్షరాలు, ఉండటాన్ని గమనించ వచ్చు. మంత్రాలలో పంచదశీ మహామంత్రానికి ఒక ప్రత్యేకత ఉంది. దీనిలో బీజాక్షరాలు మాత్రమే ఉంటాయి. ఏ దేవత పేరూ ఉండదు. అల్లాగే పంచదశీ మహామంత్రానికి యంత్రరూపమైన శ్రీచక్రానికి కూడా ప్రత్యేకత ఉంది. దీనిలో

మిగిలిన మంత్రాలలో లాగా దేవత పేరుగానీ, బీజాక్షరాలుగానీ ఉండవు. ఇది కేవలం రేఖా నిర్మితము.

మంత్రాలు మూడు రకాలు అవి

1. వైదికములు 2. తాంత్రికములు 3. అపభ్రంశములు

వేదములయందు చెప్పబడిన మంత్రాలను వైదిక మంత్రాలు అంటారు. ఇవి జ్ఞాన ప్రదములు.

కామ్య ప్రదమైనవి తాంత్రికములు. సంస్కృతమున కాక ఇతరమైన దేశభాషలలో గల మంత్రాలు అపభ్రంశములు. ఇవి మలయాళ మంత్రాలు, తెలుగు, హిందీ భాషలలో మంత్రాలు, పాముమంత్రము, తేలుమంత్రము మొదలయినవి.

'వైదికాః ప్రణవైర్యుతాః ప్రణవేనవిహీనస్తు తాంత్రికా ఏవప్రకీర్తి తాః'

ఓంకార సహితములు వైదిక మంత్రాలనీ, ఓంకార రహితములు తాంత్రికములని, చెప్పబడుతున్నాయి.

మంత్రాలను స్త్రీ, పురుష, నపుంసక మంత్రాలు అని మూడు రకాలుగా విభజించవచ్చు. 'స్వాహా' అనే పదము చివర కలవి స్త్రీ మంత్రములు. 'హుంఫట్' అనే పదము చివర కలవి పురుష మంత్రములు. 'నమః' 'అనే పదము చివర కలవి నపుంసక మంత్రములు. పురుష దేవతలను ఉపాసించే వాటిని మంత్రాలనీ, స్త్రీ దేవతలను ఉపాసించే వానిని 'విద్య' అనీ అంటారు. వీటిలో ఒక అక్షరము కలవాటిని 'పిండము' లనీ, మూడు అక్షరములు కలవాటిని 'కర్తరు' లనీ, మూడు నుంచి తొమ్మిది అక్షరములు కలవాటిని 'బీజము' లనీ పదినుంచి, ఇరవైవరకు అక్షరములు కలవాటిని మంత్రములనీ, ఇరవై అక్షరములుకన్న ఎక్కువ ఉన్నమంత్రములను మాలామంత్రములని అంటారు. వైదికమంత్రాలు సమయాచారానికీ, తాంత్రిక మంత్రాలు వామాచారానికీ సంబంధించినవి. సాధకులు ఎల్లప్పుడూ వైదికమంత్రాలనే జపించాలి. సప్తకోటి మంత్రాలలో ప్రధానమైనవి వైదికమంత్రాలే.

శ్రీవిద్యలో పంచదశీ మహామంత్రము ప్రసిద్ధమైనది. శాక్తేయానికి ఇది గాయత్రివంటిది. గాయత్రి.మహామంత్రము బ్రాహ్మణులకోసం ఏర్పడగా పంచదశీ మహామంత్రం నాలుగువర్ణాల వారికీ ఉపాశ్య అని అగస్త్యమహర్షి వ్రాసిన

'శ్రీవిద్యాదీపిక' లో చెప్పబడింది. పంచదశీమహామంత్రం మాయనుపోగొట్టి పరబ్రహ్మమును ప్రకాశింపచేస్తుంది. సూర్యుడికి కిరణములు ఉన్నట్లుగానే పరబ్రహ్మ (శివునకు) కు మాయ (శక్తి) సహజముగా ఉంటుంది. కాబట్టి కేవలము శివుణ్ణి గాని, శక్తిని గాని ఆరాధించటం కుదరదు. శివ ప్రధానమైనది సమయాచారము. శక్తి ప్రధానమైనది వామచారము.

పూర్వకాలంలో ఎంతోమంది మహానుభావులు ఈ పంచదశీ మహామంత్రాన్ని జపించి తరించారు అని చెప్పబడుతోంది.

మనుశ్చంద్రకుబేరశ్చ లోపాముద్రాచమన్మథః
అగస్తి రగ్ని సూర్యశ్చ ఇంద్రస్కందశ్చి వస్తథా
క్రోధ భట్టారకోదేవ్యాద్వాదశాదో ఉపాసకాః

మనువు, చంద్రుడు, కుబేరుడు మొదలైన 12 మంది ఈ మహా మంత్రాన్ని ఉపాశించారు. ఇదేవిషయాన్ని 'మానసోల్లాసము' అనే గ్రంథంలో

శ్లో॥ విష్ణుః శివః సురజ్యేష్ఠో మనుశ్చంద్రో ధనాధిపః
లోపాముద్రా తథాగస్త్యః స్కందః కుసుమాయకః।
సురాధీశో రౌహిణేయో దత్తాత్రేయో మహామునిః
దుర్వాసా ఇతి విఖ్యాతా ఏతేముఖ్యా ఉపాసకః॥

విష్ణువు, శివుడు, సురజ్యేష్టుడైన బ్రహ్మ, మనువు, చంద్రుడు, కుబేరుడు, లోపాముద్ర, అగస్త్యుడు, కుమారస్వామి, మన్మధుడు, ఇంద్రుడు, బలరాముడు, దత్తాత్రేయుడు, దూర్వాసుడు అనువారు పేరుపొందిన దేవీఉపాసకులు.

'జ్ఞానార్ణవము' అనే తంత్రంలో

మనుశ్చంద్రః కుబేరశ్చ మన్మథ స్తదనంతరమ్
లోపాముద్రా తథాగస్త్యః స్కందో విష్ణు స్తథా శివః।
దత్తాత్రేయో మునిః శక్రో దుర్వాసాశ్చ త్రయోదశ
ఉపాసతే మహావిద్యా ద్వాదశో క్తా స్తవానఘే।
త్రయోదశాక్షరీ విద్యా దుర్వాసోపాసితా ప్రియే॥

ఈ రకంగా అనేకమంది మహనుభావులు దేవీ ఉపాసనచేసి తరించారు అని చెప్పబడింది.

పంచదశీమహామంత్రాన్ని దర్శించి ఈ లోకానికి తెచ్చిన వాడు మన్మధుడు. అతడే ఈ మంత్రానికి ఋషి అని కొందరి వాదము కాగా దక్షిణామూర్తి మూలపురుషుడు అని కొందరంటారు.

భాషకు గల అక్షరాలలో అ నుంచి అః వరకు అచ్చులనీ, కనుంచి క్ష వరకు హల్లులనీ అంటారు. అచ్చులు శక్తి రూపాలు, హల్లులు శివరూపాలు. ఈ విషయాన్ని 'మాతృకా హృదయము' అనే గ్రంథంలో వివరించటం జరిగింది.

కకారాది క్షకారాంతా వర్ణాస్తే శివరూపిణః॥
సమ స్త వ్య స్తరూపేణ షట్ త్రింశత్ త త్త్వ విగ్రహాః॥

అకారాది విసర్గాంతాః స్వరాః షోడశ శ క్తయః॥
నిత్యాషోడశ కాత్మనః పరస్పర మమీయుతాః॥

శివశ క్తి మయావర్ణా శబ్దార్థప్రతిపాదకాః॥
శివః స్వర పరాధీనో న స్వతంత్రః పదావ్యయౌ॥

స్వరాః స్వతంత్రా జాయంతే న శివ స్తు కదాచన॥"

ఈ రకంగా అక్షరాలను మూడు భాగాలుగా చేసి

1. అ నుంచి అః వరకు 16 అక్షరములు మొదటి భాగము
2. క నుంచి త వరకు 16 అక్షరములు రెండవ భాగము
3. థ నుంచి స వరకు 16 అక్షరములు మూడవ భాగము

ఈవిధంగా చేసి వాటిలో సత్వ రజస్ తమోగుణాల, త్రిమూర్తుల, చంద్రసూర్యాగ్నుల, జాగ్రత్స్వప్న సుషుప్తి అవస్థల తత్త్వాలు చేర్చబడ్డాయి. వీటిలోనిత్యలను కూడా చేర్చటం జరిగింది. వసిష్ఠసంహిత లో షోడశనిత్యలను గురించి చెప్పటం జరిగింది.

శ్లో॥ శృణుదేవి ప్రవక్ష్యామి నిత్యాషోడశకం తవ.(
న కస్య చిన్మయాఽఽఖ్యాతం సర్వతంత్రేషు గోపితమ్॥

తత్రాదౌ ప్రథమానిత్యా మహాత్రిపురసుందరీ
తతః కామేశ్వరీ నిత్యా నిత్యాచ భగమాలినీ॥

నిత్య క్లిన్నా తథాచైవ భేరుండా వహ్నివాసినీ
మహావిద్యేశ్వరీ (వజ్రేశ్వరీ) రౌద్రీ, త్వరితా కులసుందరీ॥

నిత్యా నీలపతాకాచ విజయా సర్వమంగళా
జ్వాలామాలిని చిద్రూపాః ఏతానిత్యాస్తు షోడశ॥

ప్రతిపత్ప్రభృతౌ దేవ్యాః పౌర్ణమాస్యంతమర్చయేత్
ఏకాదివృద్ధ్యా హాన్యాచ దర్శాంతం దేవి విగ్రహమ్॥

వీటిలో 1. మహాత్రిపుర సుందరి 2. కామేశ్వరి, 3. భగమాలిని, 4. నిత్యక్లిన్న, 5. భేరుండ, 6. వహ్నివాసిని. 7. మహావిద్యేశ్వరి. 8. రౌద్రీ, 9. త్వరిత, 10 కులసుందరి, 11. నిత్యా, 12. నీలపతాక, 13. విజయ, 14. సర్వమంగళ, 15. జ్వాలామాలిని, 16. చిద్రూప అనే ఈ పదహారు నిత్యలు. షోడశ నిత్యలు శుక్ల పక్ష పాడ్యమి మొదలు పౌర్ణమి వరకు గల తిథుల రూపమున, కృష్ణ పక్ష పాడ్యమి మొదలు అమావాస్య వరకు గల తిథుల రూపమున ఉన్నారు. వీరికే చంద్రకళలు అని పేరు. చంద్రకళలే పాడ్యమి మొదలయిన తిథులు అని జ్యోతి శ్శాస్త్రంలో చెప్పబడింది.

'ప్రతిపన్నామ విజ్ఞేయా చంద్రస్య ప్రథమా కలా
ద్వితీయాద్యా ద్వితీయాద్యాః పక్షయో శ్శుక్ల కృష్ణయోః॥'

పాడ్యమి నుండి పౌర్ణమి వరకు 15, అమావశ్య మొత్తం పదహారు తిథులే పదహారు కళలు. సుభగోదయం లో చెప్పినట్లుగా

శ్లో॥ దర్శాద్యాః పూర్ణిమాం తాశ్చ కలాః పంచ దశైవ తు
షోడశీతు కలాజ్ఞేయా సచ్చిదానంద రూపిణీ"

అమావాస్య మొదలు పూర్ణిమ వరకు గల కళలు 15. 16వ కలషోడశి.

సచ్చిదానంద స్వరూపిణి అయి ఉన్నది.

ఈరకంగా పదహారు తిథులను, పదహారు కళలను

1. ప్రకటయోగిని, 2. గుప్తయోగిని, 3 గుప్తతరయోగిని, 4. సంప్రదాయయోగిని, 5 కుళోత్తీర్ణయోగిని, 6. నిగర్భయోగిని, 7. రహశ్యయోగిని, 8. అతిరహశ్యయోగిని, 9. పరాపరరహశ్యయోగిని అనబడే తొమ్మిది మంది యోగినులను అందులో అంతర్భాం చేసి ఒక్కొక్క భాగానికి ఒక్కొక్క హ్రీంకారము ఏర్పాటుచేసాడు. హ్రీంకారము అంటే ప్రాణశక్తి.

"శివ వినా భూత శక్తిః స్వతంత్రా నిరుపప్లవా।
సమస్తంవ్యాప్య భువనమీష్టే తేనేశ్వరీమతా॥

వ్యాపృతం తేవ సకల మనయా చిద్విలాసయా।
యస్మాదఖిల జీవానాం మంత్రాణామపి సర్వశః॥

హృది లేఖేవ జాగర్తి ప్రాణశక్తిరియంపరా।
హృల్లేఖా కథ్యతే తస్మాన్మాయైవా చిత్స్య వైభవా॥

అనయా రహితాః సర్వే నిర్జీవా మంత్రరాశయః।
అతస్తు సర్వమంత్రాణా మియ ముద్బోధనీమతా॥"

ఈ ప్రమాణవచనము వల్ల హ్రీంకారము ప్రాణశక్తి అని, అది లేకపోయినట్లైతే మంత్రము నిర్జీవము అవుతుందని, తెలుస్తోంది.

ఈ మంత్రానికి 1. దర్శ, 2. దృష్ట, 3. దర్శత, 4. విశ్వరూప, 5. సుదర్శన, 6. ఆప్యాయమాన, 7. ఆప్యాయమాన, 8. ఆప్యాయ, 9. సూనృత, 10. ఇర 11. అపూర్వమాణా, 12. అపూర్వమాణా, 13. పూరయంతి, 14. పూర్ణ, 15. పూర్ణమాసి అనబడే చంద్రకళలు, త్రిపురసుందరి మొదలైన నిత్యలే అధిదేవతలు. షోడశీకళ సాదాఖ్యకళ, తానే సర్వస్వమునకూ అధిదేవత.

ఈ కళలన్నీ మూడు ఖండాలుగా అవుతున్నాయి. శివ, శక్తి, మాయ, శుద్ధవిద్య, జలము అనే ఈ ఐదు తత్త్వాములకు సంబధించిన మొదటి ఐదుకళలు గల ప్రథమఖండాన్ని ఆగ్నేయఖండం అంటారు. దీనికి అధిదేవత అగ్ని.

తేజస్సు, వాయువు, మనస్సు, పృథివి, ఆకాశము అను ఈ ఐదు తత్త్వములకు సబంధించిన 6 నుంచి 10 వరకు గల కళలు సౌరఖండము. దీనికి

అధి దేవత సూర్యుడు.

విద్య,మహేశ్వరి, పర, ఆత్మ, సదాశివ అను ఈ తత్త్వములకు సంబంధించిన చివరి 5 కళలు సౌమ్యఖండము. దీనికి అధిదేవత సోముడు.

అన్ని కళలకు, ఖండాలకు అధిదేవత కామేశ్వరుడు. అధిష్ఠాత్రి కామేశ్వరి. ఈ రకంగా సోమసూర్యఅనలాత్మకములైన 3 ఖండాలుగా ఈమంత్రం విభజింపబడింది.

సౌందర్యలహరిలోని 32వ శ్లోకంలో చెప్పినట్లుగా

శ్లో॥ శివ శ్శక్తిః కామః క్షితి రథ రవి శ్శీతకిరణః
స్మరో హంస శ్శక్ర స్తదనుచ పరా మార హరయః
అమీ హృల్లేఖాభి స్తిసృభి రవసానేషు ఘటితాః
భజన్తే వర్ణాస్తే తవ జనని నామావయవతామ్.

శివ అనటంచేత శివతత్వాత్మకమైన దర్శాఖ్యకళ త్రిపురసుందరీ అనే పేరుకలది అని చెప్పబడుతోంది. దీనికి ప్రకృతి భూతము క కారము బీజము అని తెలుస్తోంది.

శక్తి శబ్దముచే శక్తి తత్వాత్మకమైన రెండవ కళ. దాని చేత ఏ కారము బీజము చెప్పబడ్డాయి.

కాముడు అంటే కామదైవత్వమైన 3వకళ. దీనికి ఈ కారము బీజము. క్షితి అంటే భూతత్త్వము. దీనికి లకారము బీజము రవి అంటే సూర్యుడు. దీనికి బీజము హకారము. శీతకిరణుడు అంటే చంద్రుడు. దీనికి బీజము సకారము స్మరుడు కామరాజప్రకృతి భూతమైన కకారము. హంసుడు అంటే సూర్యుడు. దీనికి బీజము హకారము శక్రుడు. అంటే ఇంద్రుడు. ల కారం ఇంద్ర బీజం. పరా అంటే చంద్రకళ దీనికి సకారము. మారుడు అంటే కామరాజు. దీనికి బీజం కకారము హరి అంటే ఇంద్రుడు. దీనికి బీజం లకారము.

ఈ రకంగా పంచదశీమహామంత్రంలో దేవతలు, వారి తత్త్వాలు, బీజాక్షరాలూ చెప్పబడ్డాయి. పంచదశీమహామంత్రం మూడు ఖండాలుగా ఉన్నది. అని చెప్పటం జరిగింది. ప్రధమ-ఖండంలో శివుడు, శక్తి, కాముడు, క్షితి అనే దేవతలయొక్క క ఏ ఈ ల అనే నాలుగు బీజాక్షరాలు ఉంటాయి. ఇది

ఆగ్నేయఖండం. ద్వితీయ ఖండంలో రవి, శీతకిరణుడు, స్మరుడు, హంసుడు, శక్రుడు అనే దేవతలయొక్క హ స క హ ల అనే ఐదు బీజాక్షరాలు ఉంటాయి. ఇది సౌరా ఖండం. మూడవ ఖండంలో పరా, మార, హరి అనే దేవతలయొక్క స క ల అనే మూడు బీజాక్షరాలు ఉంటాయి. ఇది సౌమ్యఖండం.

ఇక్కడ ప్రతి ఖండము తరువాత ప్రాణశక్తి అయిన హ్రీం కార బీజం ఉంటుంది. అంటే మొత్తం 4+5+3=12 బీజాక్షరాలూ, మూడు హ్రీంకారాలు వెరసి 15 అక్షరాలతో అన్ని మంత్రాలకూ నిలయమైనదిగా, అన్ని అవస్థలతోనూ కూడినదిగా, సకల వేదసారమైనదిగా, సమస్త దేవతామయంగా, సర్వవర్ణసోభితంగా, సర్వశక్తి సమన్వితంగా, శివశక్తుల సంపుటం కలదిగా పంచదశీమహామంత్రం ఒప్పారుచున్నది. 'పరిమళ' అనే గ్రంథంలో చెప్పినట్లుగా

శ్లో॥ ఆలేఖ్య విశేష ఇవ గజవృషభయోర్ద్వయోః ప్రతి భాసమ్।
ఏకాస్మిన్నేవార్థే శివశ క్తి విభాగకల్పనాం కుర్మః॥

ఒకే బొమ్మను చూసి కొందరు ఏనుగు అనీ, కొందరు ఎద్దు అనీ, భావించినట్లే, ఒకే బ్రహ్మను కొందరు శివునీ, మరికొందరు శక్తీఅనీ భావించుచున్నారు. 'మానసోల్లాసము' లో చెప్పినట్లుగా

శ్లో॥ యేఽపి బ్రహ్మాదయో దేవా భవ న్తి వరదాయినః
త్వద్రూపం శ క్తిమాసాద్య తే భవ న్తి వరప్రదః
తస్మాత్ త్వమేవ సర్వత్ర కర్మణాం ఫలదాయినీ॥

శక్తి లేకుండా శివుడు ఉండడు. కాబట్టి శక్తి కీ, శక్తిమంతుడైన శివునకూ భేదము లేదు. అందుచేతనే పంచదశీమహామంత్రము శివ శక్తుల సంపుటం కలదిగా గుర్తించాలి.

హాదివిద్య – కాదివిద్య : అకారాది క్షకారాంతము అక్షరసముదాయానికి మాతృకలు అని పేరు. వీటిలో కకారాదిగ హల్లులున్న అక్షరములను కాదిమాతృకలు అని, హకారాదిగ హల్లులున్న అక్షరములను హాదిమాతృకలు అని అంటారు. శబరవర్మ అనే పండితుడు కుమారస్వామి అనుగ్రహం వల్ల చెప్పిన అక్షరముల్లు అ క చ ట త ప య శ అని ఎనిమిది వర్గులయినాయి. ఇక్కడ హల్లులు కకారాదిగ

ఉంటాయి. ఇవి కాదిమాతృకలు. పాణిని మహేశ్వర సూత్రాలను అనుసరించి చెప్పిన హల్లులు హకారాదిగ ఉంటాయి. ఇవి హాదిమాతృకలు. పంచదశీమహామంత్రము కకారముతో మొదలైనట్లైతే కాదివిద్య అని, హకారముతో మొదలైనట్లైతే హాదివిద్య అని చెప్పబడింది. ఇంద్రుడు, చంద్రుడు, మనువు, కుబేరుడు, మన్మధుడు మొదలైనవారు కాదివిద్యను ఉపాసించగా లోపాముద్ర, సూర్యుడు, శివుడు, విష్ణువు మొదలైనవారు హాదివిద్యను ఉపాసించారు. హాదివిద్యలో యమనియమాలు ఉంటాయి. కాదివిద్యలో అవి ఉండవు. ధర్మాచరణ విషయంలో స్వేచ్ఛ ఇవ్వబడిందని, శక్తిసంగమతంత్రం లో చెప్పబడింది. ఈ రెండు విద్యలలోను కాదివిద్య శ్రేష్ఠమైనది.

సౌందర్యలహరిలోని 32వ శ్లోకము కాది విద్యను సమర్థిస్తున్నది అని వాదము. ఇదే శ్లోకం'లోపాముద్ర' ఉపాసించినదని చెప్పబడుచున్న హాది విద్యను సమర్థిస్తున్న దనేవాదం కూడా ఉన్నది. గురువులలో యోగనాధులనే వారిని చెప్పారు. వీరందరికీ ఆది గురువు దక్షిణామూర్తి. కాదిమతానికి దక్షిణామూర్తి ఋషి కాగా హాది మతానికి హయగ్రీవుడు ఋషి. కాని వాడుకలో రెండింటికీ దక్షిణామూర్తినే ఋషిగా చెబుతున్నారు.

శ్రీ గురుర్దక్షిణామూర్తిః దక్షిణాచార్య ప్రవర్తకః
హయగ్రీవస్తదా చైవం వామేచానంద భైరవః

దీనిని బట్టి దక్షిణామూర్తి, హయగ్రీవుడు ఇద్దరూకూడా దక్షిణాచారాన్ని అనుసరించినవారే. అయితే హాదివిద్య మంత్రంలో ఉన్న దేవతల బీజాలు కొన్ని మారతాయి. అవి :

శివ - హకార బీజము, శక్తి - సకార బీజము
కామః కకార బీజము, క్షితిః - లకార బీజము.

ఈ రకంగా చూస్తే లోపాముద్రాదేవి అర్చించిన హా దివిద్యలో మంత్రము
హసకలహ్రీం। హసకహలహ్రీం। సకలహ్రీం॥

పంచదశీమహామంత్రమును మూడు భాగాలుగా విభజించటం జరిగింది అని చెప్పబడింది. ఇందులో క ఏ ఈ ల హ్రీం ప్రథమ ఖండము. దీనిని వాగ్భవ కూటమి అంటారు. దీనివల్ల, పురుషార్థ సాధనచే కలిగిన బ్రహ్మవర్చస్సు, మంచి బుద్ధి కలుగుతాయి. దీనిలో బ్రాహ్మణులచే ఉపాసింపబడు గాయత్రీ మంత్ర

సారము చెప్ప బడింది. ఇది ఋగ్వేదాత్మకము.

ద్వితీయఖండమయిన హ స క హ ల హ్రీం కామరాజఖండము. దీనిలో అర్థకామపురుషార్థ నిర్మాణము, క్షత్రియులచే ఉపాసింపబడు త్రిష్టుప్ఛందస్సు చెప్పబడ్డాయి. అభీష్టసిద్ధి కలిగించు ఈ ఖండము యజుర్వేదాత్మకము.

స క ల హ్రీం అనబడే మూడవది శక్తి ఖండము. దీనిలో మోక్ష సాధనమగు మార్గము చెప్పబడింది. వైశ్య జాతిచే ఉపాసింపబడు జగతీచ్ఛందస్సు చెప్పబడిన ఈ ఖండము సామవేదాత్మకము.

ఈ విద్య సర్వ వేదములయందు, సర్వలోకములందు సముష్టిరూపమున, సర్వాత్మకమైన చైతన్యరూపమున చెప్పబడింది. అందుకనే ఈ మంత్రం శైవ, వైష్ణవ, సౌర, గాణ పత్యమంత్రాలతో సంపుటీకరణం కూడా చేసి ఉపాసింపబడు తున్నది.

లలితా త్రిశతి ఫలస్మృతిలో ఈ విధంగా చెప్పబడింది.

ఏతద్విజ్ఞానమాత్రేణ శ్రీవిద్యా సిద్ధిదా భవేత్
కత్రియం హద్వయం చైవ శైవో భాగః ప్రకీర్తితః ॥
శక్త్యక్షరాణి శేషాణి హ్రీంకార ఉభయాత్మకః ।
ఏవం చ విభాగ మజ్ఞాత్వా యే విద్యాజపశాలినః ॥

మంత్రంలోని కకారములు మూడు, హకారములు రెండు శివాత్మకములు మూడు హ్రీంకారములు శివశక్త్యాత్మకములు. మిగిలిన అక్షరములు శక్త్యక్షరములు. ఈ విషయము తెలియకుండా మంత్రజపంచేసిన వారికి ఎంతకాలమైనప్పటికీ మంత్రము సిద్ధించదు.

యస్య నో పశ్చిమం జన్మ యది వా శంకరః స్వయం
తే నైవ లభ్యతే విద్యా శ్రీమత్పంచదశాక్షరీ ॥
ఇతి మంత్రేషు బహుధా విద్యాయా మహిమోచ్యతే
మోక్షైక హేతువిద్యా తు శ్రీవిద్యా నాఽత్ర సంశయః ॥

ఎవరికైతే మళ్ళీ జన్మలేదో, ఎవరు సాక్షాత్తూ శంకరుడో వానిచేతనే ఈ పంచదశీవిద్య పొందబడుచున్నది. ఇదే మోక్షహేతువైన శ్రీవిద్య.

పంచదశీమహామంత్రాన్ని చాలమంది చాలావిధాలుగా ఉపాశించారు.

మను శ్చంద్రః కుబేరశ్చ లోపాముద్రాచ మన్మథః ।
అగస్తి ర్నంది సూర్యాచ ఇంద్రో విష్ణు శ్శివ స్తథా ॥
క్రోధభట్టారకో దేవ్యా ఏ తేముఖ్యాఉపాసకాః ॥
ఏవం ద్వాదశ దా భిన్నా శ్రీ మత్పంచ దశాక్షరీ ॥

ఈ రకంగా పైన చెప్పిన 12 మంది వివిధరకాలుగా పంచదశీమహామంత్రాన్ని ఉపాశించటం జరిగింది. వీరందరూ ఉపాసనచేసిన ఈమంత్రానికి దక్షిణామూర్తి ఋషి. వీరు ఉపాశించిన మంత్రం మాత్రం వేరుగా ఉంది.

1. అగస్త్యుడు ఉపాసించిన మంత్రం

హ స క ఏ ఈ ల హ్రీం । హ స క హ ల హ్రీం । స క ల హ్రీం ॥

2. మన్మధుడు ఉపాసించిన మంత్రం

క ఏ ఈ ల హ్రీం । హ స క హ ల హ్రీం । స క ల హ్రీం ॥

మనువు ఉపాసించిన మంత్రం.

క హ ఏ ఈ ల హ్రీం । హ స క హ ల హ్రీం। స క ల హ్రీం॥

చంద్రుడు ఉపాసించిన మంత్రం

స హ క ఏ ఈ ల హ్రీం । స హ క హ ల హ్రీం । స హ స క ల హ్రీం॥

కుబేరుడు ఉపాసించిన మంత్రం

క ఏ ఈ ల హ్రీం । హ స క హ ల హ్రీం । స హస క ల హ్రీం ॥

నందికేశ్వరుడు ఉపాసించినమంత్రం

స ఏ ఈ ల హ్రీం । స హ హ ల హ్రీం । స క ల హ్రీం ॥

సూర్యుడుపాసించిన మంత్రం

హ స క ల హ్రీం । హ స క హ ల హ్రీం । స క ల హ్రీం ॥

ఇంద్రుడుపాసించిన మంత్రంః

క ఏ ఈ ల హ్రీం । హ స క హ ల హ్రీం । స ల క హ్రీం ॥

విష్ణువు ఉపాసించినమంత్రం

హ స క ల హ్రీం । హ స క హ ల హ్రీం । స క ల హ్రీం ।

స ఏ ఈ ల హ్రీం । స హ హ ల హ్రీం । స క ల హ్రీం ॥

శివుడు ఉపాసించినమంత్రం

హ స క ల హ్రీం । హ స క హ ల హ్రీం । స క ల హ్రీం ।

హ స క ల । హ స క హ ల । స క ల హ్రీం॥

దూర్వాసుడుపాసించిన మంత్రం

క ఏ ఈ ల హ రీ । హ స క హ ల హ రీ । స క ల హ రీ ॥

లోపాముద్ర ఉపాసించిన మంత్రం

హ స క ల హ్రీం । హ స క హ ల హ్రీం। స క ల హ్రీం ॥

ఈ రకంగా భిన్న సంప్రదాయాలతో పంచదశీమంత్రం చెప్ప బడుతోంది. పంచదశీ మహామంత్రానికి బాలామంత్రం సంపుటంచేస్తే 'సౌభాగ్యవిద్య' అంటారు.

ఐంకఏఈలహ్రీం । క్లీంహసకహలహ్రీం । సౌః సకలహ్రీం॥

పంచదశీమంత్రాన్ని వివిధమంత్రాలతో సంపుటం చేయటంకూడా జరుగుతుంది.

గణపతి మంత్రానికి పంచదశీ మంత్రాన్ని సంపుటంచేస్తే విద్యా గణేశమంత్రం అవుతుంది.

ఓం శ్రీం హ్రీంక్లీంగ్లౌంగంక ఏ ఈలహ్రీం। గణపతయే హసకహలహ్రీం।వరవరద సకలహ్రీం|సర్వ జనంమేవశమానయస్వాహా॥

గోపాలమంత్రానికి పంచదశీమంత్రాన్ని సంపుటం చేస్తే గోపాలసుందరి మంత్రం అవుతుంది.

"హ్రీంశ్రీంక్లీం కృష్ణాయ క ఏ ఈల హ్రీం । గోవిందాయ

హసకహలహ్రీం । గోపీజనవల్లభాయ సకలహ్రీం స్వాహా॥

ఈరకంగా పంచదశీమహామంత్రం వివిధమంత్రాలతో సంపుటీకరణం చేయబడింది.

శ్రీవిద్యలో షడామ్నాయాలు చెప్పబడినాయి. వీటిని గురించి తంత్రసారంలో వివరించటం జరిగింది.

ఋగామ్నాయ మయం తత్ర పూర్వద్వారం ప్రకీర్తితం।

ఉన్మేషిణీనామ విఖ్యాతా ఋగామ్నాయాధి దేవతా ।

తత్రైవ దక్షిణం ద్వారం యజురామ్నాయ రూపకం ।

భోగినీనామ సా దేవీ దక్షిణామ్నాయ దేవతా ।

సామవేదమయం చ్చాత్ర పశ్చిమద్వార మీరితం ।
కుబ్జికాఖ్యా మహాదేవీ పశ్చిమద్వార దేవతా ॥
అథర్వణమయం తద్వ దుత్తరామ్నాయ మీరితం ।
కాళికాఖ్యా మహాదేవీ ఉత్తరద్వార దేవతా ॥
చతుర్వేదమయః సాక్షా దూర్ధ్వామ్నాయస్స మీరితః ।
ఊర్ధ్వామ్నాయస్య సంప్రోక్తా దేవతా చండభైరవీ ॥
పూర్వశ్చ పశ్చిమశ్చైవ దక్షిణశ్చోత్తర స్తథా ।
ఊర్ధ్వామ్నాయశ్చ పంచైతే మోక్షమార్గాః ప్రకీర్తితాః ॥
ఊర్ధ్వత్వాత్సర్వధర్మాణా మూర్ధ్వామ్నాయః ప్రశస్యతే ।
ఊర్ధ్వామ్నాయం విజానీయా త్సాక్షా న్మోక్షైక సాధనమ్ ।
పూర్వామ్నాయః సృష్టిరూపః స్థితిరూపశ్చ దక్షిణః ।
సంహారః పశ్చిమో దేవి తిరోధాన స్తథోత్తరః ॥
ఊర్ధ్వామ్నాయ స్తతో దేవి తథానుగ్రహరూపకః ।
అనుత్తరా పరాంబా సా శ్రీమత్త్రిపురసుందరీ ॥

దీనిప్రకారము పూర్వామ్నాయము ఋగ్వేదపూర్వకము. దీనికి అధిదేవత ఊర్మిణి. దక్షిణామ్నాయము యజుర్వేద పూర్వకము.దీనికిఆధిదేవత భోగిని పశ్చిమామ్నాయము సామవేద పూర్వకము. దీనికి అధిదేవత కుబ్జిక.
ఉత్తరామ్నాయము. అధర్వణవేద పూర్వకము దీనికి అధిదేవత కాళిక. ఊర్ధ్వామ్నాయము చతుర్వేదమయము.దీనికి ఆధిదేవత చండ భైరవి.

ఈ రకంగా పంచామ్నాయాలు మోక్షమార్గాన్ని తెలియచేస్తున్నాయి. వీటిలో పూర్వామ్నాయము - సృష్టిరూపము, దక్షిణామ్నాయము - స్థితిరూపము. పశ్చిమామ్నాయము - సంహార రూపము,ఉత్తరామ్నాయము - తిరోదానము, ఊర్ధ్వామ్నాయము - సాక్షాత్తూ మోక్షసాధనము. కాగా ఆరవది అయిన అనుత్తరామ్నాయానికి అధిదేవత శ్రీమత్త్రిపురసుందరి అయి ఉన్నది. శాక్తేయంలో సిద్ధ విద్యలుగా చెప్పబడే పదిరకాల మహావిద్యలున్నాయి. అవి

కాళీ తారా మహావిద్యా షోడశీ భువనేశ్వరీ ।
భైరవీ ఛిన్నమస్తా చ విద్యా ధూమావతీ తథా ॥
బగళా సిద్ధవిద్యా చ మాతంగీ కమలాత్మికా ।
ఏతా దశ మహావిద్యాః సిద్ధవిద్యాః ప్రకీర్తితాః ॥

సమయదక్షిణాచారాలలో మొత్తం 16 రకాలపూర్ణ దీక్షలున్నాయని 'వసిష్ఠ సంహిత' లో చెప్పబడింది.

శుద్ధ బాలాచ మాతంగీ గురవో గణపస్తథా
సౌభాగ్యవిద్యాచ వారాహీ తిరస్కరిణి కాతథా
లోపాముద్రా తురీ యాంబా ప్రాసాదా సహషోడశీ
శ్రీ పరా షోడశీచైవ శ్రీ మహాపాదుకా తథా ॥

గురువుదగ్గరమంత్రోపదేశం పొందటాన్నే దీక్ష తీసుకోవటం అంటారు బాలామంత్రం దగ్గరనుండీ, శ్రీ మహాపాదుకవరకూ శ్రీ విద్యలో 12 రకాల దీక్షలున్నాయని స్వతంత్ర తంత్రంలో చెప్పబడింది.

దీక్షాభేద మథోవక్ష్యే బాలా ప్రథమతోమతా ।
ద్వితీయా పంచదశ్యుక్తా చతురామ్నాయజా పరా ॥
పంచామ్నాయా చతుర్థీస్యాత్ షోడశ్యంతాతు పంచమీ ।
షష్ఠీ చరణవిద్యాంతా సప్తమీ వాసనాంశికా ॥
రహస్యాంతా చాష్టమీస్యాన్నవమీ షోడశీ పరా ।
షడ్దర్శనాంతా దశమీ మహావాక్యాంతిమా తతః ॥
ద్వాదశీ శ్రీపాదుకాంతా న్యూనం తత్పూర్వ ముచ్చతే ॥

షోడశాక్షరీమహామంత్రము : శ్రీ విద్య పూర్ణ దీక్షలో ప్రధానమైనది 'షోడశాక్షరి' దీనినే 'శుద్ధవిద్య' అనికూడా అంటారు. అయితే శుద్ధవిద్య అనే విద్య ఇంకొకటికూడా ఉంది. దీనికి సదాశివుడు ఋషి. గాయత్రి ఛందస్సు. దీనిలో మూడు బీజాక్షరాలు మాత్రమే ఉంటాయి.దీనిమంత్రం ఐంఈంబెః

సాముద్రికంలో చెప్పిన లక్షణాల ప్రకారము దేవి నోటిలో పదహారు చొప్పున పైన, క్రిందకలిపి ముప్పైరెండు దంతాలు ఉంటాయి. షోడశిలోని పదహారు బీజాలు దేవినోటిలో ఉన్న దంతపంక్తి. ప్రతిబీజంలోనూ శివ, శక్తి భాగాలు రెండూ, రెండు దళాలుగా ఉన్నాయి. కాబట్టి దంతపంక్తులుకూడా రెండువరుసలుగా కలిసి ముప్పై రెండు అవుతున్నాయి. శివశక్తులకు సమయాచారప్రకారము పంచవిధ సామ్యమున్నది. కాబట్టి వారు ఎప్పుడూ కలిసే ఉంటారు. అనేది సమయ మత సిద్ధాంతము.

కామరాజ మంత్రాంతే శ్రీబీజేన సమన్వితా
షోడశాక్షరీ విద్యేయం శ్రీవిద్యేతి ప్రకీర్తితా ॥

మన్మథుడు ఉపాసించిన పంచదశీమహామంత్రానికి చివర శ్రీం బీజము చేర్చినట్లైతే షోడశాక్షరీ అవుతుంది. అనగా

క ఏ ఈ ల హ్రీం । హ స క హ ల హ్రీం । స క ల హ్రీం/శ్రీం ॥

లక్ష్మీధరులు, బాస్కరాచార్యులు, కావ్యకంఠగణపతి కూడా దీనిని సమర్థించారు . కాని పంచదశీమహామంత్రానికి ఈం బీజం చేర్చినట్లైతే షోడశి అవుతుంది అని కొందరి వాదన.

అయితే ఈ షోడశాక్షరి కేవలం పదహారు అక్షరాల మంత్రము. అంతేకాని బ్రహ్మవిద్యకాదు. బ్రహ్మవిద్య అయిన షోడశిమహామంత్రానికి ఇరవైఎనిమిది అక్షరాలు వుంటాయి. అది

కమలా భువనేశాని కామో వాగేశరీ తతః
పరా చప్రణవః పశ్చాత్ భువనా నామధీశ్వరీ
కమలాచాపి పూర్వోక్తా త్రికూటా పరమేశ్వరీ
పరా వాణీ రతీశశ్చ లోకేశీ విష్ణు వల్లభా

మంత్రం : శ్రీం హ్రీం క్లీం ఐం సౌః । ఓం హ్రీం శ్రీం । క ఏ ఈ ల హ్రీం । హ స క హ ల హ్రీం । స క ల హ్రీం । సౌః ఐం క్లీం హ్రీం శ్రీం ॥

శ్రీబీజ సమాయా స్మరయోనిశక్తి సర్వంచ మాయా కమలాత్మ విద్యా
శక్త్యాది బీజాని విలోమితాని శ్రీషోడశార్ణాః పరదేవతాయాః ॥

అని చెప్పబడింది. దీనిని బట్టి బ్రహ్మవిద్యయైన షోడశమంత్రానికి పదహారు అక్షరాలే వుంటాయి. పంచదశీమహామంత్రంలోని మూడు ఖండాలను మూడు బీజాలుగా లెక్కించినట్లైతే షోడశిమహామంత్రంలోని మొత్తం బీజాక్షరాలు పదహారు అవుతాయి.

అష్టౌ బీజాక్షరాణ్యాదౌ పశ్చాత్పంచ దశీ తతః
పంచ బీజాక్షరా ప్యేషా శ్రీమహాషోడశీ మతా॥

పంచదశీమహామంత్రానికి ముందు ఎనిమిది బీజాక్షరాలు తరువాత ఐదు బీజాక్షరాలు కలిపినట్లైతే మహాషోడశి అంటారు . ఇదియే బ్రహ్మవిద్య.

ప్రకట గాయత్రి మహామంత్రానిక షోడశాక్షరిని చేర్చి జపించినట్లైతే కోటిరెట్లు ఫలమధికము అని భరద్వాజులవారు చెప్పారు.

శుక్ల పక్ష పాడ్యమి మొదలు పౌర్ణమి వరకు ఒక్కొక్క రోజు ఒక్కొక్క కళ చంద్రుని విడిచి సూర్యని చేరుతూ ఉంటుంది. ఈ రకంగా 15 కళలూ చంద్రుని విడిచి సూర్యుని చేరిన రోజు అమావాశ్య. కౌళాచారులు చంద్రకళల వృద్ధి క్షయాలను బట్టి దేవీ ఉపాసన చేస్తూంటారు. దేవీ ఉపాసన రాత్రులందు అదిక ఫల భరితం అని గుర్తించాలి. దీనిని ప్రత్యేక దీక్షతో నిర్వహించాలి.

పరదేవతకు సూక్ష్మరూపమే మంత్రం. మంత్రానికి బాహ్యారూపంయంత్రం. శ్రీవిద్యకు యంత్రం శ్రీచక్రం. ఇది కేవలం రేఖా నిర్మితము. దీనిలో నాలుగు శివచక్రాలు ఐదు శక్తిచక్రాలు ఉంటాయి. బిందువు, అష్టదళము త్రికోణము, అష్టకోణము, రెండు దళకోణములు, చతుర్దశ కోణములను శక్తి చక్రాలు అంటారు. పంచదశిమహామంత్రానికి ప్రతిరూపమే శ్రీచక్రం. ఆ మహామంత్రంనుంచే శ్రీచక్రం ఉద్భవించింది.

శ్రీచక్రం పుట్టక : 'వరివస్యా రహశ్యము' అనే గ్రంథంలో భాస్కరరాయలు వారు ఈ విధంగా చెప్పారు.

కత్రి తయాదీ కారాద్బిందుర్జాత స్తదగ్రిమేచక్రే,
హ్యల్లేఖాభి స్తత్పర చక్రత్రితయం హకారాఖ్యామ్.

ఏకారేణచ తత్పర చక్రేజాతే సకారాభ్యామ్,
చతురశ్రాణి లకారై రేవం విద్యాక్షరేణ చక్రజనిః.

1. శ్రీ విద్య యందలి 3వ క కారమువల్ల, ఈ కారమువల్ల - బిందువు పుట్టింది.
2. 3హ్రీంకారములవల్ల - త్రికోణము, వశుకోణముపుట్టినాయి.
3. 2లకారములు ఏకారమువల్ల - అంతర్దశారము, బహిర్దశారము, చతుర్దశారము, వృత్త త్రయము పుట్టినది.
4. 2 సకారములచే అష్ట దళము, షోడశదశము, పుట్టినది.
5. లకారము వల్ల - భూ పురత్రయం పుట్టినది.

ఈ విధంగా మంత్రంనుంచి శ్రీచక్రం పుట్టింది.

భాస్కరరాయలవారు తమవరివస్యారహశ్యము అనే గ్రంధంలో పంచదశామహా మంత్రానికి గణేశత్వము, యోగినీ రూపము, నవగ్రహరూపము, రాశిస్వరూపము, నక్షత్రరూపము కూడా చెపుతున్నారు.

1. గణేశత్వము :

"అకథాదికషోడశాక్షరా త్మకతా శ్రీయకకామవాగభివైః ।
ఘటితాచపరాదివాగ్గణై రితివిద్యాపి గణేశరూపిణీ ॥

1. అకారాది 16వర్ణములు శక్తి కూటస్వరూపము
2. కనుంచి త వరకు 16 వర్ణములు కామరాజకుటము
3. ధ నుంచి స వరకు గల 16 వర్ణములు వాగ్భవ కూటము
4. పర, పశ్యంతి, మధ్యమ, వైఖరి అను నాలుగు వాగ్గణములు
5. వ్యష్టి, సముష్టి విభేదముచేత విద్యా స్వరూపము.

ఈ రకంగా వర్ణ గణస్వరూపం కలది కాబట్టి పంచదశీమహామంత్రానికి గణేశత్వం లభించింది.

2. యోగినీరూపము :

హృల్లేఖాభి స్తిసృభి స్తదన్యకూటైశ్చ యోగినీయోగాత్ ।

శ్రీవిద్యలో హృల్లేఖలు మూడు, అవి లేని కూటములు మూడు. మొత్తం ఆరు. డాకిని, రాకిని, లాకిని, కాకిని, సాకిని, హాకిని అను యోగిమలు ఆరుగురు. కాంట్టి పంచదశామహామంత్రానికి యోగినీ రూపం వచ్చింది.

3. నవగ్రహరూపము :

బిందుత్రియనాదత్రయ తద

1. బిందు త్రయము. (3 కూటముల చివరనున్న బిందువులు)
2. నాదత్రయము (బిందువు తరువాత ఉండు అర్థచంద్రార్థ్యష్టకము)
3. బిందు నాదములు లేని కూటములు మూడు, వెరసి గ్రహాలు కూడా తొమ్మిది కాబట్టి పంచదశామహామంత్రానికి నవగ్రహత్వం లభించింది.

4. రాశి స్వరూపము :

రాశీభూతా హ్యేషా త్రిసృణాంపూర్వ్యాక్షరై రైక్యాత్॥

హ్రీంకారాలు గనకవదలివేసి నట్లైతే మంత్రంలో ఉండే బీజాక్షరాలు 12. మేషాదిరాసులు 12. కాబట్టి పంచదశీమహామంత్రానికి రాశి స్వరూపం చెప్పబడింది.

5. నక్షత్ర రూపం :

నక్షత్రత్వంచదశాకారాణాంవ్యంజనై రపా

సంప్రదాయప్రకణమునందు మూలవిద్యలో 37 వర్ణాలున్నాయి. అందులో పునరుత్పత్తి అయిన ఖ,ఘు,ఛ,ఝు,ఠ,ఢ,ధ,థ,ఫ,భ అను పది అక్షరాలను తీసివేస్తే 37-10 = 27 అవుతాయి. నక్షత్రాలు 27. కాబట్టి పంచదశీ మహాయంత్రానికి నక్షత్ర రూపం చెప్పబడింది.

ఈరకంగా పంచదశీ మహాయంత్రానికి గణేశత్వము, యోగినీ స్వరూపము, నవగ్రహత్వము, రాశి స్వరూపము చెప్పబడి మంత్రరాజముగా వెలుగొందుచున్నది.



## శ్రీచక్రము

మనదేశంలో చాలా మంది ఆస్తికులున్నారు. వాళ్ళలో ఎక్కువమంది 'శక్తి' ని ఆరాధిస్తారు. ఆవిడే ఈసృష్టికి మూలకారణం అంటారు. ఇంతకీ ఎవరాశక్తి? 'అమ్మలగన్నయమ్మ - ముగురమ్మలమూలపుటమ్మ'. ఆశక్తినే 'జగదంబ' 'పరాత్పరీ' 'రాజరాజేశ్వరి' మొదలగు అనేక పేర్లతో పిలుస్తారు. ఆవిడ ఎక్కడ ఉంటుంది? అంటే మంత్రశాస్త్రంలో

సుధాసింధోర్మధ్యే సురవిటపివాటీపరివృతే
మణిద్వీపే నీపోపవనవతి చింతామణి గృహే
శివాకారే మంచే పరమశివ పర్యంక నిలయామ్

"పాలకడలినడుమ నెలకొన్న రతనాల దీవియందు, కల్ప వృక్షముల వరుసలతో చుట్ట బడిన కదంబ వనంలో, చింతామణులతో నిర్మించబడిన గృహమందు శక్తిరూపమైన త్రికోణాకార మంచమందు పరమశివునితో కూడి సుఖించుచున్నది.' ' అని చెప్పబడింది. ఈ విశాల విశ్వమే ఒక పాలకడలి దాని మధ్యలో ఆ దేవి కొలువైవుంది. అనగా చరాచర జగత్తుకూ కేంద్రస్థానము ఆమెయే. ఈ సృష్టికి మూలకారణం ఆమె. పాలకడలి మధ్యన ఆదేవి పరమ శివుని కూడి ఉన్నది. అనగా, ఆ దేవియే ప్రకృతి, పరమశివుడు పురుషుడు. ప్రకృతి పురుషుల సమ్మేళనమే ఈ సృష్టి.

ఈ సృష్టిలో లేనిది ఏదీలేదు. కోరిన కోర్కెలు తీర్చే చింతామణి ఈ సృష్టిలోనే ఉంది. సర్వాన్నీ దహించివేసే అగ్నికూడా ఈ సృష్టిలోనే ఉంది. కాబట్టి మనకు కావలసిన ఏవస్తువునైనా ఈ సృష్టిని ఆరాధించే పొందవచ్చు. అనంతమైన ఈ సృష్టిని యధాతథంగా ఆరాధించటం సామాన్య మానవులకు సాధ్యంకాదు. ఈ అనంత సృష్టికి సూక్ష ప్రతిరూపమే శ్రీచక్రము. ఇదిమానవుల కామ్యార్థ సిద్ధికి మహర్షులు కరుణించి, కల్పించి ఇచ్చినమహాయంత్రం. దీని మధ్యలో ఉండే బైంధవస్థానమే శివశక్తులయొక్క క్రీడా ప్రదేశము.

మానవ శరీరము నవధాతువులతో నిర్మితమైనది. ఈనవధాతువులు శ్రీచక్రములోని శివ, శక్తి చక్రములకు ప్రతీకలు. అలాగే మానవుని దేహమందున్న షట్చక్రములే, శ్రీ చక్రమునఉన్న శివ, శక్తి చక్రములు. సాధకుడు మూలాధారము నుండి బయలు దేరి సహస్రారము చేరగలిగినట్లైతే శివశక్తుల సాక్షాత్కారం కలుగుతుంది. ఆ సహస్రారమే శ్రీచక్రమందలి బిందువు.

ఈసృష్టిలో ఉన్న పంచభూతాలు, తన్మాత్రలు, మానవదేహంలో ఉన్న జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు అన్నీ కూడా శ్రీచక్రంలో అంతర్భావం పొంది ఉన్నాయి.శ్రీచక్రాన్ని గురించి శంకరభగవత్పాదల వారు సౌందర్యలహరిలో ఈ విధంగా చెప్పేరు.

చతుర్భి శ్శ్రీకణ్ఠై శ్శివయువతిభిః పఞ్చభిరపి
ప్రభిన్నాభి శ్శమ్భో ర్నవభిరపి మూలప్రకృతిభిః
చతుశ్చత్వారింశ ద్వసుదళ కలాశ్రత్రివలయ
త్రిరేఖాభి స్సార్ధం తవ శరణకోణాః పరిణతాః॥

నాలుగు శివచక్రములతోను, ఐదుశక్తి చక్రములతోనూ, తొమ్మిదిమూల ప్రకృతికలతోనూ శ్రీచక్రము దేవికి నిలయమై ఉన్నది. ఇది బీజాక్షరములు లేని రేఖా విశిష్టము. అంటే ఇందులో బీజాక్షరాలు ఉండవు. కేవలం రేఖలతోనే నిర్మించబడినది. శ్రీచక్రాన్ని గురించి భైరవయామళంలో ఈవిధంగా ఉంది.

చతుర్భి శ్శివచక్రైశ్చ శక్తిచక్రైశ్చ పంచభిః
శివశక్త్యాత్మకం జ్ఞేయం శ్రీచక్రం శివయోర్వపుః.

శివచక్రాలు 4, శక్తి చక్రాలు 5 వెరసి 9 చక్రాలతో కూడిన శ్రీచక్రము శివశక్తుల స్వరూపపమై ఉన్నది. ఇదే విధంగా

బిన్దు త్రికోణ వసుకోణ దశారయుగ్మ
మన్వస్ర నాగదళ షోడశ పత్రయుక్తం
వృత్తత్రయంచ ధరణీ సదన త్రయంచ
శ్రీచక్ర రాజఉదితః పరదేవతాయాః

శ్రీచక్రంలో బిందువు, త్రికోణము, అష్టకోణము, దశకోణయుగ్మము, చతుర్దశకోణము, అష్టదళము, షోడశదళము, మేఖలాత్రయము, భూపురత్రయము ఉంటాయి. ఇదే విషయాన్ని ఈ విధంగా కూడా చెప్పటం జరిగింది.

బిందు త్రికోణ వసుకోణ దశారయుగ్మ
మన్వస్రదళ సంయుత షోడశారమ్
వృత్తత్రి భూపుర యుతం పరిత శ్చతుర్ద్వాః
శ్రీచక్ర మేత దుదితం పరదేవతయాః.

శ్రీచక్రాన్ని గురించి ప్రపంచ సారసంగ్రహంలో ఈ విధంగా చెప్పేరు.

బిందు త్రికోణకాష్టావతారయుగ లోక పత్రవృత్తయుతం ।
వసుకళవృత్త కళాదళవృత్త త్రిమహీగృహాం భజే చక్రమ్ ॥

బిందువు, త్రికోణము, అష్ఠకోణము, దశకోణములు రెండు.
చతుర్ధశకోణము, అష్టదళము, షోడశదళము, భూపురము అను చక్రాలు ఉన్నాయి.

త్రికోణ మష్టకోణం చ దశకోణ ద్వయం తథా
చతుర్దశారం చైతాని శక్తిచక్రాణి పంచ చః

దీనిలో త్రికోణము, అష్టకోణము, దశకోణములు రెడు, చతుర్దశకోణము అను ఐదు శక్తి చక్రాలు

బిందు శ్చాష్టదళం పద్మం, పద్మం షోడశపత్రకమ్
చతురస్రంచ చత్వారి, శివచక్రాణ్యనుక్రమాత్॥

బిందువు, అష్టదళము, షోడశదళము, భూపురము అను 4 శివచక్రాలు. ఈ రకంగా శ్రీచక్రంలో మొత్తం 9 చక్రాలు ఉన్నాయి.

త్వాంగౌరీం, త్రిపురాంపరాత్పరకళాం శ్రీచక్రసంచారిణీం॥

అనే శ్లోకాన్ని పట్టి సర్వకాలసర్వావస్తలలోనూ ఆ దేవి శ్రీచక్రంలోనే సంచరిస్తూ ఉంటుంది.

శ్రీచక్రము 9 చక్రముల సమూహమై ఉన్నది. దీనినే 'నవయోన్యాత్మకము' అంటారు. నవయోనులు నవధాతువులకు ప్రతీకలు.

కామికాతంత్రంలో' చెప్పినట్లుగా

త్వగసృఙ్మాంస-మేదోఽస్థి ధాతవ శ్శక్తి మూలకాః
మజ్జా శుక్ల ప్రాణ జీవ ధాతవ శ్శివమూలకాః॥

చర్మము, రక్తము, మాంసము, మెదడు, ఎముకలు అనే 5 ధాతువులు శక్తి మూలకాలు, మజ్జ, వీర్యము, ప్రాణము, జీవము అనే 4 ధాతువులు శివమూలకాలు.

నవధాతు రయందేహో నవయోని సముద్భవః
దశమీ యోని రేకైవ (దశమోధాతు రేకైవ) పరాశక్తి స్తదీశ్వరీ॥

ఈ దేహము నవయోనుల వలన పుట్టి నవధాతుమయమైనది. దీనిలో పదవధాతువు పరమేశ్వరి.

ఏవం పిండాండ ముత్పన్నం తద్వద్బ్రహ్మాండ ముద్భవౌ
పంచభూతాని శాక్తాని మాయాదీని శివస్యతు॥

మాయాచ శుద్ధ విద్యాచ మహేశ్వర సదాశివౌ
పంచవింశతి తత్త్వాని తత్రైవాంతర్భవంతితే॥

పంచభూతాలు శక్తి సంబంధాలు. మాయాదులు శివసంబంధాలు. ఇవన్నీ కలిసి 25 తత్త్వాలయి నవయోనులందు అంతర్భావం పొందుతున్నాయి. ఈతత్త్వాలు 25 కాదు 51 అని కొందరంటారు.

పంచభూతాని తన్మాత్ర పంచకం చేంద్రియాణిచ.
జ్ఞానేంద్రియాణి పంచైవ తథా కర్మేంద్రియాణిచ॥
త్వగాది ధాతవ సప్త పంచప్రాణాది వాయవః.
మనశ్చాహంకృతిః ఖ్యాతి ర్గుణాః ప్రకృతి పూరుషౌ॥

రాగోవిద్యా కలాచైవ నియతిః కాలఏవచ
మాయాచ శుద్ధవిద్యాచ మహేశ్వర-సదాశివౌ
శక్తిశ్చ శివతత్త్వంచ తత్త్వాని క్రమశో విదుః॥

తత్వాలు 51 ఈ క్రింది విధంగా ఉన్నాయి.

పంచభూతాలు 5
తన్మాత్రలు 5
జ్ఞానేంద్రియాలు 5
కర్మేంద్రియాలు 5
త్వగాది ధాతువులు 7
(చర్మము, రక్తము, మాంసము, మెదడు, ఎముకలు, మజ్జ, శుక్లము)
ప్రాణములు 5
మనస్సు 1
అహంకారము 1
ఖ్యాతి (జ్ఞానము) 1
గుణములు 3
ప్రకృతి 1
(మూలప్రకృతి)
పురుషుడు 1
(జీవుడు)

రాగము 1
(ఇచ్ఛ)
విద్య 1
కళలు 1
నియతి 1
(ఖియామికాశక్తి)
కాలము 1
(సంహారణకాలము)
మాయ 1
శుద్ధ విద్య 1
(మోక్షజ్ఞానము)
మహేశ్వరుడు 1
(రజోగుణుడైన సృష్టికర్త)
సదాశివుడు 1
(సృష్టికర్త)
శక్తి (సృష్టిస్థితిలయకారిణి) 1
శివతత్వము 1
(శుద్ధ బుద్ధముక్తి స్వరూపము)

మొత్తం తత్వాలు 51

ఈ తత్వాలలో కొన్ని కొన్నింటి యందు కలిసి ఉంటాయి. అది ఎలా అంటే

| | | | |
|---|---|---|---|
| 1. త్వగాది ధాతువులు | 7 | - | పంచభూతములయందు |
| 2. పంచప్రాణములు | 5 | - | వాయువునందు |
| 3. అహంకారము | | - | మనస్సునందు |
| 4. ఖ్యాతి | | - | విద్యయందు |
| 5. గుణములు 3 | | - | ప్రకృతియందు |
| 6. ప్రకృతి | | - | శక్తియందు |
| 7. పురుషుడు | | - | మహేశ్వరునియందు |
| 8. కళ | | - | శుద్ధ విద్యయందు |
| 9. కాలము | | - | మహేశ్వరుని యందు |
| 10. నియతి | | - | శక్తియందు |
| 11. శక్తి | | - | శుద్ధ విద్యయందు |
| 12. శివతత్త్వము | | - | సదాశివతత్త్వమందు |

ఈ రకంగా లెక్క పెట్టినట్లైతే మొత్తం తత్వాలు 25 మాత్రమే అవుతాయి. అవి.

| | | |
|---|---|---|
| 1. | పంచభూతాలు | 5 |
| 2. | తన్మాత్రలు | 5 |
| 3. | జ్ఞానేంద్రియాలు | 5 |
| 4. | కర్మేంద్రియాలు | 5 |
| 5. | మనస్సు | 1 |
| 6. | మాయ, శుద్ధ విద్య మహేశ్వరుడు సదాశివుడు | 4 |
| | మొత్తం తత్వాలు | 25 |

ఈ 25 తత్వాలూనవయోనులందు అంతర్భావం పొందుతున్నాయి. అందుకే శ్రీచక్రాన్ని బ్రహ్మాండాకారముగా వర్ణించటం జరిగింది.

చక్రం త్రిపురసుందర్యా బ్రహ్మాండాకార మీశ్వరి ।
పంచభూతాత్మకం చైవ తన్మాత్రాత్మక మేవచ ॥
ఇంద్రియాత్మక మేవంచ మనస్తత్త్వాత్మకం తథా ।
మాయాది తత్త్వరూపంచ తత్త్వాతీతం చ బైందవమ్॥
అహం దేవీ నచాన్యోఽస్మి బ్రహ్మైవాహంనశోకభాక్ ।
సర్వంఖల్విద మేవాహం నాన్యదస్తి సనాతనమ్ ॥

శ్రీ చక్రంలోని కోణాలు సంఖ్య మొత్తం 43. అది ఏ విధంగా అంటే

| | |
|---|---|
| చతుర్దశారంలో | 14 |
| బహిర్దశారంలో | 10 |
| అంతర్దశారంలో | 10 |
| అష్టకోణంలో | 8 |
| త్రికోణంలో | 3 |
| మొత్తం కోణాలు | 45 |

కాని ప్రస్తారమును బట్టి త్రికోణంలోని కింది రెండు కోణములూ అష్టకోణంలో అంతర్గతం అవుతున్నాయి. అందుచేత శ్రీచక్రం గీసి అందులోని కోణాలను గనక లెక్క పెట్టి నేట్లైతే వాటి సంఖ్య 43 వస్తుంది. బిందువుతో కలప్త 44 అవుతాయి. ఇక్కడ శక్తి చక్రాలు శివచక్రాలు ఒక దానితో ఒకటి అంతర్భావం

పొందుతున్నాయని భైరవయామళంలో చెప్పబడింది.

త్రికోణే బైందవం శ్లిష్టం, అష్టారేఽష్టదళాంబుజమ్
దశారయోష్షోడశారం భూగృహం భువనాశ్రకే॥

త్రికోణ బైంధవంశ్లిష్టం, అష్టారే అష్టదశాంబుజమ్
దశారమోషోడశారం, భూగృహం, భువనాశ్రకే॥

1. త్రికోణమున - బిందువు
2. అష్టకోణమున - అష్టదళపద్మము
3. దశారయుగ్మమున - షోడశదళము
4. చతుర్దశారమున - భూపురము చేరుతున్నాయి.

శివచక్రాలకూ, శక్తి చక్రాలకూ అవినాభావసంబంధం ఉన్నది. అది ఎరిగిన వాడే చక్రవిదుడు. శ్రీచక్రంలోని త్రికోణము, అష్టకోణము, దశారయుగ్మము, చతుర్దశారము, భూపురము. అనే ఆరు చక్రాలు మానవ దేహంలో మూలాధారము, స్వాధిష్టానము, మణిపూరకము, అనాహతము, విశుద్ధిచక్రము, ఆజ్ఞాచక్రము అనబడే షట్చక్రాలు గా చెప్పబగూతున్నాయి. శ్రీచక్రంలో శక్తి త్రికోణంరూపం లోనూ, శివుడు బిందువు రూపం లోనూ ఉంటారు.

శ్రీచక్రములోని చతుర్ద్వారాలు చతుర్వేదాలకు ప్రతీకలు. అద్వారములందు ప్రవేశించి నట్లైతే పరదేవతసాక్షాత్కరమౌతుంది. ఈ విషయం తంత్రరాజము' లో చెప్పబడింది.

శ్రీ చక్రస్య చత్వారి ద్వారాణి చతుర్వేదరూపాణి।
ద్వారప్రవేశేనైవ భవతి పరదేవతా సాక్షాత్కారః ।

లలితాత్రిశతిఫలశృతిలో, శ్రీ చక్రాన్ని గురించి వివరంగా చెప్పటం జరిగింది.

న తేషాం సిద్ధిదా విద్యా కల్పకోటిశతైరపి ।
చతుర్భిశ్శివచక్రైశ్చ శక్తిచక్రైశ్చ పంచభిః
నవచక్రైశ్చ సంసిద్ధం శ్రీచక్రం శివయోర్వపుః
త్రికోణమష్టకోణం దశకోణద్వయం తథా ॥
చతుర్దశారం చైతాని శక్తిచక్రాణి పంచ వ ।
బిందుశ్చాష్టదళం పద్మం పద్మం షోడశపత్రకమ్ ॥

చతురశ్రం చ చత్వారి శివచక్రాణ్యనుక్రమాత్ ।
త్రికోణే బైందవం శ్లిష్టం అష్టారేఽష్టదళాంబుజమ్ ॥
దశారయో షోడశారం భూగృహం భువనాశ్రకే ।
శైవానామపి శాక్తానాం చక్రాణాం చ పరస్పరమ్ ॥
అవినాభావ సంబంధం యో జానాతి స చక్రవిత్
త్రికోణరూపిణి శక్తి ర్బిందురూపపరః శివః ॥

శ్రీ చక్రము శివునియొక్కయు శరీరము: అందు శివచక్రములు నాలుగు, శక్తిచక్రములు అయిదును కలవు. త్రికోణము, అష్టకోణము, దశకోణములు కలిపి రెండు: చతుర్దశారము ఈ అయిదును శక్తి చక్రములు; బిందువు, అష్టదళ పద్మము, చతురశ్రము, ఈ నాలుగును శివచక్రములు. శివశక్తిచక్రములకు అవినా భావ సంబంధమున్నది. త్రికోణమందు బిందువు సంశ్లిష్టమైయున్నది. అష్ట కోణమందు అష్టదళపద్మము, దశకోణద్వయమునందు షోడశారము, భువనాశ్రకము నందు (చతుర్దశారమునందు) భూగృహము (చతురశ్రమము) సంశ్లిష్టములై యున్నవి. శైవశాక్త చక్రములయొక్క అవినాభావ సంబంధ మెరిగినవాడు చక్ర సంకేతము నెరిగినవాడగుచున్నాడు. శక్తి త్రికోణరూపిణి, శివుడు బిందురూపుడు;

భైరవయామళంలో శ్రీచక్రాన్ని గురించి ఈ విధంగా చెప్పబడింది.

చతుర్భి శ్శివచక్రైశ్చ శక్తిచక్రైశ్చ పంచభిః
నవ చక్రైశ్చ సంసిద్ధం శ్రీచక్రం శివయోర్వపుః ॥

త్రికోణ మష్టకోణం చ దశకోణ ద్వయం తథా
చతుర్దశారం చైతాని శక్తిచక్రాణి పంచ చ ॥

బిందు శ్చాష్టదళం పద్మం, పద్మం షోడశపత్రకమ్
చతురశ్రంచ చత్వారి, శివచక్రాణ్యనుక్రమాత్ ॥

త్రికోణే బైందవం శ్లిష్టం, అష్టారేఽష్టదళాంబుజమ్
దశారయోషోడశారం భూగృహం భువనాశ్రకే ॥

శైవానామపి శాక్తానాం చక్రాణాంచ పరస్పరమ్
అవినాభావసంబంధం యో జానాతి స చక్రవిత్॥
త్రికోణ మష్టకోణంచ దశకోణ ద్వయం తథా
మనుకోణం చతుష్కోణం కోణచక్రాణి షట్ క్రమాత్॥

మూలాధారం తథా స్వాధిష్ఠానం చ మణిపూరకమ్
అనాహతం విశుద్ధాఖ్య మాజ్ఞా చక్రం విదుర్బుధాః॥

తవాధార స్వరూపాణి కోణచక్రాణి పార్వతి
త్రికోణరూపిణీ శక్తిః బిందురూపశ్శివస్స్మృతః॥
అవినాభావసంబంధః తస్మా ద్బిందుత్రికోణయోః॥

1. శివచక్రములు నాలుగు, శక్తి చక్రములు ఐదుతో కూడి మొత్తము తొమ్మిది చక్రములతో శ్రీచక్రము శివశక్తుల శరీరమై ఉన్నది.
2. త్రికోణము, అష్టకోణము, దశకోణములు రెండు, చతుర్దశకోణము అనునవి ఐదు శక్తి చక్రములు
3. బిందువు, అష్టదళము, షోడశదళము, భూపురము అనునవి నాలుగు శివచక్రములు.
4. త్రికోణమునబిందువు,అష్టకోణమునఅష్టదళపద్మము, దశార యుగ్మమున షోడశదళపద్మము, చతుర్దశారమున భూపురము దశపద్మము, చతుర్దశారమున భూపురము చేరుచున్నవి.
5. ఈ శివచక్రములకు, శక్తి చక్రములకు పరస్పర అవినాభావసంబంధము ఎరిగిన వాడే చక్రవిదుడు.

6,7. త్రికోణము, అష్టకోణము, దశకోణయుగ్మము, చతుర్దశకోణము, భూపురము అనునవి ఆరు, మూలాధారము మొదలైన షట్చక్రములై ఉన్నవి..

8. ఓపార్వతీ! కోణములు కల ఈ చక్రములన్నీ నీ ఆధారస్వరూపములు. నీవు త్రికోణస్వరూపమైన శక్తివి. నేను బిందుస్వరూపుడనైనశివుడను. ఈ బిందు త్రికోణములకు అవినాభావ సంబంధము ఉన్నది.

శ్రీచక్రంలో 24 సంధులు, 28 మర్మాలు ఉన్నాయి.

ద్విరేఖాసంగమస్థానం సంధి రిత్యభిధీయతే
త్రిరేఖా సంగమస్థానం మర్మ మర్మవిదో విదుః॥

రెండు రేఖలు కలసిన చోట సంధి' అనీ మూడు రేఖలు కలిసినచోట మర్మస్థానము' అనీ అంటారు. చంద్ర జ్ఞానవిద్యయందు ఈ విధంగా చెప్పబడింది.

"మన్వశ్ర ద్విదశారాష్టకోణవృత్త చతుష్టయమ్.
అష్టావింశతి మర్మాణి చతుర్వింశతి సంధయః ॥

అంటే చతుర్దశారము, దశారయుగ్మము, అష్టకోణము మొదలైన చక్రాలందు మొత్తం 24 సంధులు, 28 మర్మాలు ఉన్నాయి. కాని, పై చక్రములు గీసి లెక్కపెట్టగా మర్మస్థానముల సంఖ్య 24 మాత్రమే ఉంటుంది. అయితే శివచక్రాలకు సంగమస్థానం లేకపోయినప్పటికీ, వాటిని కూడా మర్మస్థానాలుగానే పరిగణించాలి. అప్పుడు మర్మస్థానముల సంఖ్య 24+4=28 అవుతుంది. ఈ రకంగా శ్రీచక్రంలో 24 సంధులు, 28 మర్మాలు ఉన్నాయి.

శ్రీచక్రలేఖనము : శ్రీచక్రాన్ని రెండు రకాలుగా వ్రాయటం లేదా గీయటం జరుగుతుంది. అవి.

1. సృష్టి క్రమము 2. సంహారక్రమము.

1. సృష్టిక్రమము : ఇది సమయాచార చక్రము. దీనిలో 43 కోణాలు, 24 సంధులు, 28 మర్మాలు ఉంటాయి. దీనిలో 5 కోణములు క్రింది వైపుకూ, 4 కోణము పై వైపుకూ ఉంటాయి. బిందువు త్రికోణం మధ్యన ఉంటుంది.

2. సంహారక్రమము : ఇది కౌళాచార చక్రము. దీనిలో 4 కోణములు క్రింది వైపుకూ, 5 కోణములు పైవైపుకూ ఉంటాయి. బిందువు త్రికోణము మధ్యన ఉంటుంది. ఇందులో కోణములకు సంఖ్యా నియమంలేదు. మర్మములు, సంధులు మాత్రమే ఉంటాయి.

ఈ రెండు చక్రములయందు శివచక్రాలు, బిందువు ఒకే రకంగా ఉంటాయి.

శ్రీచక్రాన్ని స్థూలంగా సృష్టి చక్రం, స్థితి చక్రం, సంహార చక్రం అని మూడు భాగాలుగా విభజించవచ్చు. దీనిలో

1. బిందువు, త్రికోణము, అష్టకోణములను - సృష్టిచక్రం
2. దశారయుగ్మము, చతుర్దశారములను - స్థితిచక్రం
3. అష్టదళము, షోడశదళము, భూపురములను - సంహారచక్రం

అని అంటారు. శ్రీచక్రలేఖనంలో బిందువు నుండి మొదలుపెట్టి భూపురం వరకూ గీసినట్లైతే దాన్ని సృష్టి చక్రం అనీ, భూపురంతో మొదలు పెట్టి బిందువు

వరకు గీసినట్లైతే దాన్ని సంహార చక్రం అనీ అంటారు.

ప్రస్తారమును బట్టి శ్రీచక్రాన్ని మూడు రకాలుగా విభజించవచ్చు. అవి. 1. భూప్రస్తారము. 2. మేరుప్రస్తారము. 3. కైలాసప్రస్తారము.

శక్తిసంగమతంత్రంలో ఈ విధంగా చెప్పబడింది.

చత్వారి శివచక్రాణి । శక్తి చక్రాణి పంచచ
సామరస్యాద్భవే చ్చక్రం । శ్రీ చక్రం సర్వరూపకం ।
శుద్ధచక్రమిదం ప్రోక్తమిదమేవ త్రిధాభవేత్ ।
భూః కై లాసస్తథామేరుః । ప్రస్తారత్వేన పార్వతి ।
భూప్రస్తారో ద్విధాదేవి ।పాతాళోర్ధ్వ క్రమేణతు ।
కై లాసాఖ్యస్తు ప్రస్తారో । ద్వివిధః పరికీర్తి తః ।
అర్థ కై లాస సంజ్ఞస్తు । పూర్ణకై లాసకస్త థా ।
తదై వ మేరు ప్రస్తారః । కీర్తి తస్తు మయాతవ ।

శ్రీచక్రాన్ని శుద్ధచక్రం అనికూడా అంటారు. ఇది మూడు రకాలుగా వుంటుంది. 1. భూ ప్రస్తారము 2. మేరు ప్రస్తారము 3. కైలాస ప్రస్తారము.

భూప్రస్తారమును రెండు రకాలు. 1. పాతాళ భూప్రస్తారము 2. ఊర్ధ్వభూప్రస్తారము మేరుప్రస్తారము కూడా రెండు రకాలు. 1. అర్ధమేరు ప్రస్తారము. 2. పూర్ణమేరు ప్రస్తారము. కైలాసప్రస్తారము కూడా రెండు రకాలుగా వుంటుంది- 1. అర్ధకైలాస ప్రస్తారము 2. పూర్ణకైలాసప్రస్తారము.

బీజాక్షరయుతం చక్రం । యతీనా ముత్తమోత్తమం
బీజాక్షర విహీనంతుః గృహస్థానాం ప్రశస్థకం ॥

వీటిలో బీజాక్షరాలు లేని మొదటి రెండు రకాల చక్రాలు గృహస్తులకు ప్రశస్తమైనవి. కాగా బీజాక్షరములు కల చక్రం యతీశ్వరుల వద్ద ఉండటం శ్రేయస్కరము అని చెప్పగా శక్తిసంగమతంత్రంలో ఈ విధంగా వుంది.

బీజం వినాతునిర్జీవం । శివ వత్పరికీర్తి తం ।
బీజయుక్తం భవేద్యంత్రం । నిశ్శస్తం సిద్ధిదాయకం.
శ్రీ చక్రవం బీజసంయుక్తం । నిశ్శస్తం పరమేశ్వరీ ।
బీజహీనంతుయచ్చక్రం । తచ్చక్రం సిద్ధిదం వచ ।

శ్రీ చక్రంలో బీజాక్షరాలు లేకపోతే అది నిర్జీవము అవుతుంది. అందుచేత బీజాక్షరాలు లేని శ్రీచక్రపూజ సిద్ధించదు.ఇదిసంప్రదాయభేదం.

శ్రీచక్రలేఖనంలో భేదాలు :అసలు శ్రీచక్రాన్ని గీయటంలోనే కొన్ని భేదాలున్నాయి. అయితే ఈ తేడాలు వృత్తాలకూ, బిందువుకూ మాత్రమే పరిమితం అయి ఉన్నాయి.

వృత్తాలు : ముందుగా వృత్తాలను గురించి ఆలోచించినట్లైతే, అసలు శ్రీచక్రంలో వృత్తాలు ఉన్నాయా ? ఉంటే ఎన్ని ఉన్నాయి ? వాటి ఉపయోగం ఏమిటి ? అనే ప్రశ్నలుదయిస్తాయి.

హయగ్రీవ సంప్రదాయే శ్రీచక్రే వృత్తత్రయం న లిఖ్యతే। తత్రార్చనంనభవతి॥

ఆనంద భైరవ సంప్రదాయే వృత్తత్రయేపి లిఖ్యతే।తత్రార్చనంనభవతి॥

శ్రీ దక్షిణామూర్తి సంప్రదాయే వృత్తత్రయంలిఖ్యతే పూజతేతి॥

అని పుష్పగిరి పీఠ విద్వాంసులు శ్రీ విశ్వనాథంగారు అన్నారు.

అంటే హయగ్రీవ సంప్రదాయంలో వృత్తత్రయం లేదు. ఆనంద భైరవ సంప్రదాయంలో వృత్రయం ఉన్నది. కాని దానికి పూజమాత్రం లేదు. దక్షిణామూర్తి సంప్రదాయంలో వృత్తత్రయం ఉంది. దానికి పూజకూడా ఉంది. అయితే ఈ వృత్తాలు ఎక్కడ ఉన్నాయి? అనేదే ప్రశ్న.

బిందు త్రికోణ వసుకోణ దశారయుగ్మ
మన్వశ్రనాగదళ సంయుత షోడశారమ్
వృత్తత్రి భూపుర యుతం పరిత శ్చతుర్ద్వాః
శ్రీచక్ర మేత దుదితం పరదేవతయాః.

దీని ప్రకారము షోడశదళం తర్వాత వృత్తత్రయం వుంది.

బిందు త్రికోణశాష్టావతారయుగ లోక పత్రన్నృత్తయుతం।
వసుదళవృత్త కళాదళవృత్త-త్రిమహీగృహం భజే చక్రమ్।

దీనిప్రకారము చతుర్దశ కోణము తరువాత ఒక వృత్తము, అష్టదళము తరువాత ఒక వృత్తము, షోడశ దళము తరువాత ఒక వృత్తము ఉంటాయని తెలుస్తోంది. అయితే శ్రీచక్రంలో ఉండేవి మూడు వృత్తాలు కాదు, ఇది పంచవృత్తాత్మకమనీ, షడ్, సప్త, అష్టవృత్తాత్మకమనీ భిన్న వాదనలు వామకేశ్వర తంత్రము, సేతుబంధ వ్యాఖ్యలలో చర్చించ బడ్డాయి. కాని చివరకు

భాసురానందులవారు షోడశారం తరువాతనే వృత్త త్రయం ఉండాలి అని తీర్మానించారు. లక్ష్మీధరులు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు.

వృత్తాల ప్రాముఖ్యత : శ్రీ చక్రంలో వృత్తాలు ఎన్ని ఉన్నప్పటికీ, ఎక్కడ ఉన్నప్పటికీ అవి నవావరణలలో చేరటం లేదు. వాటికి ప్రత్యేకంగా పూజ కూడా జరగటం లేదు. ఎక్కువ గ్రంథాలలో కూడా ఈ వృత్తాలకు చక్ర సంజ్ఞ ఇవ్వబడలేదు. అందువల్ల వృత్తాల్లను చక్రనిర్మాణంలో ఒక భాగంగా మాత్రేమే గుర్తించాల్సి ఉంటుంది. బహుశః ఆయా చక్రాలలో ఉండే దేవతల పరిధి నిర్ణయించి ఉంచటానికే ఈ వృత్తాలు ఏర్పాటు చేసి ఉంటారు అని శ్రీ విశ్వనాధంగారు అభిప్రాయ పడుతున్నారు. కాని మూడు వృత్తాలు మంత్రంలోని మూడుహ్రీంకారాలకూ ప్రతీకలుగా చెప్పబడుతున్నాయి.

బిందువు : శ్రీ చక్రంలో ప్రధానమైనది బిందువు. ఇది తొమ్మిదవ ఆవరణ. దీనిని 'సర్వానందమయచక్రం' అంటారు. ఇక్కడ శివశక్తులు ఉంటారు. యోగినీ హృదయంలోని 15వ శ్లోక వ్యాఖ్యలో బిందువు త్రికోణం మధ్యన ఉంటుందని. చెప్పబడింది. దీన్ని అందరూ అంగీకరిస్తూ సమయ, కౌళాచారాల్లో అర్చనా భేదం మాత్రమే ఉన్నది అన్నారు. కాని లొల్ల లక్ష్మీధరులు మాత్రం చక్రనిర్మాణంలోనే భేదం చెప్పారు. వీరి మతానుసారం సంహారక్రమంలో బిందువు త్రికోణంలో ఉంటుంది. కాని సృష్టిచక్రంలో బిందువు చతు ష్కోణము లేదా షట్కోణము మధ్యన ఉంటుంది. ఈ విషయము ప్రక్కన ఉన్న పటంలో చక్కగా చూపబడింది. అంతేకాకుండా లక్ష్మీధరులు శ్రీచక్రంలోని మర్మాలను 28 గా చెప్పి, శివచక్రాలు 4 కూడా మార్మాలుగా గ్రహించాలి అన్నారు. ఇవన్నీ వామకేశ్వరతంత్రము, యోగినీ హృదయము, కులార్ణవ తంత్రము మొదలైన గ్రంథాలకు భిన్నంగా ఉన్నాయి. లక్ష్మీ ధరులు సర్వస్వతంత్రులు. స్వానుభవం పేరుతో ఈ విధంగా చాలా విషయాలువ్రాశారు.

త్రికోణే బైంధవమ్శ్లిష్టమ్ అనే దాన్ని బట్టి బిందువు త్రికోణమందు ఉన్నది అని తెలుస్తోంది. అంటే ఆధారచక్రంలోనే బిందువున్నది. దీనిని అందరూ అంగీకరిస్తున్నారు. కానీ లక్ష్మీధరులు మాత్రం బిందువు చతుష్కోణంలో ఉన్నదన్నారు. శివశక్తుల సంగమస్థానం అయిన బిందువు సృష్టిస్థానమయిన ఆధారచక్రంలోకాక, సృష్టికి ప్రేరణస్థానం అయిన నాభిస్థానం అంటే మణిపురంలో ఉంటుంది. అని బహుశః లక్ష్మీధరుల భావం కావచ్చు.

ఈ రకంగా సంప్రదాయ భేదాలనేకం ఉన్నప్పుడు గురుసాంప్రదాయాన్ని

మాత్రంమే పాటించాలి అని ఆర్యోక్తి, ప్రక్క పేజిలలో వివిధ సంప్రదాయాల చక్రాలు చూపబడ్డాయి.

| | | | |
|---|---|---|---|
| 1. | సంహారచక్రం | - | కౌళమతానుసాంము |
| 2. | సృష్టిచక్రం | - | సమయమతానుసారము |
| 3. | సృష్టిచక్రం | - | లక్ష్మీధరులసమయమతానుసారము |
| 4. | సబీజచక్రం | - | |

మానవ దేహము - శ్రీచక్రము


మానవ దేహం చర్మము, రక్తము, మాంసము, మేధస్సు, ఎముకలు, మజ్జ, వీర్యము, ప్రాణము, జీవము అనే తొమ్మిది ధాతువులవలన ఏర్పడింది. వీటిలో మొదటి ఐదు ధాతువులు శక్తిమూలకాలు. తరువాత నాలుగు శివమూలకాలు. శ్రీచక్రము తొమ్మది చక్రముల సమూహమై ఉన్నది. అందుకే దీనిని నవమోన్యాత్మకము అంటారు ఈనవయోనులు నవధాతువులకు ప్రతీకలని ఇంతకుముందే చెప్పటం జరిగింది. కాబట్టి మానవ శరీరానికి, శ్రీచక్రానికీ అవినాభావసంబంధం ఉంది. ఈ శరీరమే శ్రీచక్రం.

బైందవం బ్రహ్మరంధ్రంచ, మస్తకంచ త్రికోణకమ్ ।
లలాటేఽష్టార పత్రంచ, భృవోర్మధ్యేదశారకమ్॥
నాభేచ, వసుపత్రంచ, కట్యాం షోడశ పత్రకమ్।
వృత్తత్రయంచ ఊరూభ్యాం, పద్భ్యాం భూపురత్రయమ్।


మానవశరీరంలోని భాగాలు శ్రీచక్రంలోని భాగాలతో సమన్వయం చేయబడ్డాయి.

| | | |
|---|---|---|
| బ్రహ్మరంధ్రం | - | బిందువు |
| తలముందు భాగం | - | త్రికోణం |
| లలాటం | - | అష్టారం |
| భ్రూమధ్యం | - | అంతర్దశారం |
| కంఠం | - | బహిర్దశారం |
| హృదయం | - | చతుర్దశారం |
| నాభి | - | అష్టదళం |
| కటి | - | షోడశదళం |
| ఊరువులు | - | వృత్తాలు |
| పాదాలు | - | భూపురం |

సృష్టిచక్రం సమయమతానుసారము




సృష్టిచక్రం లక్ష్మీధరులసమయమతానుసారము




సంహారచక్రం

కౌళమతానుసారము



సబీజచక్రం



**షట్చక్రాలకు శ్రీచక్రంతో ఐక్యత:**

శ్రీచక్రంలో శివచక్రాలు 4, శక్తి చక్రాలు 5 మొత్తం 9 చక్రాలు ఉంటాయి. మానవ శరీరంలో షట్చక్రాలు ఉంటాయి. ఈ షట్చక్రాలకు శ్రీ చక్రంతో ఐక్యతనే 'నాదబిందు ఐక్యత' అంటారు. ఇక్కడ నాదము అంటే శ్రీచక్రము. బిందువు అంటే షట్చక్రాలసమూహము.

ఈ ఐక్యత ఏ రకంగా ఉంటుందంటే

| | | | |
|---|---|---|---|
| 1. | ఆధారచక్రానికి | - | త్రికోణంతో ఐక్యత |
| 2. | స్వాధిష్టానానికి | - | అష్టకోణంతో ఐక్యత |
| 3. | మణిపురానికి | - | అంతర్దశారంతో ఐక్యత |
| 4. | అనాహతానికి | - | బహిర్దశారంతో ఐక్యత |
| 5. | విశుద్ధి చక్రానికి | - | చతుర్దశకోణంతో ఐక్యత |
| 6. | ఆజ్ఞాచక్రానికి | - | అష్టదళము, షోడశదళము లతో ఐక్యత |
| 7. | సహస్రారానికి | - | నాలుగు ద్వారాలతో కూడిన భూపురంతో ఐక్యత చెప్పబడింది. |

ఇదే రకంగా శ్రీచక్రంలో ఉండే మూడు వృత్తాలూ వరుసగా

1. స్వాధిష్టానానికి పై భాగంలో బ్రహ్మగ్రంధిరూపంలోనూ
2. అనాహతానికి పై భాగంలో విష్ణు గ్రంధి రూపంలోనూ
3. ఆజ్ఞా చక్రానికి పై భాగంలో రుద్ర గ్రంధి రూపంలోనూ ఉంటాయి. ఈ రకంగా షట్చక్రాలకు శ్రీ చక్రానికీ ఐక్యత చెప్పబడింది.

**మూలమంత్రం యొక్క స్వరూపమే శ్రీచక్రము :**

శ్రీవిద్యలో మంత్రరాజము అని చెప్పబడేది 'పంచదశీ మహామంత్రం' ప్రతి మంత్రంలోనూ దానికి సంబంధించిన దేవత పేరు తప్పనిసరిగా ఉంటుంది. కాని పంచదశీమహామంత్రంలో ఏ దేవత పేరు ఉండదు. దీనిలో కేవలము బీజాక్షరాలు మాత్రమే ఉంటాయి. అలాగే ప్రతియంత్రంలోనూకూడా దేవత పేరూ, ఆ దేవతకు సంబంధించిన మంత్రము ఉంటాయి. కాని శ్రీచక్రంలో దేవత పేరుగాని, మంత్రంగాని ఉండవు. అదికేవలం రేఖా నిర్మితము. పరాశక్తికి మంత్రరూపమే పంచదశీ. యంత్ర రూపం శ్రీచక్రం. పంచదశీమహామంత్రంలో పదిహేను అక్షరాలు మూడు ఖండాలుగా విభజింపబడి హ్రీంకార సమాప్తంగా ఉంటాయి. వీటిలో ప్రధమ ఖండాన్ని ఆగ్నేయ ఖండం అనీ, ద్వితీయ ఖండాన్ని సూర్య ఖండం అనీ, తృతీయ ఖండాన్ని సౌమ్యఖండం అనీ అంటారు. ఈ రకంగా పంచదశీమహామంత్రం సోమసూర్యఅనలాత్మకమై ఉన్నది. ఇందులో ఉండే

మూడు హ్రీం కారాలూ వరుసగా బ్రహ్మ గ్రంధి, విష్ణు గ్రంధి, రుద్రగ్రంధి అని చెప్పబడ్డాయి. పంచదశీమంత్రంలో ఉండే మూడు హ్రీం కారాలే శ్రీచక్రంలోని మూడు వృత్తాలు. శ్రీ చక్రానికి లాగానే పంచదశీమహామంత్రానికి కూడా గణేశత్వము, యోగినీ రూపము, నవగ్రహత్వము, రాసుల స్వరూపము, నక్షత్రరూపము కూడా చెప్పబడ్డాయి. ఈ రకంగా పంచదశీమహామంత్రం యొక్క యంత్రస్వరూపమే శ్రీచక్రముకాని వేరుకాదు.

అసలు శ్రీచక్రమే పంచదశీమహామంత్రంనుంచి, పుట్టింది అని భాస్కరరాయలవారు తమ వరివశ్యారహస్యం అనే గ్రంధంలో వ్రాశారు.

కత్రితయాదీ కారాద్బిందుర్జాత స్తదగ్రిమేచక్రే,
హృల్లేఖాభి స్తత్పర చక్రత్రితయం హకారాభ్యామ్.
ఏకారేణచ తత్పర చక్రేజాతే సకారాభ్యామ్,
చతురశ్రాణి లకారై రేవం విద్యాక్షరేణ చక్రజనిః.

1. శ్రీవిద్య అందలి మూడవ క కరామువలన, ఈ కారము వలన బిందువు పుట్టింది.
2. మూడు హ్రీం కారల వల్ల త్రికోణము, వసుకోణము పుట్టాయి.
3. రెండు ల కారమలు, ఏ కారమువల్ల - అంతర్దశారము, బహిర్దశారము, చతుర్దశారము, వృత్త త్రయము పుట్టాయి.
4. రెండు స కారములచే అష్టదళము, షోడశదళము పుట్టాయి.
5. ల కారమువల్ల భూపురత్రయంపుట్టింది.

ఈ విధంగా పంచదశీ మహామంత్రంనుండే శ్రీచక్రము పుట్టింది.

**శ్రీచక్రము - గణేశాది రూపాలు :** శ్రీచక్రానికి 1. గణేశరూపము, 2. యోగినీరూపము, 3. నవగ్రహరూపము, 4. రాశి స్వరూపము, 5. నక్షత్ర రూపంకూడా వరివశ్యారహస్యంలో చెప్పబడ్డాయి.

1. గణేశరూపం :

రేఖాదళకోణగతై ర్ఘటనాచక్రేగణేశత్వమ్ ।

శ్రీచక్రంలో భూపురంలోని రేఖలు, అష్టదళ, షోడశదళము నందలి దళములు, త్రికోణము మొదలు చతుర్దశారము వరకు ఉన్న కోణములు మొదలైనవి

గణాలుగా చెప్పబడ్డాయి. ఈ గణాలన్నీ సమూహంగా ఉండటంచేత శ్రీచక్రానికి గణేశత్వం లభించింది.

2. యోగినీ రూపం :

స్థితిసంహృతి చక్రేద్వే, పద్మేద్వే, వృత్తభూగృహేచద్వే,
ఏవం షడ్భిర్యోగాత్ శ్రీచక్రం, యోగినీరూపమ్.

శ్రీచక్రాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు అవి.

1. అష్టదళము, షోడశదళము, భూపురము - సృష్టిచక్రము.
2. అంతర్దశారము, బహిర్దశారము, చతుర్దశారము - స్థితి చక్రము.
3. బిందువు, త్రికోణము, అష్టకోణాలు - సంహృతిచక్రము.

వీటిలో స్థితిచక్రము, సంహారచక్రము, అష్టదళము, షోడశదళము, షోడశదళము చివరనున్న వృత్తము, భూపురము, మొత్తం సంఖ్య ఆరు. ఇది షట్చక్రాలకు అధిదేవతలైన డాకిని, రాకిని, లాకిని, కాకిని, సాకిని, హాకిని, అను ఆర్గురు యోగినుల సంఖ్యకు సమానము. కాబట్టి శ్రీచక్రానికి యోగినీరూపంవచ్చింది.

3. నవగ్రహత్వం :

త్రైలోక్యమోహనాద్యై ర్నవభిశ్చక్రై ర్గ్రహత్వంచ ॥

శ్రీచక్రంలో తొమ్మిది చక్రాలున్నాయి. అవి

1. భూపురము - త్రైలోక్యమోహన చక్రము
2. షోడశదళము - సర్వాశాపరిపూరక చక్రము
3. అష్టదళము - సర్వసంక్షోభిణీచక్రము
4. చతుర్దశారము - సర్వసౌభాగ్యదాయినీ చక్రము
5. బహిర్దశారము - సర్వార్థసాధక చక్రము
6. అంతర్దశారము - సర్వరక్షాకర చక్రము
7. అష్టకోణము - సర్వసిద్ధిప్రద చక్రము
8. త్రికోణములు - సర్వరోగహర చక్రము
9. బిందువు - సర్వానందమయ చక్రము

ఈ రకంగా శ్రీచక్రంలో 9 చక్రాలున్నాయి. గ్రహాలసంఖ్య కూడా 9. కాబట్టి శ్రీచక్రానికి నవగ్రహత్వం ఏర్పడింది.

4. రాశి స్వరూపం :

పంచచతుశ్ర్స్రక్యశలాబిందుః వృత్తంచ భూబింబమ్,
ఏవం ద్వాదశ సంఖ్యై ర్ఘటనాచ్చక్రస్యరాశిత్వమ్.

శ్రీచక్రంలో కింది వైపు కోణాలు 5, పైవైపు కోణాలు 4. వృత్తత్రయం ఒకటి. భూపురము, బిందువు. మొత్తం సంఖ్య 12. రాసులసంఖ్య 12. కాబట్టి శ్రీచక్రానికి రాశి స్వరూపం ఏర్పడింది.

5. నక్షత్రరూపం :

వృత్తత్రయధరణీత్రయ మన్వస్రాణాం విభజ్యగణనేన।
సప్తభిరితరైశ్చక్రైశ్చక్రేనక్షత్రరూపత్వమ్॥

శ్రీచక్రంలో వృత్తాలు 3, భూపుర రేఖలు3 చతుర్దాశారంలో కోణాలు 14, బిందువు, త్రికోణము, అష్టకోణము, అంతర్దశారము, బహిర్దశారము, అష్టదళము, షోడశదళము. మొత్తం సంఖ్య 27. నక్షత్రాలు 27. కాబట్టి శ్రీచక్రానికి నక్షత్ర స్వరూపం ఏర్పడింది.

రుద్రయామళంలో శ్రీచక్రాన్ని గురించి ఈ విధంగా చెప్పబడింది.

పృశ్నయో నామ మునయః సర్వే చక్ర సమాశ్రయాః
సేవమానా శ్చక్రవిద్యాం దేవగంధర్వ పూజితామ్॥

అగ్నిష్టోమాత్మకం చక్ర మగ్నిష్టోమ మయం జగత్
అగ్నా వంతర్భతౌ భానుః అగ్నిష్టోమమయం స్మృతమ్॥
త్రిఖండం మాతృకా చక్రం, సోమసూర్యానలాత్మకమ్
త్రికోణం బైందవం సౌమ్య మష్టకోణంచ మిశ్రకమ్॥

చక్రం చంద్రమయం చైవ దశార ద్వితయం తథా
చతుర్దశారం వహ్నేస్తు చతుశ్చక్రంచ భానుమత్॥

ఏతత్ప్రసాదా దింద్రాద్యా వసవోఽష్టౌ మరుద్గణాః
యే యే సమృద్ధా లోకేఽస్మిన్ త్రిపురా చక్రసేవకాః॥

షట్‌త్రయంచ చక్రస్య సోమసూర్యానలాత్మకమ్
మహాలక్ష్మ్యాః పురం చక్రం తత్రైవా ప్తే సదాశివః॥

1. పృశ్నలను మునులందరూ శ్రీచక్రము నాశ్రయించినారు దేవ గంధర్వులు పూజించు శ్రీచక్రవిద్యను సేవించి ఉన్నారు.

2. శ్రీచక్రము అగ్నిష్టోమాత్మకమైనది. ఎందుకంటే జగత్తు అంతాకూడా అగ్ని మయమే. అగ్ని యందు లోపల సూర్యుడు ప్రకాశించు చున్నాడు. కాబట్టి ఇలా చెప్పబడింది.

3. మాతృకాచక్రమనబడు శ్రీచక్రము సోమ, సూర్య అనిలాత్మకమై మూడు ఖండములుగా ఉన్నది. త్రికోణము, బైంధవస్థానము, అష్టకోణము.

4. అను ఈభాగము చంద్రమయము, దశారయుగ్మము, చతుర్దశారము వహ్నిమయము., మిగిలిన నాలుగు చక్రములు భానుమయము.


5. ఈ చక్రప్రసాదమువలన ఇంద్రుడు మొదలగు దేవతలు, అష్ట వసువులు, మరుద్గణములు వెలయు చున్నారు. ఎవరెవరు లోకమందు సంపదలతో తులతూగు చున్నారో, వారందరూ శ్రీచక్ర సేవకు లే.

6. చక్రము యొక్క పురత్రయము సోమసూర్య అనలాత్మకము. ఈ చక్రము మహాలక్ష్మీపురము. ఇందే సదాశివుడున్నాడు.

శ్రీచక్రము మొత్తము తొమ్మిది. ఆవరణలతో ఉంటుంది. ఈ ఆవరణలయందు వివిధ దేవతలు, సరవ్వశక్తులూ ఉంటాయి. తొమ్మదవ ఆవరణ అయిన బిందువునందు ఆదిపరాశక్తి అయిన పరమేశ్వరి సదాశివునితోకలసి ఉంటుంది. ఈ విధముగా సర్వదేవతామయమైన శ్రీచక్రమును పూజించిన అష్ట సిద్ధులు, సర్వశక్తులూ లభించుననీ, జ్ఞానము, మోక్షము ప్రాప్తించుననీ చెప్పబడింది.

శ్రీచక్రమును అర్చింటం వల్లనే ఇంద్రాది దేవతలు, దిక్పాలకులు, మొదలగువారు తమ విధులను సక్రమంగా నిర్వర్తించగలుగుతున్నారు. లోకమున ఆధ్యాత్మిక సంపదలతో వెలుగొందు వారందరూ ఈ చక్రమును అర్చించువారే. శ్రీ చక్రము మహాలక్ష్మీ యొక్క పురము. దీనిలో పరమేశ్వరీ, సదాశివుడు సదా సంచరిస్తూంటారు. కాబట్టి భక్తులు దీనిని పూజించి దేవీ అనుగ్రహమునకు పాత్రులగుదురు గాక.

# శ్రీ చక్రము



## నవావరణపూజ

శ్రీచక్రము తొమ్మిది చక్రముల సమూహము. దీనిని 'నవయోన్యాత్మకము' అంటారు. నవయోనులు నవధాతువులకు ప్రతీకలు.

త్వగసృఙ్మాంస-మేదోఽస్థి ధాతవ శ్శక్తి మూలకాః
మజ్జా శుక్ల ప్రాణ జీవ ధాత్వవ శ్శివమూలకాః ॥

మానవశరీరము చర్మము, రక్తము, మాంసము, మేధస్సు, ఎముకలు, మజ్జ, వీర్యము, ప్రాణము, జీవము అనబడే తొమ్మిది ధాతువులతో ఏర్పడింది. వీటిలో మొదటి ఐదు ధాతువులు శక్తి మూలకాలు. తర్వాత నాలుగు ధాతువులు శివమూలకాలు. ఈ దేహము నవయోనుల వలన పుట్టి నవధాతుమయమైవున్నది అని కామికాతంత్రము లో చెప్పబడింది. చతుర్భి శ్శివచక్రైశ్చ శక్తిచక్రైశ్చ పంచభిః

అనగా శ్రీచక్రంలో శివచక్రాలు నాలుగు, శక్తిచక్రాలు ఐదు, మొత్తం తొమ్మిది చక్రాలు వుంటాయి. ఈ తొమ్మిది చక్రాలలోను విడివిడిగా దేవతలు వుంటారు. మొత్తం శ్రీచక్రానికి అధిదేవత రాజరాజేశ్వరి రాజరాజేశ్వరులు లేదా కామేశ్వరికామేశ్వరులు. ఈ తొమ్మిది చక్రాలను విడివిడిగా అవరణలు అంటారు. ఈ ఆవరణలను రత్నాయనర్షి వ్రాసిన ఆభరణదేవతాస్తుతి లో వివరించడం జరిగింది.

త్రైలోక్య మోహనం వందే సర్వాశాపరిపూరకమ్,
సర్వసంక్షోభణం చక్రం సర్వసౌభాగ్యదాయకమ్,
సర్వార్థసాధకం చక్రం సర్వరక్షాకరం పరమ్,
సర్వరోగహరం చక్రం సర్వసిద్ధిప్రదాయకమ్.
సర్వానందమయం చక్రమితి చక్రక్రమం భజే,

ఇమం మహాచక్రరాజ మింధానం స్వేన తేజసా.
విమృశ్య పుష్పాంజలినా వ్యాకీర్ణేనార్చయామిచ,
అమృతాబ్ధ్యవతారాబ్జ దేవ్యాత్మాసన మేవచ.
శ్రీచక్రాసనమంత్రాఖ్య సాధ్యసిద్ధాసనం భజే,

శ్రీ చక్రంలోని తొమ్మిది ఆవరణలూ ఈ క్రింది విధంగా ఉంటాయి.

| | | | |
|---|---|---|---|
| 1. | భూపురము | - | త్రైలోక్యమోహనచక్రము |
| 2. | షోడశదళము | - | సర్వాశాపరిపూరకచక్రము |
| 3. | అష్టదళము | - | సర్వసంక్షోభిణీచక్రము |
| 4. | చతుర్థశారము | - | సర్వసౌభాగ్యదాయినీచక్రము |
| 5. | బహిర్థశారము | - | సర్వార్థసాధకచక్రము |
| 6. | అంతర్దశారము | - | సర్వరక్షాకరచక్రము |
| 7. | అష్టకోణము | - | సర్వసిద్ధిప్రదచక్రము |
| 8. | త్రికోణము | - | సర్వరోగహరచక్రము |
| 9. | బిందువు | - | సర్వానందయమచక్రము |

ఈ తొమ్మిది చక్రాలు లేదా ఆవరణలలోనిదేవతలను విడివిడిగా పూజించటాన్నే నవావరణపూజ అంటారు.

1. త్రైలోక్యమోహనచక్రం : శ్రీచక్రంలోని ప్రథమ ఆవరణను భూపురము అంటారు. ఇది మూడు రేఖలుగా చతుర్ద్వారాలతో ఉంటుంది.

శ్రీచక్రశ్య చత్వారి ద్వారాణి చతుర్వేద రూపాణి

ద్వారప్రవేశనైవభవతి పరదేవతాసాక్షాత్కారః

శ్రీచక్రంలోని చతుర్ద్వారాలు చతుర్వేదాలకు ప్రతీకలు. ఆద్వారములందు ప్రవేశించినట్లైతే పరదేవత సాక్షాత్కారమవుతుందని తంత్రరాజము లో చెప్పబడింది.

ఈ చక్రానికి అధిదేవత త్రిపుర. ఇక్కడ ఉండే యోగినిపేరు ప్రకటయోగిని. ఈ చక్రం చతురస్రాకారంలో ఉంటుంది. ఇది భూతత్త్వాత్మకమైనచక్రము. ల కారప్రకృతికము. దీనిలో వరుసగా

గరిమాణం లఘిమానం వశిత్వమీశిత్వ మణిమమహిమానౌ,
ప్రాకామ్యం భక్త్యాహం వందే ప్రాప్తిం చ సర్వకామార్థమ్.
ఏతాసాం సంతతగృహప్రదక్షిణానిల మహం వందే,
బ్రాహ్మీమాహేశ్వర్యౌ కౌమారీ వైష్ణవీ చ వారాహీ.
ఇంద్రాణీ చాముండా లక్ష్మీర్గ పాండూ ద్వితీయభూగృహగాః,
సంక్షోభ ద్రావణకా కర్షణకావేశకోన్మదాదీంశ్చ.
ఖేచరీబీజయోన్యాఖ్యాః స్మృతయశ్చ గృహే భజే.
ఏతాః ప్రకటయోగిన్య స్త్రిపురా చక్రనాయికా.
సర్వసంక్షోభిణీ ముద్రా పాయాదేతిత్రికం మయి.

ప్రథమరేఖలో అణిమ, లఘిమ, గరిమ, మహిమ, ఈశత్వం, వశత్వం, ప్రాకామ్య, ప్రాప్తి అను అష్టసిద్ధులు, రెండవరేఖలో బ్రాహ్మి, మహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, మాహేంద్రి, చాముండ, మహాలక్ష్మి అనబడే మాతృకలు, మూడవ రేఖలో సర్వసంక్షోభిణ,సర్వవిద్రావిణి, సర్వాకర్షిణి, సర్వవశంకరి, సర్వోన్మాదిని, సర్వమహాంకుశ, సర్వఖేచరి, సర్వత్రిఖండ అనబడే ఎనిమిది శక్తులు ఉంటాయి,ఈ అవరణలో ఉండేది ప్రధానంగా శృంగార రసము. దీనిలోని దేవతలందరినీ అర్చించిన తరువాత సర్వసంక్షోభిణీముద్ర ప్రదర్శించాలి.

2. సర్వాశాపరిపూరకచక్రము : ఇది పదహారు దళాలతో కూడిన పద్మము. చంద్రకళా స్వరూపము స కార ప్రకృతికము. ఈ చక్రానికి అధిదేవత త్రిపురేశి. ఇక్కడ ఉండే యోగినిపేరు గుప్తయోగిని. ఈ అవరణలో

కామాకర్షిణికా నిత్యా బుద్ధ్యాకర్షణికా కళా.
అహంకారాకర్షణీ చ శబ్దాకర్షణికా తథా.
స్పర్శాకర్షిణికా నిత్యా రూపాకర్షిణికా కళా.
రసాకర్షిణికా నిత్యా గంధాకర్షిణికా కళా,
చిత్తాకర్షిణికా నిత్యా ధైర్యాకర్షిణికా కళా.
స్మృత్యాకర్షణికా నిత్యా నామాకర్షణికా కళా.
బీజాకర్షిణికా నిత్యా చాత్మాకర్షిణికా కళా.

అమృతాకర్షణీ నిత్యా శరీరాకర్షణీ కళా,
ఏతాస్తు గుప్తయోగిన్య స్త్రిపురేశీపదాంతికే.
సర్వవిద్రావణీముద్రా త్రయం మాం పాతు సర్వదా.

కామాకర్షిణి, బుద్ధ్యాకర్షిణి, అహంకారాకర్షిణి, శబ్దాకర్షిణి, స్పర్శాకర్షిణి, రూపాకర్షిణి, రసాకర్షిణి, గంధాకర్షిణి, చిత్తాకర్షిణి, ధైర్యాకర్షిణి, స్మృత్యాకర్షిణి, నామాకర్షిణి,బీజాకర్షిణి, ఆత్మాకర్షిణి అమృతాకర్షిణి, శరీరాకర్షిణి మొదలైన ఆకర్షణ దేవతలు అకారాది స్వరూపాలుగా ఉంటారు. ఇక్కడ ప్రధానరసము వీరరసము. ఈ దేవతలకు పూజచేసిన తరువాత సర్వవిద్రావిణీముద్ర ప్రదర్శించాలి.

3. సర్వసంక్షోభణ చక్రము : ఇది ఎనిమిది దళాలుగల పద్మము. అష్టమూర్త్యాత్మకము హ కార ప్రకృతికము. అధిదేవత త్రిపురసుందరి. ఇక్కడ గుప్తతరయోగిని అనే పేరుకల యోగిని ఉంటుంది.

అనంగకుసుమాఽనంగ మేఖలా చ ద్వితీయకా.
అనంగమదనాఽనంగమదనాతురయా సహ,
అనంగరేఖా చానంగ వేగానంగాంకుశాపి చ.
అనంగమాలినీ పాండునాగపత్రస్థితా ఇమాః,
ఏతా గుప్తతరాభిఖ్యా స్త్రిపురేశీపదాంతికే.
సర్వాకర్షణికా ముద్రా సంఘాతోఽవతు మాం సదా,

ఈ చక్రంలో అనంగకుసుమ, అనంగమేఖల, అనంగమదన, అనంగమదనాతుర, అనంగరేఖ, అనంగవేగిని, అనంగాంకుశ, అనంగమాలిని అనే దేవతలు ఎనిమిది మంది క కారము నుండి క్ష కారాంతము వరకు ఉంటారు. ఇక్కడ ప్రధానరసము కరుణరసము. ఈ దేవతలను అర్చించిన తరువాత సర్వాకర్షిణి ముద్ర ప్రదర్శించాలి.

4. సర్వసౌభాగ్యదాయకచక్రం : ఇది చతుర్దశభువనాత్మకమైన పధ్నాలుగు కోణాలు కల చక్రం. ఈం కార ప్రకృతికము. దీనికి అధిదేవత త్రిపురవాసిని. ఇక్కడ సంప్రాదాయయోగిని అనుపేరుకల యోగిని ఉంటుంది. ఈ ఆవరణలో

సర్వసంక్షోభిణీ శక్తి స్సర్వవిద్రావిణీ తథా.
సర్వాభంజనశక్తిశ్చ తథా సర్వవశంకరీ,
సర్వారంజనశక్తిశ్చ సర్వోన్మాదనశక్తికా.

ఏవం సంమోహినీశక్తిస్సర్వ స్తంభనకారిణీ,
సర్వార్థసాధనీ శక్తిస్సర్వసంపత్తిప్రపూరిణీ.
సర్వమంత్రమయీ శక్తిస్సర్వద్వంద్వక్షయంకరీ,
ఏతాస్తు సంప్రదాయాఖ్యా స్త్రీపురేశీపదాంతికే.
ముద్రాశక్తిస్వరూపాఢ్యా తిత్తిన్నామాంకితాస్తు తాః,
తద్దేవీనాం మహాముద్రా బ్యందసేతిస్సదావతు,

సర్వసంక్షోభిణి, సర్వవిద్రావిణి,సర్వాకర్షిణి, సర్వాహ్లాదిని, సర్వసమ్మోహిని, సర్వస్తంభినీ, సర్వజృంభిణి, సర్వవశంకరి, సర్వరంజని, సర్వోన్మాదిని, సర్వార్థసాధిని, సర్వసంపత్తిపూరిణి, సర్వమంత్రమయి, సర్వద్వంద్వక్షయంకరి అనే దేవతలు క కారము నుండి థ కారము వరకు బిందుసంయుక్తంగా అక్షరరూపంలో ఉంటారు. ఇక్కడ ప్రధానరసము భయానకరసము. ఈ దేవతలను పూజించిన తరువాత సర్వవశంకరీముద్రను ప్రదర్శించాలి.

5. సర్వార్థసాధకచక్రం : ఇది దశావతార తత్త్వాత్మకమైన పదికోణములుగల చక్రం. ఏ కారప్రకృతికము. ఈ చక్రానికి త్రిపురాశ్రీ అధిదేవత. ఇక్కడ ఉండే యోగినిపేరు కుళోత్తీర్ణయోగిని.

'సర్వసిద్ధిప్రదా దేవీ సర్వసంపత్ప్రదా తథా,
సర్వప్రియంకరీ దేవీ సర్వమంగళకారిణీ.
సర్వకామప్రదా దేవీ సర్వదుఃఖ విమోచనీ,
సర్వమృత్యుప్రశమనీ సర్వవిఘ్న నివారిణీ.
సర్వాంగసుందరీ దేవీ సర్వసౌభాగ్యదాయినీ,
ఏతా దేవ్యగ్ని కుళోత్తీర్ణా స్త్రీపురాచక్రనాయికాః.
సర్వోన్మాదకముద్రాశ్చ సర్వా స్త్రాగ్ని పాతు మాం సదా,

దీనిలో సర్వసిద్ధిప్రదాదేవి, సర్వసంపత్ప్రదాదేవి, సర్వప్రియంకరి, సర్వమంగళకారిణి, సర్వకామప్రదాదేవి, సర్వదుఃఖవిమోచనీదేవి, సర్వమృత్యుశమనీదేవి, సర్వవిఘ్ననివారిణి, సర్వాంగసుందరి, సర్వసౌభాగ్యదాయనీ, అనే పదిమంది దేవతలు ఐ కారము మొదలు

భ కారము వరకు బిందువుతోకూడిన అక్షరరూపంలో ఉంటారు. ఈ చక్రంలో ప్రధానమైనది భీభత్సరసము. ఈ దేవతలను పూజించిన తరువాత సర్వోన్మాదినీ ముద్రప్రదర్శించాలి.

6. సర్వరక్షాకరచక్రము : ఇది వైశ్వానర తత్వాత్మకమైన పదికోణములు కల చక్రం, ర కార ప్రకృతికము, ఈ చక్రానికి అధిదేవత త్రిపురమాలిని. ఇక్కడ నిగర్భయోగిని అను పేరుకల యోగిని ఉంటుంది.

సర్వజ్ఞా సర్వశక్తిశ్చ సర్వైశ్వర్య ప్రదాయినీ.
సర్వజ్ఞానమయీ దేవీ సర్వవ్యాధి వినాశిని,
సర్వాధారస్వరూపా చ సర్వపాపహరా తథా.

సర్వానందమయీ దేవీ సర్వరక్షాస్వరూపిణీ,
సర్వేప్సితప్రదా హ్యేతా యోగిన్యో గర్భసంజ్ఞకాః.
త్రిపురా మాలినీ చైవ ముద్రాచైవ మహాంకుశమ్,
అంతర్దశారసంచార్య స్సర్వా మాం పాంతు సైశ్వరమ్.

దీనిలో 1. సర్వజ్ఞాదేవి 2. సర్వశక్తిదేవి 3. సర్వైశ్వర్యప్రదాయిని 4. సర్వజ్ఞానమయి. 5. సర్వవ్యాధివినాసిని 6. సర్వాధారస్వరూపాదేవి 7. సర్వపాపహరాదేవి 8. సర్వానందమయిదేవి 9. సర్వరక్షాస్వరూపిణి 10. సర్వేపిసత్ఫలాదేవి అనే పదిమంది దేవతలు మ కారము మొదలు క్ష కారము వరకు బిందు సంయుక్తమైన అక్షరరూపంలో ఉంటారు. ఈ చక్రంలో ప్రధానమైనది రౌద్రరసము. ఈ దేవతలను పూజించిన తరువాత సర్వమహాంకుశముద్ర ప్రదర్శించాలి.

7. సర్వరోగహరచక్రం : ఇది అష్టవిధ ప్రకృత్యాత్మకమైన అష్టకోణము క కారప్రకృతికము. దీనికి అధిదేవత త్రిపురాసిద్ధాంబ. ఇక్కడ రహశ్యయోగిని అను పేరు గ ల యోగిని ఉంటుంది.

వశినీ కామేశ్వర్యో మోదిన్యమలారుణాజయిన్యశ్చ,
సర్వేశీ కౌలిన్య శ్చైతాస్తు రహస్యయోగినీ దేవ్యః,
మాం పాతు లోకవంద్యా త్రిపురా సిద్ధా చ ఖేచరీ దేవీ,

దీనిలో 1. వశిని, 2. కామేశ్వరి. 3. మోదిని, 4. విమల, 5. అరుణ, 6. జయిని, 7. సర్వేశ్వరి, 8. కౌళిని అను ఎనిమిది మంది వాగ్దేవతలు అ కారాది క్ష కారాంతము బిందు సంయుక్తమైన అక్షరరూపంలో ఉంటారు. ఈ చక్రంలో ప్రధానమైనది హాశ్యరసము. ఈ దేవతలను పూజించిన తరువాత సర్వఖేచరీముద్రను ప్రదర్శించాలి.

8. సర్వసిద్ధిప్రదచక్రం : ఇది త్రిగుణాత్మకమైన కోణము. నాదప్రకృతికము. దీనికి అధిదేవత త్రిపురాంబ. ఇక్కడ అతిరహశ్యయోగిని అనేపేరుకల యోగిని ఉంటుంది.

> సర్వజనజంభ సేషూన్వాం దేఽఖిల జనవిమోహనః ధనుః.
> పాశం వశీకృతికరం స్తంభసమంకుశమపీహ లక్షితాయాః,
> కామేశ్వరీ వజ్రేశ్వరీ భగమాలిన్యోఽపి పాంతుః.
> కోణత్రయవాస్తవ్యా ఏతాశ్చ పరమతి రహస్యయోగిన్యః,
> త్రిపురాంబా చక్రేశీ సబీజముద్రా సదా పాతు.

దీనిలో 1. కామేశ్వరి 2. వజ్రేశ్వరి 3. భగమాలిని అనే ముగ్గురు దేవతలు అయుధబీజసంయుతులై ఉంటారు. ఈ చక్రంలో ప్రధానరసము అద్భుతరసము ఈ దేవతలను పూజించిన తరువాత సర్వబీజముద్ర ప్రదర్శించాలి.

9. సర్వానందమయచక్రం : ఇది పంచబ్రహ్మాత్మకమైన బిందు స్వరూపము. బ్రహ్మస్వరూపము. ఈ చక్రానికి అధిదేవత మహాత్రిపురసుందరి. ఇక్కడ పరాపరరహశ్యయోగిని అనే పేరుగల యోగిని ఉంటుంది.

> యా బిందుచక్రనిలయా విశుద్ధసంవిద్విలాసకల్లోలా,
> సా పాతు మాం సమంతాత్సాంద్రానందార్ద్రహృదయ చంద్రకళా.
> సర్వానందమయస్థా పరాపరరహస్యయోగినీ శోభా,
> శ్రీమన్మహాత్రిపురసుందర్యభిధా యోనిముద్రయా సహితా,

దీనిలో రాజరాజేశ్వరి, రాజరాజేశ్వరులు ఉంటారు. ఇది సర్వభావ నవరసభరితమైన చక్రం. ఈ దేవతలను పూజించిన తరువాత సర్వయోని ముద్రను ప్రదర్శించాలి.

ఈ రకంగా శ్రీచక్రంలోని తొమ్మిది ఆవరణలనూ విడివిడిగా పూజించినట్లైతే అందులో సూచించిన ఫలితం కలుగుతుంది. కాని శ్రీచక్రం మొత్తాన్ని గనక పూజించినట్లైతే సర్వకార్యశిద్ధి కలుగుడుంది.

## దేవిపూజ - ఆచారాలు

భారతదేశంలో అనాదిగా అనేకానేక దేవతలను పూజించటం,ఉపాసించటం జరుగుతూనే ఉంది. ఈ ఉపాసనము సాధకులు తమకోర్కెల ననుసరించి ఎవరికి అనువైన పద్ధతిలో వారు, గురువుయొక్క ఆదేశానుసారం చేస్తూంటారు. భారతదేశంలో శ్రీవిద్యా సంప్రదాయంలో యతులకు గృహస్తులకు పది గురుపరంపరలున్నాయి. అవి గిరి, సాగర, భారతి, పురి, సరస్వతి, అరణ్య, తీర్థ,ఆనంద, నాధ, ఆశ్రమ మొదలైనవి. వీరందరి ఆచారల్లోనూ తేడాలుంటాయి. ఇవికాక ఇంకా అనేక ఆచారాలున్నాయి.

1. కౌళాచారులు : వీరు ఆధార చక్రాన్ని పూజిస్తారు.

2.క్షపణికులు : స్త్రీ యోనిని పూజిస్తారు. పూర్వాదితంత్రాలు వీరికి ప్రమాణాలు.

3.కాపాలికలు : పంచామృతతంత్రం వీరికి ప్రమాణము.

4.దిగంబరులు : రూపభేదము, భూతోడ్డారము నుంచి నికుంఠేశ్వర తంత్రము వరకు గల ఎనిమిది తంత్రములు వీరికి ప్రమాణాలు.

5.ఇతిహాసులు : వీరు వస్త్రహీనులు. భైరవయామళము వీరికి ప్రమాణ గ్రంథం.

6.వామాచారులు : వీరు తంత్రవాదులు. వామకేశ్వరతంత్రం వీరికి ప్రమాణ గ్రంథం.

7.సమయాచారులు : వీరు బ్రహ్మవాదులు, జ్ఞానులు. వీరికి శుభాగపంచకము ప్రమాణము.

వీళ్ళలో కాపాలికులు, దిగంబరులు, క్షిపణికులు మొదలయినవారు జంతుబలి, నరబలి ఇచ్చినట్లైతే తమ కోర్కెలు తీరుతాయి అని నమ్ముతారు. వీరు కాళి, స్మశానభైరవిలాంటి ఉగ్రదేవతలను అర్చిస్తారు. మన కథలలో ఉండే మాంత్రికులు ఈ కోవకు చెందినవారే. వీరందరూ కూడా ఐహికవాంఛలను తీర్చుకోవటానికే దేవీపూజ చేస్తారు. అందుకనే

శ్లో॥ చతుష్షష్ట్యా తంత్రైః సకల మతిసంధాయ భువనం
స్థిత స్తత్తత్సిద్ధి ప్రసవ పరతంత్రైః పశుపతిః
పున స్త్వన్నిర్బంధా దఖిల పురుషార్థైకఘటనా
స్వతంత్రం తే తంత్రం క్షితితల మవాతీతరదిదమ్॥

అన్న శ్లోకంలో పార్వతి శివుడితో "దేవా నీవు చెప్పిన 64 తంత్రాల ద్వారా నా భక్తులు ఐహికబంధాలలో కూరుకుపోతున్నారు. వారికి మోక్షం ప్రసాదించిటానికి ఏదైనా ఇంకొక మార్గము సూచించవలసినది" అన్నది. అప్పుడు శివుడు మోక్షప్రదమైన శ్రీవిద్యాతంత్రాన్ని చెప్పాడు.

ఈ శ్లోకాన్ని పరిశీలిస్తే కేవలం కామ్యవాదులు, మోక్షవాదులని రెండు రకాలవారున్నారు అని తెలుస్తుంది. వీరి ఆచారవ్యవహారాలనుబట్టి దేవీ ఉపాసనాపరులను మూడు రకాలుగా విభజించవచ్చు అని కె. విశ్వనాథంగారు అన్నారు. అవి :

1. కాశ్మీరు పద్ధతి : ఇది శుద్ధ దక్షిణాచారము

2. వంగదేశ పద్ధతి : ఇది వామాచారము

3. కేరళ పద్ధతి : ఇది మిశ్రమాచారము

కాని ప్రస్తుతం నాడుకలో నాలుగు పద్ధతులు కనిపిస్తున్నాయి. అవి :

1. కౌళాచారము 2. మిశ్రమాచారము 3. సమయాచారము 4. వామాచారము.

సగుణబ్రహ్మను గురించి చేప్పే తంత్రశాస్త్రాలను ఆగమాలు అంటారు. వీటిని సమిష్టిగా మంత్రశాస్త్రం అని పిలుస్తారు. అతి సామాన్యులకు కూడా అర్థమయి వారి హృదయాలను స్పందింపచేసేవి ఈ ఆగమాలు. ఆగమాలలో వైష్ణవాగమాలు, శైవగమాలు, శక్త్యాగమాలు అని మూడు రకాలున్నాయి. శక్తిని జగన్మాతగా, పరతత్త్వంగా చేప్పే ఆగమాలను శక్త్యాగమాలు అంటారు. కౌళ, మిశ్రమ, సమయవర్గాలు. వీటిలో సాత్విక ఆగమాలకు తంత్రాలు అనీ, రాజసాలకు యామళాలు అనీ, తామసాలకు డామరాలు అనీ, పేర్లున్నాయి.

కౌళాచారులు : పురుషార్థాలలో అర్థకామాలకే ప్రాధాన్యత ఇచ్చేవారు కౌళులు. వీరికి బాహ్యపూజయే కాని అంతర్పూజ లేదు. వీరు ప్రత్యక్షంగా శ్రీచక్రాన్ని పూజిస్తారు. వీరికి కౌళాగమాలుగా పిలవబడే అరవైనాలుగు తంత్రాలు ప్రామాణికాలు. ఈ చతుషష్ట తంత్రాలు దేవీపూజకు ఉత్తమమైనవి. అని చతుశ్శతి యందు చెప్పబడింది.

శ్లో॥ చతుష్షష్టిశ్చ తన్త్రాణి మాతృణా ముత్తమానిచ
మహామాయా శంబరంచ యోగినీ జాల శంబరమ్॥

తత్త్వ శంబరకంచైవ భైరవాష్టక మేవచ
బహురూపాష్టకం చైవ యమళాష్టక మేవచ॥

చంద్రజ్ఞానం మాలినీంచ మహాసమ్మోహనం తథా
వామజుష్టం మహాదేవం వాతులం వాతులోత్తరమ్॥

హృద్భేదం తంత్రభేదంచ గుహ్యతంత్రంచ కామికమ్
కలావాదం కలాసారం తథాన్యత్ కుండికామతమ్॥

మతో త్తరంచ వీణాఖ్యం త్రోతలం త్రోతలో త్తరమ్
పంచామృతం రూపభేదం భూతోడ్డామర మేవచ॥

కులసారం కులోడ్డీశం కుల చూడామణి స్తథా
సర్వజ్ఞానో త్తరం చైవ మహాకాళీమతం తథా॥

అరుణేశం మోదినీశం (మేదినీశం) వికుంఠేశ్వర (వికుంఠేశ్వర) మేవచ
పూర్వ పశ్చిమ దక్షంచ ఉ త్తరంచ నిరు త్తరమ్
విమలం విమలోత్థంచ దేవీమత మతఃపరమ్॥

1. మహామాయాశాంబరము. 2.యోగినీజాలశాంబరము 3. తత్త్వశాంబరము 4. సిద్ధభైరవ 5.వటుభైరవ 6. కాలభైరవ 7. కంకాళభైరవ 8. కాలాగ్నిభైరవ 9. యోగినీభైరవ 10. మహాభైరవ 11. శక్తిభైరవ (4 - 11 ను భైరవాష్టకము అంటారు) 12. బ్రాహ్మీ 13. మహేశ్వరి 14. కౌమారి 15. వైష్ణవి 16. వారాహి 17. మాహేంద్రి 18. చాముండ 19. శివదూతి (12 -19 ని బహురూపాష్టకము అంటారు) 20 - 27 యమళాష్టకము. కామసిద్ధాంబకు యమళ అని పేరు. కామసిద్ధాంబ ప్రతిపాదకములైన తంత్రాలు ఎనిమిది. 28. చంద్రజ్ఞానము. 29. మాలినీ తంత్రము 30. మహాసమ్మోహనము 31. వాజుష్టము 32. మహాదేవతంత్రము 33. వాతులము 34. వాతులోత్తరము 35 కామికము 36 హృద్భేదతంత్రము 37.తంత్రభేదము 38. గుహ్యతంత్రము 39. కలావాదము 40. కలాసారము 41. కుండికామతము 42. మతోత్తరము 43. వీణాఖ్య 44. త్రోతలతంత్రము 45.త్రోతలోత్తరము. 46. పంచామృతము 47. రూపభేదము 48. భూతోడ్డారము 49.కులాసారము 50. కులోడ్డేశము 51. కులచూడామణి. 52. సర్వజ్ఞానోత్తరము 53. మహాకాళీమతము 54. అరుగేశము 55. మోదినీశము. 56. వికుండేశ్వరము 57. పూర్వతంత్రము 58. పశ్చిమ తంత్రము. 59. దక్షిణతంత్రము 60. ఉత్తరతంత్రము 61. నిరుత్తరము 62.విమలము 63.విమలోద్ధము. 64. దేవీమతము అను 64 తంత్రాలు వీరికి ప్రామాణికాలు. ఈ 64 తంత్రాలు అన్నీ తెలిసిన వారిని కూడా పెడత్రోవను పట్టిస్తాయి. ఇవి ఐహికసిద్ధికి మార్గాలు. కాబట్టి వైదిక మార్గానికి పనికిరావు. కొంతమంది పండితులకు కూడా ఐహికఫలాపేక్ష చేత ఈ తంత్రమార్గాన్ని అనుసరిస్తున్నారు. వారందరూకూడా వంచితులే అని గ్రహించగలరు.

కౌళాచారులు షట్చక్రాల్లోకి ఆధారచక్రాన్ని పూజిస్తారు. కుః అంటే పృథివీ తత్త్వము. అది షట్చక్రాలలోని ఏ చక్రమందు ఉంటుందో, దాన్ని కులము అంటారు. ఇది ఆధారచక్రంలో ఉంటుంది. శ్రీచక్రానికి బాహ్యపూజచేసే వారు కేవలం కామ్యసిద్ధి కోసమే

చేస్తారు. అందుకే వీరు పృథివీ తత్త్వాత్మకమైన ఆధారచక్రాన్ని పూజిస్తారు. కాబట్టి వీరి పూజను కౌళము అనీ వీరి ఆచారాన్ని కౌళాచారము అనీ అంటారు. వీరు శ్రీచక్రాన్ని భూర్జరీపత్రము, పట్టు వస్త్రము, బంగారు లేక వెండి రేకు మీద వ్రాసి దాన్ని ఆరాధిస్తారు. దీనిని కౌళపూజ అంటారు.

షట్చక్రాల్లోని ఆధార, స్వాధిష్ఠానాలు అంధకార బంధురాలు. వాటియందు కౌళులకే అధికారం వుంది. భైరవయామళంలో

శ్లో॥ చతుర్భి శ్శివచక్రైశ్చ శక్తిచక్రైశ్చ పంచభిః
నవ చక్రైశ్చ సంసిద్ధం శ్రీచక్రం శివయోర్వపుః॥

శ్లో॥ త్రికోణ మష్టకోణం చ దశకోణ ద్వయం తథా
చతుర్దశారం చైతాని శక్తిచక్రాణి పంచ చ॥

శ్లో॥ బిందు శ్చాష్టదళం పద్మం, పద్మం షోడశపత్రకమ్
చతురశ్రంచ చత్వారి, శివచక్రాణ్యనుక్రమాత్॥

నాలుగు శివచక్రాలు, ఐదు శక్తి చక్రాలతో ఉన్న చక్రాన్నే శ్రీచక్రం అంటారు. దీనిలో త్రికోణము,అష్టకోణము, అంతర్దశారము, బహిర్దశారము, చతుర్దశారము అనే ఐదు శక్తిచక్రాలు. బిందువు, అష్టదళము షోడశదళము, భూపురము అనే నాలుగు శివచక్రాలు.

ఆధార చక్రమే త్రికోణము. దానిలో బిందు ఉన్నది అని ప్రసిద్ధి. కౌళమతానుసారము త్రికోణమే బిందు స్థానం. ఆ బిందువే త్రికోణమందు ఆరాధింపతగినది. అందుకే కౌళులు త్రికోణాన్ని పూజిస్తారు. ఈ త్రికోణము రెండు రకాలుగా ఉంటుంది.

1. శ్రీచక్రంలో మధ్య ఉన్న త్రికోణము
2. సుందరాంగి అయిన స్త్రీ యొక్క ప్రత్యక్షయోని.

కౌళాచారుల్ని రెండు రకాలుగా విభజించవచ్చు.

1. పూర్వకౌళులు 2. ఉత్తరకౌళులు

పూర్వకౌళులు శ్రీచక్రాన్ని భూర్జరీపత్రము, పట్టు వస్త్రము, బంగారు లేదా వెండి రేకు మీద వ్రాసి దానిలోని త్రికోణాన్ని పూజిస్తారు. ఉత్తరకౌళులు స్త్రీ యొక్క ప్రత్యక్ష యోనిని పూజిస్తారు. వీరికి శివుడనేవాడు ప్రత్యేకంగా లేడు.

ఈ రెండు రకాల పూజలూ బాహ్యపూజలే. అందుచేత వారికి ఆధార చక్రమే పూజనీయం అవుతుంది. అందులో ఉండే కుండలినీ శక్తినే కౌళిని అంటారు. త్రికోణపూజలో కౌళినియే ఉపాస్యం.

ఆధారచక్రంలో కుండలినీ శక్తి సర్పాకారం ధరించి తోకను నోటితో కరచి

పట్టుకున్నట్లుగా ఉంటుంది. నిద్రావస్థలో ఉన్నప్పటికీ కుండలినీ శక్తి పూజింపతగినదే. అందుకే ఆ పూజను తామిశ్రకము అంటారు. ఆధారస్వాదిష్టానాలు అంధకారబంధురాలు. వాటి మీద కౌళాచారులకు మాత్రమే అధికారం ఉంది. కుండలీనీ ప్రబోధం ఎప్పుడు కలుగుతుందో, ఆ క్షణంలోనే కౌళులకుముక్తి కలుగుతుంది. అందుకనే కౌళులను క్షణముక్తులు అంటారు. కౌళులకు త్రికోణంలో భైరవీభైరవులు పూజనీయులు.

జపాకుసుమ సంకాశౌ మదఘూర్ణితలోచనౌ
జగతః పితరౌవందే భైరవీ భైరవాత్మకౌ॥

సాధకులు వారితో ఐక్యము పొందటం అనేది ముఖ్యం. అందుకనే బిందువును పూజించేటప్పుడు స్త్రీపురుషులు భైరవాకారమైన దిగంబరత్వాన్ని ఆశ్రయించి, అంటేవారు దిగంబరులై పూజచేస్తారు. వామాచారప్రవృత్తి ననుసరించి మధు, మత్స్య, మాంసాలతో సమారాధన చేస్తారు.

ఉత్తరకౌళులు స్త్రీయోనిలోని మన్మథ చక్రాన్ని బిందువుగా భావించి పూజిస్తారు. అందుకే అది అవైదికము, నీతి బాహ్యము అని చెప్పబడింది.

కౌళులు పరమేశ్వరుణ్ణి నవాత్మకుడు లేదా నవవ్యూహాత్మకుడు అంటారు. ఈ నవవ్యూహాలను కామకలావిద్య లో ఈ విధంగా చెప్పబడింది.

శ్లో॥ కాలవ్యూహః కులవ్యూహో నామవ్యూహ స్తథైవచ
జ్ఞానవ్యూహ స్తథా చిత్తవ్యూహ స్స్యా త్తదనంతరమ్॥
నాదవ్యూహ స్తథా బిందు వ్యూహస్స్యా త్తదనంతరమ్
కలావ్యూహ స్తథా జీవవ్యూహస్స్యా దితి తే నవ॥

1. కాలవ్యూహము : నిమిషము మొదలు కల్పాంతము వరకు ఉన్న కాలము యొక్క సముదాయము
2. కులవ్యూహము : ఎరుపు, తెలుపు, నీలము మొదలైన రంగులను గురించి తెలిపేది.
3. నామవ్యూహము : ప్రపంచంలోని ప్రాణుల యొక్క పేర్లను తెలిపేది.
4.జ్ఞానవ్యూహము : ఇంద్రియాల ద్వారా ప్రపంచాన్ని గురించి తెలుసుకునే జ్ఞానము.
5.చిత్తవ్యూహము : అహంకారము, చిత్తము, బుద్ధి, మహత్తత్త్వము, మనస్సు అను అహంకార పంచకము గురించి తెలిపేది.
6.నాదవ్యూహము : రాగము, ఇచ్ఛ, కృతి, ప్రయత్నము, మాయశుద్ధవిద్య, మహేశ్వరుడు, సదాశివుడు, పరాపశ్యంతి, మధ్యమ, వైఖరి లను గురించి తెలిపేది.

7.బిందువ్యూహము : ఆధారాది షట్చక్రాలసంఘము
8. కళావ్యూహము : యాభై కళలై వర్ణ స్వరూపములైన అక్షరముల గురించి తెలిపేది.
9. జీవవ్యూహము : భోక్తలగు జీవుల సమూహము.

శ్లో॥ నవవ్యూహాత్మకోదేవః పరానంద పరాత్మకః
నవాత్మా భైరవోదేవో భుక్తి ముక్తి ప్రదాయకః
పరానంద పరాశక్తిః చిద్రూపాఽఽనందభైరవీ
తయోర్యదా సామరస్యం జగదుత్పద్యతే తదా॥

పరానందుడు, పరాత్మకుడు అను భైరవుడు నవవ్యూహాత్మకుడు. ఆయనే భక్తి, ముక్తి ప్రదాత. పరానందమైన పరాశక్తి చిద్రూప అయిన ఆనందభైరవి అవుతుంది. ఈ భైరవీభైరవులకు సామరస్యము ఎప్పుడు కలుగుతుందో అప్పుడు జగదుత్పత్తి జరుగుతుంది.

వామకేశ్వరతంత్రంలో చెప్పినట్లుగా

శ్లో॥ భుజంగాకార రూపేణ మూలాధారం సమాశ్రితా
శక్తిః కుండలినీ నామ బిసతంతు నిభాఽఽశుభా
శ్లో॥ మూలకందం ఫణాగ్రేణ దష్ట్వా కమలకందవత్
ముఖేన పుచ్ఛం సంగృహ్య బ్రహ్మరంధ్రం సమాశ్రితా॥

శ్లో॥ పద్మాసన గత స్వస్థో గుద మాకుంచ్యసాధకః
వాయుమూర్ధ్వగతిం కుర్వన్ కుంభకావిష్టమానసః॥

శ్లో॥ వాయ్వాఘాత వశా దగ్నిః స్వాధిష్ఠానగతో జ్వలన్
జ్వలనాఘాత పవనాఘాతై రున్నిద్రితోఽహిరాట్॥

శ్లో॥ రుద్రగ్రంథిం తతో భిత్త్వా విష్ణుగ్రంథిం భిన త్త్యతః
బ్రహ్మగ్రంథించ భిత్త్వైవ కమలాని భిన త్తి షట్॥

శ్లో॥ సహస్రకమలే శక్తిః శివేన సహమోదతే
సాచావస్థా పరా జ్ఞేయా సైవనిర్వృతి కారణమ్॥

సర్పాకారములతో భగవతి ఆధారచక్రంలో కుండిలినీ శక్తియై మెరుపు తీగెవలె ప్రకాశిస్తూ ఉంటుంది. సాధకుడు పద్మాసనంలో కూర్చొని, మడమను గుదస్థానంలో సంధించి శ్వాసను పైకి వదులుతూ ప్రాణాయామం చేయాలి. అప్పుడు స్వాధిష్టానంలో అగ్నిప్రజ్వరిల్లి కుండలినీశక్తి మేల్కొంటుంది. అంతట ఆ శక్తి బ్రహ్మగ్రంధి, విష్ణుగ్రంథి,రుద్రగ్రంథులను

భేదించుకుని సహస్రారం చేరి శివునితో సంతోషం పొందుతుంది. ఆస్థితిలో ఉన్నదేవియే పరాశక్తి. నిత్య సుఖకారిణి అంటే కుండలినీ ప్రబోధంకలిగితేనే దేవి సాక్షాత్కారం జరుగుతుంది.

కౌళులు నాలుగు దళాలుగల ఆధారచక్రాన్ని, ఆరు దళాలు కల స్వాధిష్టానంతో అంతర్భూతంచేసి పూజిస్తారు. ఈ రకంగా ఆధారస్వాధిష్టానాలను అనుసంధానం చెయ్యటం వలన వారికి షట్చక్రఅనుసంధానం చేసిన ఫలం కలుగుతుంది.

శ్లో॥ పాశాంకుశౌ తదీయౌతు రాగద్వేషాత్మకౌ స్మృతౌ
శబ్ద స్పర్శాదయో బాణాః మన స్తస్యాభవద్ధనుః॥
కరణేంద్రియచక్రస్థాం దేవీం సంవిత్స్వరూపిణీమ్
విశ్వాహంకార పుష్పేణ పూజయే త్సర్వసిద్ధిభాక్॥

సాధకుడు తన రాగద్వేషాలను దేవి పాశాంకుశాలుగా, తన మనస్సును దేవి ధనుస్సుగా పంచతన్మాత్రలు దేవి బాణాలుగా భావించి అహంకారమను పుష్పముచే దేవిని పూజించినట్లైతే అతడికి సర్వసిద్ధులు కలుగుతాయి.

2.మిశ్రమాచారులు : వీరు కౌళ,సమయాచారాలను కలిపి ఆచరిస్తూ ఉంటారు. వీరికి చంద్రకళ, జ్యోత్స్నావతి, కళానిధి, కులార్ణవ, కులేశ్వరి,భువనేశ్వరి, బార్హస్పత్య, దూర్వాసతంత్రాలు ప్రమాణాలు. ఈ ఆగమాలలో ధర్మ,కర్మ,ఉపాసనల వివరణ, కుండలినీ శక్తి వివరణ, సాధనామార్గాలు ఉన్నాయి.

3.సమయాచారులు : సమయ మతంలో ప్రధానమైనది కేవలం కైవల్య పారమార్థిక దృష్టి. కర్మకాండలవల్ల మోక్షము లభించదు అని వీరు నమ్ముతారు. జీవబ్రహ్మైక్యమే వీరి సిద్ధాంతము. వీరికి శుభాగపంచకము అని పిలువబడే సనక, సనందన, సనత్కుమార, వసిష్ఠ,శుకసంహితలు ప్రమాణాలు. సయమాచారులకు బాహ్యపూజలేదు. అంటే వారు శ్రీచక్రాన్ని వేరుగా పూజించరు. ఇదే విషయాన్ని సనత్కుమార సంహితలో ఈ విధంగా చెప్పేరు.

శ్లో॥ "బాహ్య పూజా న కర్తవ్యా కర్తవ్యా బాహ్య జాతిభిః
సా క్షుద్రఫలదా (క్షుద్రధర్మదా) నృణాం ఐహికార్థైక సాధనాత్॥"
బాహ్య పూజారతాః కౌలాః క్షపణాశ్చ కపాలికాః
దిగంబరాశ్చేతిహాసాః (వీతవాసాః) వామకా స్తంత్రవాదినః॥
అంతరారాధనపరా వైదికా బ్రహ్మవాదినః
జీవన్ముక్తా శ్చరం త్యేతే త్రిషు లోకేషు సర్వదా॥ ఇతి

ఉత్తమజాతుల వారికి బాహ్యపూజకర్తవ్యము కాదు. బాహ్యజాతులవారు మాత్రమే బాహ్యపూజ చెయ్యాలి. బాహ్యపూజ అనేది ఐహిక ప్రయోజనము సాధించుటకు ఉపయోగిస్తుంది. ఇది అల్పప్రయోజనకారి. కౌళులు, క్షపణికులు, కాపాలికులు, దిగంబరులు, ఇతిహాసులు, (జాలవిద్యారతులు) వామాచారులు, తంత్రవాదులు అందరూ బాహ్యపూజారతులు. బ్రహ్మవాదులైన వైదిక ఆచారపరులు అంతరారాధనాపరులు, వీరు జీవన్ముక్తులై మూడు లోకాల్లోనూ సదా సంచరిస్తూ ఉంటారు. మోక్షప్రాప్తికై నిర్గుణబ్రహ్మ ఉపాసనేకాక స్వర్గ వైకుంఠాది లోకప్రాప్తికై శ్రుతిస్మృతులచే బోధింపబడిన కర్మలు సమయులకు అనుసరణీయములు.చంద్రజ్ఞాన విద్యలో చెప్పినట్లుగా సమయాచారులు

"సూర్యమండలమధ్యస్థాం దేవీం త్రిపురసుందరీం
పాశాంకుశధనుర్బాణాన్ ధారయంతీం ప్రపూజయేత్॥

సూర్యమండలము మధ్యనున్న దేవి అగు త్రిపురసుందరిని, పాశము, అంకుశము, ధనుర్బాణములు ధరించిన దానిని పూజించాలి.

సమయాచారులలో ఒక తెగవారికి మాత్రం బాహ్యపూజవుంది. అంటేవారు విడిగా శ్రీచక్రాన్ని పూజిస్తారు. మూలమంత్రానికి అంతర్పూజలో ఋషి, ఛందస్సు అవసరం లేదు. కేవలం బాహ్యపూజలోనే అవి కావాలి.

సమయాచారులు శివశక్తులను సమయుడు, సమయ అంటారు. సమయ అంటే శివునితో ఐదురకాలుగా సామ్యము పొందిన శక్తి. అలాగే శివుడు కూడా శక్తితో ఐదు రకాలుగా సామ్యము పొందుతున్నాడు. ఈ రకంగా శివశక్తులకు సామ్యము ఉన్నది అని వీరి నమ్మకము. అందుకే వీరి ఆచారాన్ని సమయాచారము అంటారు.

సామ్యము అంటే పోలిక. శివశక్తులు ఐదు రకాలుగా ఒకే పోలిక కలిగి ఉంటారు. అవి:

1.అధిష్ఠానసామ్యము : శివశక్తులు ఇద్దరూ ఒకేస్థానాన్ని అధిష్టించి ఉండటం.

2.అనుష్ఠానసామ్యము : ఇద్దరూ ఒకే పనిలో నిమగ్నమై ఉండటము

3.అవస్థాసామ్యము : ఇద్దరూ ఒకే అవస్థలో నిమగ్నమై ఉండటము.

4.రూపసామ్యము : ఇద్దరూ ఒకే రూపంలో ఉండటము

5. నామసామ్యము : ఇద్దరి పేర్లూ ఒకే రకంగా ఉండటము

షట్చక్రాల్లోని ప్రతి చక్రంలోనూ వీరికి ఈ రకంగా సామ్యం చెప్పబడింది. ఆధారచక్రంలో

1. శివాశివులిద్దరికీ ఆధారచక్రమే అధిష్టానము. అందుచేత వీరిద్దరికీ అధిష్టాన సామ్యం

చెప్పబడింది.

2. ఇద్దరూ అక్కడ నాట్యం చేస్తూంటారు. ఇది అవస్థాసామ్యము.

3. ఇద్దరూ జగత్తును సృష్టించే కార్యక్రమంలో నిమగ్నమై ఉంటారు. ఇది అనుష్ఠానసామ్యము.

4. ఇద్దరూ ఎర్రని రంగులో ఉంటారు. ఇది రూపసామ్యము.

5. ఇద్దరికీ భైరవీ, భైరవుడు లేదా నవాత్మనవాత్మకుడు అనిపేరు. ఇది నామసామ్యము. ఈరకంగానే మిగిలిన ఐదు చక్రాల్లోనూ కూడా చెప్పబడింది.

సహస్రకమలమే బైందవస్థానం. దానిమధ్య ఉండే చంద్రమండలమే చతుష్కోణం. దాని మధ్యలో ఉండే బిందువులో శివశక్తులు కలసి సాదాఖ్యకళగా ఉంటారు.

సమయాచారుల దృష్టిలో చతుర్విధైక్య సంధానమే భగవతికి సమారాధన. చతుర్విధైక్య సంధానము అంటే శ్రుతి ఈ విధంగా చెబుతోంది.

పిండ బ్రహ్మాండయోరైక్యం లింగ సూత్రాత్మనోరపి
స్వాపావ్యాకృతయోరైక్యం క్షేత్రజ్ఞ పరమాత్మనోః॥

1. పిండబ్రహ్మాండములకు ఐక్యము
2. లింగసూత్రాలకు ఐక్యము
3. స్వాపావ్యాకృతులకు ఐక్యము
4. క్షేత్రజ్ఞ పరమాత్ములకు ఐక్యము

దీనినే చతుర్విధైక్యసంధానము అంటారు. చతుర్విధైక్యసంధానము చేసిన యోగి శివశక్తి భావన చేత తాదాత్మ్యము పొందుతాడు. ఈ విషయం కాదిమతంలో ఈ విధంగా చెప్పబడింది.

మూలాది బ్రహ్మరంధ్రాంతం స్ఫురిద్విద్యుల్లతాకృతిమ్।
ధ్యాయేత్కుండలినీం దేవీం త్రైవిద్యాక్షర రూపిణీమ్॥

షట్చక్రభేదినీం దేవీం తాంచ బిందుత్రయాత్మికామ్।
తాం చాప్యర్ధకలారూపాం చింతయేత్పద్మకాననే॥

ఏవం భావనయాజుష్టః పరమానందనిర్భరః
సంసార సాగరం ధీమాన్ గోష్పదీకురుతే శివే॥"

ఎవరైతే ఆధార చక్రమును నుండి బయలుదేరి సహస్రారము చేరి ఆదేవి సాక్షాత్కారం పొందగలుగుతాడో, అతడు సంసారసాగరాన్ని తేలికగా దాట కలుగుతాడు.

ఇదే విషయాన్ని సుభగోదయంలో

"మూలాది బ్రహ్మరంధ్రాంతం మూలవిద్యాం విభావయేత్
ఉద్యదాదిత్యసంకాశాం తటిత్కోటి సమప్రభామ్॥
తత్ప్రభా పటలవ్యాప్తం శరీరమపి చింతయేత్॥"

షట్చక్రాలయందు ఎవరైతే దేవిని ధ్యానిస్తాడో, అతనికి కోట్లకొలది సూర్యుల వెలుగుతో ప్రకాశిస్తున్న దేవి సాక్షాత్కరమౌతుంది.

గురుకటాక్ష మహిమవల్ల జనించిన మహావేధ కారణంగా భగవతి, సాధకుడి ఆధార,స్వాధిష్ఠాలను భేదించుకుని మణిపూరం చేరుతుంది. అక్కడ ఆమెకు అర్ఘ్యపాద్యాదులిచ్చి షోడశోపచార విధిని మానసికంగా పూజచెయ్యాలి. అపుడామె అనాహతానికి చేరుతుంది. అక్కడ ఆమెకు ధూప,దీప,నైవేద్య, హస్తప్రక్షాళనవరకూ సేవచెయ్యాలి. అప్పుడు దేవి విశుద్ధి చక్రంచేరి, సింహాసనా రూఢయై చెలులతో ముచ్చటిస్తూ ఉంటుంది. అక్కడ దేవిని విశుద్ధి చక్రంలోని పదహారు దళాలలోని చంద్రకళలతో పూజచెయ్యాలి. తరువాత ఆమెను ఆజ్ఞాచక్రంచేర్చి నీరాజనాదులచే సంతోషపెట్టాలి. తరువాత దేవి విద్యుల్లతవలె సహస్రారంలో ప్రవేశించి క్షీరసాగరంలోని మణిద్వీపంలో, కదంబవనంలోని చింతామణి గృహంలో సదాశివునితో కలిసి ఉంటుంది. అప్పుడు తెరను ప్రసరింపచేసి మరల దేవి మూలాధారం ప్రవేశించే వరకు సాధకుడు వేచి ఉండాలి. ఇది యోగసాధ్యము. సమయ మతరహస్యము.

సమయాచారులకు బాహ్యపూజలేదు. కాబట్టి హృదయమునందే ఆరాధింపబడిన భగవతి సాధకులకు ఐహిక ఫలం కూడా ఇస్తుంది.

"మాతృకాం వశినీయుక్తాం యోగినీభి స్సమన్వితామ్
గంధాద్యాకర్షిణీయుక్తాం సంస్మరేత్త్రిపురాంబికామ్"

వశిన్యాది శక్తి యుక్తము, యోగినీ గణసమన్వితము, గంధాకర్షిణీ సహితము, మాతృరూపము అయిన త్రిపురాంబికను ధ్యానిస్తే విద్యాప్రాభవం కలుగుతుంది. దేవిని ఎర్రని కాంతి కలదిగా పూజిస్తే స్త్రీలోకం వశమౌతుంది. లఘుస్తవములో చెప్పినట్లుగా

"వామే పుస్తకధారిణీ మభయదాం సాక్షస్రజం దక్షిణే
భక్తేభ్యో వరదాన పేశలకరాం కర్పూరకుందోజ్జ్వలామ్।
ఉజ్జృంభాంబుజపత్రకాంతి నయన స్నిగ్ధప్రభాలోకినీం
యేత్వామంబ న శీలయంతి మనసా తేషాం కవిత్వం కుతః॥"

చేతులయందు పుస్తకము, అక్షరమాల,అభయవరదముద్రలు ధరించి కర్పూరము మరియు మల్లెపూవువలె ప్రకాశించు ఆ దేవిని ధ్యానించినట్లయితే కవిత్వము సిద్ధిస్తుంది. అంబాస్తవంలో చెప్పినట్లుగా

"యః స్ఫటికాక్షగుణ పుస్తక కుండికాఢ్యాం
వ్యాఖ్యా సముద్యతకరాం శరదిందుశుభ్రామ్।
పద్మాసనాం చ హృదయే భవతీముపాస్తే
మాతః స విశ్వకవితాం కిం చక్రవర్తీ॥"

చేతులయందు అక్షమాల, పుస్తకము, కమండలము ధరించి, పద్మాసనాసీనయ్యి, శరత్కాలచంద్రబింబమువలె ప్రకాశించు దేవిని ఎవరైతే ధ్యానిస్తారో ఆతనికి ప్రపంచాన్ని సమ్మోహనంచేసే కవిత్వం సిద్ధిస్తుంది.ఇదే విషయాన్ని మార్కండేయుల వారు

"స్తుతా సంపూజితా పుష్పై ర్ధూపగంధాదిభి స్తథా।
దదాతి విత్తం పుత్రాంశ్చ మతిం ధర్మే తథా శుభమ్॥"

"సా చింతితా చ విజ్ఞానం తుష్టా బుద్ధిం ప్రయచ్ఛతి"

"ఆరాధితాసైవ నృణాం భోగస్వర్గాప వర్గదా"

"శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణా॥
సర్వస్యార్తి హరే దేవి నారాయణి నమోస్తుతే."

భక్తిచేత నమస్కరించినంత మాత్రము చేతనే దేవి మనకు శుభాలు కలుగచేస్తుంది. సౌభాగ్యము, శుభగత్వము, సారూప్యసౌశీల్యాదికము ఆ దేవిని కీర్తించినందువల్లనే కలుగుతాయి. పశు,పుత్ర, ధనలాభము దారిద్ర్యనాశనము, అభీష్టసిద్ధికలుగుతాయి.

ఈ విధంగా సమయులకు అంతర్ పూజయే ఐహిక ఆముష్మిక ఫలములు కూడా ఇస్తుంది.

4.వామాచారము: వీరికి వామకేశ్వర తంత్రం ప్రమాణ గ్రంథం. క్షీరసాగరమథనంలో పుట్టిన మద్యంతాగిన అసురలది వామమార్గం, అమృతాన్ని తాగిన దేవతలది సమయ

మార్గంగా చెప్పబడ్డాయి. వామాచారులు ఇంద్రియతృప్తిచే ఆనందాన్ని అనుభవించటానికి ఇష్టపడతారు. మనస్సు, శరీరము వేటితో తృప్తిపొందుతామో, అట్టి వాటిచేతనే దేవి కటాక్షిస్తుంది అని వీరి నమ్మకము. వీరు పంచమకార పూజలు చేస్తారు. పశు. నర బలులు ఇస్తారు. వివస్త్ర అయిన కన్యను. కులకాంతను. అందమైన వేశ్యను దేవి స్థానంలో కూర్చోపెట్టి, మద్యం పూర్తిగా సేవించి ఆ స్త్రీతో సంభోగం చేస్తారు. ఇదే దేవిని తృప్తి పరచటానికి సులభమైన మార్గం అని వీరితలంపు. బెంగాలు, బీహారు. మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో వీరు విస్తృతంగా ఉన్నారు

మేరుతంత్రం వామాచారాన్ని పూర్తిగా ఖండిస్తోంది. వామమార్గం వలన సర్వనాశనం కలుగుతుంది. అజ్ఞానులు, ఆటవికులు ఈ మార్గాన్ని అనుసరిస్తారు. ఇంద్రియతృప్తి చేత ఆనందాన్ని అనుభవించే వామాచారులు భ్రష్టులవుతారు అని చెప్పబడింది. దేవిపూజలో వైదికపూజ శ్రేష్ఠము, స్మార్తపూజ ఉత్తమము, పౌరాణికపూజ మధ్యమము, తాంత్రికపూజ అధమము అని చెప్పబడింది.

సాధకులు పూజలో, ఈ రకమైన మకార పంచకాన్ని ఉపయోగించకూడదు. ఇది అవైదికము, నీతిబాహ్యము. మద్యపానం చెయ్యటంవల్లనే సాధకుడికి ముక్తికలిగితే, దేశంలోని తాగుబోతులందరికీ ఎప్పుడో ముక్తికలగాలి. మాంసభక్షణ చెయ్యటంవల్లనే జన్మరాహిత్యం కలిగితే క్రూరమృగాలకు ఎప్పడో జన్మరాహిత్యం కలిగి ఉండాలి కదా! అసలు మకారపంచకము అంటే తంత్రాశాస్త్రాలలో ఈ విధంగా చెప్పబడింది.

మద్యం, మాంసం, తథా మత్స్యం ముద్రా, మైథునమే వచ
శక్తిపూజా విధానాద్యై పంచతత్త్వ ప్రకీర్తితం

ఈ మకార పంచకానికి అర్థాలు వేరుగా, గోప్యంగా ఉన్నాయి. కానివాడుకలో మాత్రం అపార్థాలు కలుగుతున్నాయి. మానవులు అజ్ఞానులవటం వలన బాహ్యార్థము గ్రహించి జుగుప్సాకరము, హింసాత్మకమైన ప్రక్రియలవలన భ్రష్టులవుతున్నారని చెప్పబడుతోంది. మకార పంచకమునకు అర్థము శక్తి సంగమతంత్రము లో ఈ విధంగా చెప్పబడింది.

'గుడార్ద్రకరసోదేవి ముద్రతా ప్రథమా మతా
పిణ్యాకం లవణం దేవి ద్వితీయా పరికీర్తితా
లశునం తిత్రిడీ చైవ తృతీయా పరికీర్తితా

సూర్యమండల సంకాశా చంద్రమండల సన్నిభా
గోధూ మమాష సంభూతా సుందరీవ చతుర్థికా
శక్త్యాలాపః పంచమీస్యా త్సంచ ముద్రా ప్రకీర్తితా॥

దీనిప్రకారము
బెల్లపుపానకము మద్యము, తెలగపిండి, లవణము, గారెలు - మాంసము
వెల్లుల్లి, తిత్తిడి పదార్థములు -మత్స్యము
గోధుమలు, మినుములచే చేయబడిన పదార్థములు -ముద్ర
భక్ష్య భోజ్యముల కలయికయే - మైధునము
ప్రస్తుతము ఎక్కువగా వాడుకలో ఉన్న ఆచారము ఇదే.
మహానిర్వాణతంత్రంలో మకార పంచకాన్ని విపులీకరించటం జరిగింది.

నమద్యం మాధవీ మద్యం, మద్యం శశికిరణ రసోద్భవం
కర్మాకర్మ పశూన్హత్వా జ్ఞానఖడ్గేన చేశ్వరీ
మనోమీనం తృతీయేచ హత్వా సంకల్ప వాసనాం
భక్ష్యభోజ్యాన్నం భక్ష్యమింద్రియ నిగ్రహ: తాం చతుర్థాం విజానీయాత్
హంసః సోహం శివః శక్తిశ్చైవ ఆనందనిర్మలః పంచమీంతాం విజానీయాత్

చంద్రబింబము నుండి జాలువారు అమృతరసమే మద్యము అంతేకాని మాధవీలత నుండి తీసినదికాదు. కర్మాకర్మాలను పశువులను జ్ఞానఖడ్గముచే భేదించుటయే మాంసము. మనస్సే మత్స్యము. దాని వాసనాచయమునర్పించుటే మత్స్యము నర్పించుట. ఇంద్రియ నిగ్రహమే భక్ష్యభోజ్యములు. ఇదియే ముద్ర. హంసః సోహం అను మంత్రార్థములయిన శివశక్తుల కలయికయే మైధునము.

అహింసా ప్రథమపుష్పం పుష్పమింద్రియ నిగ్రహ:
దయాక్షమాజ్ఞాన పుష్పం పంచపుష్పం తత: పరం

సాధకుడు అహింస, ఇంద్రియ నిగ్రహము, దయ, క్షమ, జ్ఞానములే పంచపుష్పములు అని గ్రహించాలి.

కాబట్టి సాధకుడు శాస్త్రానికి అసలు అర్థాన్ని గ్రహించి దేవి కృపకు పాత్రులగుదురు గాక..

# షట్చక్రభేదనము

సృష్టిలో జన్మించిన ప్రతి ప్రాణి మరణించకతప్పదు. అలాగే మరణించిన ప్రతిప్రాణి, మళ్ళీ ఇంకోరూపంలో జన్మిస్తూనే ఉంటుంది. ఈ నమ్మకం భారతీయులకేకాదు ప్రపంచంలోని చాలారకాల మతస్తులుకూడా దీన్ని విశ్వశిస్తారు. జన్మ లన్నింటిలోకీ అత్యుత్తమమైనది మానవజన్మ. కాబట్టి, మానవజన్మ ఎత్తిన ప్రతివారూకూడా తమ జన్మను సార్థకం చేసుకుని, మళ్ళీ మళ్ళీ జన్మించకుండా ఉండటంకోసం ప్రయత్నించాలి. అంటే జీవాత్మను పరమాత్మలో విలీనం చెయ్యటానికి ప్రయత్నించాలి. దానికి మార్గమే షట్చక్రభేదన. దేవీ పూజావిధానంలో ఈ షట్చక్రభేదన చాలా ముఖ్యమైనది.

మానవ దేహంలో జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు ఉన్నట్లే షట్చక్రాలు కూడా ఉన్నాయని పతంజలిమహర్షి వ్రాసిన యోగశాస్త్రం చెబుతోంది. పంచభూతాల తత్త్వము, పంచ తన్మాత్రల రూపము కూడా వీటిలో ఇమిడిఉన్నాయి. ఇవి మానవశరీరంలో ఎక్కడ ఉన్నాయో ఈ క్రింది శ్లోకం లో వివరించబడింది.

శ్లో॥ మహీం మూలాధారే కమపి మణిపూరే హుతవహం
స్థితం స్వాధిష్ఠానే హృది మరుత మాకాశ ముపరి
మనోఽపి భ్రూమధ్యే సకలమపి భిత్త్వా కులపథం
సహస్రారే పద్మే నహ రహసి పత్యా విహరసే॥

1\. మూలాధార చక్రము :- షట్చక్రాల్లో మొట్టమొదటి చక్రాన్ని మూలధార చక్రము అంటారు. 'మూల' అంటె గుదస్తానం . ఇది సర్వాధార భూతమైన చక్రము. ఇది గనక లేకపోతే శరీరం పైకి ఎగిరి పోవటం కాని, క్రిందికి పడిపోవటం కాని జరుగుతుంది. ఇది పృథివీ తత్త్వాత్మకమైన స్తానము. నాలుగు దళాలతో కూడిన పద్మము ఇక్కడ ఉంటుంది. ఈ చక్రంలో కుండలనీశక్తి

తోకను నోటితో కరచి పట్టుకున్న సర్పాకారరూపంలో నిద్రావస్థలో ఉంటుంది.

యోగినీ న్యాసంలో షట్చక్రాలు, వాటిని అధిష్టించిన యోగినుల వివరాలు చెప్పబడ్డాయి. లలితా సహస్రంలో కూడా ఈ విషయం చెప్పబడింది.

మూలాధారాంబుజారూఢా పంచవక్త్రాస్థిసంస్థితా,
అంకుశాది ప్రహరణా వరదాదినిషేవితా.
ముద్గౌదనాసక్తచిత్తా సాకిన్యంబాస్వరూపిణీ.

'కామకల విలాసం'లో ఈ విధంగా ఉంది.

మూలాధారస్థపద్మే శృతిదళ లసితే పంచ వక్త్రాంత్రినేత్రాం.
ధూమ్రాభావస్థిసంస్తాం సృతిమపికమలం పుస్తక జ్ఞానముద్రాం
బిభ్రాణాం బాహుదండై స్సులలిత వరదాం పుర్వ శక్త్యావృతాంతాం
ముద్గన్నాసక్తచిత్తాం మధు మద ముదితాం సాకినీం భావయామః ॥

మూలాధార చక్రంలో ఐదుముఖములు, మూడుకనులు కలిగి, ధూమ్రవర్ణయై ఎముకలయందు ఉండునది, అంకుశము, కమలము, పుస్తకము, జ్ఞానముద్రలను చేతులందు ధరించినది, వ,శ,ష,స అక్షరములతో ప్రారంభించు వరద, సరస్వతి మొదలైన పేర్లుకలశక్తులచే పరివేష్టించబడినది, పెసరపప్పుతోచేసిన అన్నము (పులగము) నందు ఆసక్తి కలది, అయన సాకిని అనుపేరు కల యోగినఉన్నది. మూలాధారంలో ఉండే శివాశివులను 'సౌందర్యలహరి" లో శంకరభగవత్పాదులవారు ఈ విధంగా చెప్పారు.

శ్లో॥ తవాధారే మూలే సహ సమయయా లాస్యపరయా
నవాత్మానం మన్యే నవరసమహాతాణ్డవనటమ్,
ఉభాభ్యామేతాభ్యా ముదయవిధి ముద్దిశ్య దయయా
సనాథాభ్యాం జజ్ఞే జనకజననీమ జ్జగ దిదమ్.

మూలాధారచక్రంలో శివాశివులకు భైరవీ భైరవులని లేదా నవాత్మ నవాత్మకుడుఅని పేరు. వీరిరువురూ ఎర్రని రంగుతో ప్రకాశిస్తూ శృంగారముతో కూడిన నాట్యాము చేస్తూ జగత్తును సృష్టించే కార్యక్రమంలో నిమగ్నమై ఉంటారు.

అధార చక్రమే త్రికోణము. అందులో బిందువున్నదని ప్రసిద్ధి. కౌళమతాన్ననుసరించి త్రికోణమే బిందుస్తానము. అందు అరాదింపతగినది కూడా బిందువే. అందుకనే కౌళాచారులు

ఎప్పుడూ త్రికోణాన్నే పూజిస్తారు. ఆధార చక్రంలో ఉండే కుండలనీ శక్తిని "కౌళిని" అంటారు. త్రికోణ పూజకు కౌళినియే ఉపాశ్య. కుండలనీ శక్తి సదానిద్రావస్తల్లో ఉంటుంది. అందుకే ఆ పూజను "తామిశ్రకము" అంటారు. ఎప్పుడైతే కుండలనీ ప్రబోధము కలుగుతుందో అక్షణమునందే ఉపాసకునికి ముక్తికలుగుతుంది. 'సూతసంహిత'లో చెప్పినట్లుగా

"యథామాతా పితృభ్యాం తు వర్ధతే మానవా భువి ।
తథైతాభ్యామిదం కృత్స్నం వర్ధతే నాత్ర సంశయః॥"

జగదుత్పత్తి హేతువైన లాశ్యతాండవ పరాయణత్వం వలన శివాశివులకు పితృభావము ప్రాప్తించుచున్నది.

"ఆధారవాతరోధేన శరీరం కంపతేయదా।
ఆధారవాతరోధేన యోగీ నృత్యతి సర్వదా॥
ఆధారవాతరోధేన విశ్వం తత్రైవదృశ్యతే।
సృష్టిరాధారమాధారే ఆధారే సర్వదేవతాః।
ఆధారే సర్వవేదాశ్చతస్మా దాధార మాశ్రయేత్॥" (యో॥శి)

ఆధార చక్రము ప్రాణ నిరోధకము కాగా యోగి నృత్యము చేయుట ప్రారంభించును. ఆధార చక్రమునందె విశ్వము గోచరిస్తుంది. సృష్టికి ఆధార మైనది ఆధారచక్రమే. ఇదే సర్వవేదాలకూ, సర్వదేవతలకూ ఉనికి పట్టు. లలితాసహస్రనామావళిలో

కులాంగనా కులాంతస్థా కౌలినీ కులయోగినీ।
అకులా సమయా న్తస్థా సమయాచారతత్పరా।

అని చెప్పబడింది. దేవిని కౌళాచారము సమయాచారము అని రెండు పద్ధతులుగానూ ఉపాశిపస్తారు. ఈ రెండు పద్ధతులు కూడా ఆమెకు ప్రీతి పాత్రమైనవే.

అర్చనం ద్వివిధం చైవ వామ దక్షిణభేదతః
వామేనవా దక్షిణేన పూజనంతు యథారుచిః

దేవీ అర్చన వామాచారము, దక్షిణాచారము అని రెండు రకాలు గా చేస్తారు.

దక్షిణాచారమోగేన సిద్ధ్యత్యేవ నసంశయః
వామేదారే ణాపి తథా సిద్ధ్యతేవ మహేశ్వరి॥

అని శక్తి సంగమ తంత్రంలో చెప్పబడింది.

ఈ అచారాలను 'దేవీపూజ - అచారాలు 'అనే శీర్షికలో వివరించటం జరిగింది.

చతుర్విధ పుషార్థాలూ సాధించటానికి ఉపాసనామార్గం చెప్పబడింది. వీటిలో అర్థ కామాల కోసం కౌళాచార పద్ధతిలోనూ, మోక్షప్రాప్తికి సమయాచారపద్ధతిలోనూ దేవిని ఉపాశిస్తారు. కౌళులు ఆధారచక్రంలో దేవిని ఉపాసిస్తే సమయులు మణిపూరం దగ్గర నుండి ఉపాసన చేస్తారు.

సమయాచారుల ప్రకారం శివశక్తులు ఐదు రకాలు గా సామ్యం పొంది ఉంటారు. అవి

1. అధిష్టాన సామ్యము
2. అనుష్టాన సామ్యము
3. అవస్తాసామ్యము
4. రూపసామ్యము
5. నామసామ్యము

షట్చక్రాలలోని ప్రతిచక్రంలోనూ వీరికి ఈ ఐదురకాల సామ్యం ఉంటుంది..

ఆధార చక్రంలో

1. శివాశివు లిద్దరూ ఆధార చక్రంలోనే ఉంటారు. కాబట్టి అదిష్టాన సామ్యము
2. ఇరువురు జగత్తును సృష్టించే కార్యక్రమంలో నిమగ్నమై ఉంటారు కాబట్టి అనుష్టానసామ్యము
3. ఇరువురూ లాస్యతాండవం చేస్తుంటారు కాబట్టి అవస్థా సామ్యము.
4. ఇరువురూ అరుణఛాయలో ఉంటారు కాబట్టి రూపసామ్యము.
5. వీరిరువురకూ భైరవీభైరవులని లేదా నమత్మ నవాత్మకుడు అనీ పేర్లు కాబట్టి నామసామ్యము చెప్పబడ్డాయి.

"జపాకుసుమసంకాసా మధుఘూర్ణిత లోచనౌ
జగత ః పితరౌవందే భైరవీ భైరవాత్మకౌ'

దాసానిపువ్వువలె ఎరుపురంగు కలవారు, పానమువలన మత్తు కలిగి తిరుగుచున్న నేత్రములు కలవారు., జగత్తునకు జననీ జనకులగు భైరవీ భైరవులకు నమస్కారము.

2. స్వాధిష్ఠానము :

మూలాధారానికి కొద్దిగా పైభాగన ఆరు దళాలతో ఉండే పద్మాన్ని 'స్వాధిష్ఠానము' అంటారు. ఇది అగ్ని తత్త్వాత్మకమైన చక్రము. దీన్ని గురించి లలితాసహస్రనామావళిలో

స్వాధిష్ఠానాంబుజగతా చతుర్వక్త్రమనోహరా,
శూలాద్యాయుధసంపన్నా పీతవర్ణాతిగర్వితా.

మేదోనిష్ఠా మధుప్రీతా బందిన్యాదిసమన్వితా,
దధ్యన్నాసక్తహృదయా కాకినీరూపధారిణీ.

'కామకలావిలాసం' లో ఈ విధంగా ఉంది.

"స్వాధిష్ఠానాఖ్యపద్మే రసదళలసితే వేదవక్త్రాం త్రినేత్రాం
హస్తాభ్యాం ధారయంతీం త్రిశిఖ గుణ కలాపాభయా న్యాత్తగర్వాం
మేధోధాతు ప్రవిష్టా మణిమద ముదితాం బంధినీముఖ్యయుక్తాం
పీతాం దధ్యోదనేష్టా అభిమతఫలదాం కాకినీం భావయామి"

ఇది ఆరుదళములుగల పద్మము. దీనిలో నాలుగు ముఖములతో మనోజ్ఞమైనది, మూడుకనులుకలది, చేతులందు త్రిశూలము, పాశము, కపాలము అభయముద్ర ధరించినది, పసుపువర్ణముతో ప్రకాశించునది, మిక్కిలి సౌందర్యము చేత గర్వము కలది. మేదస్సు అను నుధాతువునందు ఉండునది, మధ్యముచేత సంతసించునది, బంధినీ మొదలైన ఆరుశక్తులచే పరివేష్టింపబడినది, పెరుగుఅన్నముమీద ఆసక్తి కలది. అయిన కాకిని అను పేరుకలయోగిని ఉన్నది. స్వాధిష్టానంలో ఉండే శివాశివులను గురించి సౌందర్యలహరి లో ఈ విధంగా ఉంది.

శ్లో॥ తవ స్వాధిష్ఠానే హుతవహమధిష్ఠాయ నిరతం
తమీడే సంవర్తం జనని మహతీం తాంచ సమయామ్।
యదాలోకే లోకాన్ దహతి మహతి క్రోధకలితే
దయార్ద్రా యా దృష్టి శ్శిశిర ముపచారం రచయితి॥

స్వాధిష్ఠానము అగ్నిస్థానము. ఇక్కడ ఉండే అగ్నిని సంవర్తాగ్ని అంటారు. ఇక్కడ శివుడు సంవర్తాగ్నియై లోకాలను దహించి వేస్తూ ఉంటె దేవి తనకరుణాదృక్కులచే

ఆలోకాలను శమింపచేస్తూ ఉంటుంది. ఈ చక్రంలో

1. శివాశివులిద్దరూ స్వాధిష్ఠానంలో ఉంటారు కాబట్టి అధిష్ఠాన సామ్యము
2. లోకాలను దహిస్తున్నారనుట అనుష్ఠాన సామ్యము
3. మహాసంవర్తాగ్ని జ్వాలాశక్తిరూపంలో ఉన్నారనుట అవస్థాసామ్యము.
4. మహాసంవర్తాగ్నులు అనటం చేత రూప నామ సామ్యాలు చెప్పబడ్డాయి.

3. మణిపూరకము :

నాభిస్థానంలో పది దళాలతో ప్రకాశించే పద్మాన్ని మణిపూరము అంటారు. ఇది జలతత్త్వము గలచక్రము. ఇందులో ఆధార, స్వాధిష్ఠాన చక్రాలకు ప్రతి రూపంగా పది దళాలు ఉంటాయి. దీన్ని గురించి లలితా సహస్రం లో ఈవిధంగా ఉంది.

మణిపూరాబ్జనిలయా వదనత్రయసంయుతా,
వజ్రాదికాయుధోపేతా డామర్యాదిభిరావృతా.
రక్తవర్ణా మాంసనిష్ఠా గుడాన్నప్రీతమానసా,
సమస్తభక్తసుఖదా లాకిన్యంబాస్వరూపిణీ.

'కామకలాప విలాసం' లో ఈ విధంగా ఉంది.

"దిగ్పత్రే నాభిపద్మే త్రివదన విలసత్ దంష్ట్రిణీం రక్తవర్ణాం
శక్తిందంభోళి దండా భయ మపి ముగ్నుజైః ధారయంతీం మహోగ్రాం
డామర్యాద్యైపరీతాం పశుజన భయదాం మాంసధాత్వైకనిష్ఠాం
గౌడాన్నాసక్తచిత్తాం సకల సుఖకరీంలాకినీం భావయామః

ఈ చక్రంలో మూడు ముఖములు, కోరలు కలది, రక్తమువలె ఎర్రని రంగుతో ప్రకాశించునది, చేతులందు వజ్రము, శక్తి, దండము, అభయముద్ర ధరించినది. మాంసము మీద మక్కువ కలది. , బెల్లముతో కలిపి వండిన అన్నము మీద ప్రీతి కలది, డామరి మొదలైన పది శక్తులచేత పరివేష్టింపబడి అందరికీ సుఖము కలిగించునది అయిన లాకిని అను పేరుగల మోగిని ఉంటుంది. ఈ చక్రంలో ఉండే శివాశివుల గురించి సౌందర్యలహరిలో ఈ విధంగా ఉంది.

శ్లో॥ తటిత్త్వంతం శక్త్యా తిమిరపరిపన్థిస్ఫురణయా
స్ఫురన్నానారత్నాభరణపరిణద్ధేన్ద్రధనుషమ్,
తవ శ్యామం మేఘం కమపి మణిపూరైకశరణం
నిషేవే వర్షన్తం హరమిహిరతప్తం త్రిభువనమ్.

స్వాధిష్ఠానంలో మహాసంవర్తాగ్నివల్ల దహనమైనలోకాలను శివాశివులు తమ అమృతధారల తో తడుపుతూ ఉంటారు. ఇక్కడ శివుడు మేఘరూపంలోనూ, దేవి సౌదామిని రూపంలోనూ ఉంటారు. ~~ఈ చక్రంలో~~ మణిపూర చక్రంలో

1. శివాశివులిద్దరూ మణిపూరంలో ఉండటంచేత అధిష్ఠాన సామ్యము.
2. స్ఫురన్నానారత్నాభరణ పరిణద్ధేంద్రు ధనుషమ్ అనుటచే అనుష్ఠాన సామ్యము.
3. కారు మేఘాలవలె ఉన్నారనుట చేత అవస్థాసామ్యము.
4. మేఘము విద్యుల్లత అనేది రూపసామ్యము.
5. తటిత్వంతుడు, తటిత్వతి అని వీరిపేర్లు కాబట్టి నామసామ్యము చెప్పబడ్డాయి.

4. అనాహతము :-

హృదయస్థానంలో పన్నెండు దళాలతో విలసిల్లే వాయుతత్త్వాత్మకమైన చక్రాన్ని అనాహతచక్రము అంటారు. దీనిలో మణిపూరానికి ప్రతీకగా పది, విశుద్ధి, ఆజ్ఞాచక్రాలకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం పన్నెండు దళాలు ఉంటాయి. దీన్ని గురించి లలితా సహస్రనామావళిలో ఈ విధంగాచెప్పబడింది.

అనాహతాబ్జనిలయా శ్యామాభా వదనద్వయా
దంష్ట్రోజ్జ్వలాక్షమాలాదిధరా రుధిరసంస్థితా.
కాళరాత్ర్యాదిశక్త్యౌఘవృతా స్నిగ్ధౌదనప్రియా,
మహావీరేంద్రవరదా రాకిన్యంబాస్వరూపిణీ.

'కామకల విలాసం'లో ఈ విధంగా చెప్పబడింది.

హృత్పద్మే భాను పత్రే ద్వివదన లసితాం దంష్ట్రిణీం శ్యామవర్ణాం
చక్రం శూలం కపాలం డమరుమపి భుజైర్ధారయంతీం త్రినేత్రాం
రక్తస్థాం కాళరాత్రిప్రభృతి పరివృత్తాం స్నిగ్ధభుక్తైక సక్తాం
శ్రీమద్వీరేంద్ర వంద్యాభిమత ఫలదాంరాకినీం భావయామః

అనహత చక్రంలో రెండు ముఖములు, మూడు కనులు, కోరలు కలిగి, నల్లని రంగుతో చేతులమందు అక్షమాల, శూలము, కపాలము, డమరుకములను ధరించినది, రక్తమునందు ఉండునది నేతితో కలిపిన అన్నమునందు ప్రీతికలది, కాళరాత్రి మొదలగు పన్నెండు మంది శక్తులచే అవరింపబడినది, మహాపండితులచే నమస్కరింపబడునది అయిన రాకిని అను పేరుకల యోగిని ఉన్నది. ఇక్కడ ఉండే శివాశివులను గురించి సౌందర్యలహరిలో ఈ విధంగా చెప్పబడింది.

శ్లో॥ సమున్మీల త్సంవి త్కమలమకరన్దైకరసికం
భజే హంసద్వన్ద్వం కిమపి మహతాం మానసచరమ్,
యదాలాపా దష్టాదశగుణితవిద్యాపరిణతిః
యదాదత్తే దోషా ద్గుణ మఖిల మద్భ్యః పయఇవ॥

అనాహతంలో శివశక్తులు రాజహంసల రూపంలో ఉంటారు. ఉపాసకులు ఆహంసమిధునాన్నే ఆరాధిస్తారు. ఇది సమయాచారులందు ఒక శాఖవారి అభిప్రాయము. అయితే కొంతమంది అభిప్రాయము ప్రకారము అనాహతంలో పరమేశ్వరుడు అగ్నిజ్వాలా రూపుడై, జ్వాలారూపిణి అయిన శక్తితో కలసి దీపాంకురము వలె ప్రకాశిస్తుంటాడు. ఈ అభిప్రాయాన్ని సుభగోదమ వ్యాఖ్యలో భగవత్పాదుల వారు ఈ విధంగా చెప్పారు.

"శిఖి జ్వాలారూపః సమయ ఇహ పై వాత్ర సమయా।
తయో సంభేదో మే దిశతు హృదయాబ్జైక నిలయః॥"

అనుహతచక్రంలో అగ్ని జ్వాలారూపుడైన పరమేశ్వరుడు సమయుడు. జ్వాలారూపిణి అయిన పరమేశ్వరి సమయ ఈసమ్మేళనము నాహృదయ పద్మమందు నిలిచి సదానన్ను అనుగ్రహించుగాక లక్ష్మీధరుడు కుడా ఇదేభావాన్ని సమర్థించటం జరిగింది. ఈ చక్రంలో శివాశివులకు

1. అధిష్ఠానము అనాహత మందిరము
2. వాయుతత్త్వమును త్వాందించుట అనేది అనుష్ఠాన సామ్యము
3. గాలిలేని దీపముగా చెప్పటం వల్ల అవస్థాసామ్యము
4. అగ్ని కణిక అని చెప్పటంవల్ల రూపనామ సామ్యాలు చెప్పబడ్డాయి.

5. విశుద్ధి చక్రం :-

కంఠస్థానంలో పదహారు దళాలతో ప్రకాశించే చక్రాన్ని విశుద్ధ చక్రము అంటారు. ఇది ఆకాశతత్త్వాత్మకమైనది. ఇందులో అనాహతానికి సంబంధించిన పన్నెండు, ఆధారసుక్రానికి సంబంధించిన నాలుగు మొత్తం పదహారు దళాలుంటాయి. దీనిని గురించి లలితా సహస్రనామావళిలో ఈ విధంగా ఉంది.

విశుద్ధిచక్రనిలయాఽఽరక్తవర్ణా త్రిలోచనా,
ఖట్వాంగాదిప్రహరణా వదనైకసమన్వితా.
పాయసాన్నప్రియా త్వక్స్థా పశులోకభయంకరీ
అమృతాదిమహాశక్తిసంవృతా డాకినీశ్వరీ.

'కామ కలావిలాసం' లో ఈ విధంగా చెప్పబడింది

గ్రీవాకూపే విశుద్ధౌ నృపదళకమలే శ్వేతవర్ణాం త్రినేత్రాం
హస్తైః ఖట్వాంగఖడ్గౌ త్రిశిఖ మపి మహాచర్మసంధారయంతీం
వక్త్రేణైకేనయుక్తాం పశుజన భయదాం పాయసాన్నైక సక్తాం
త్వక్స్థాంవందే మృతాద్యైః పరివృతవపుషాం డాకినీంవీరవంద్యాం

దీనిలో ఒకే ముఖము, మూడు కనులు, చేతులయందు కర్రకుగుచ్చబడిన మానవుని పుర్రె (ఆయుధము) ఖడ్గము, త్రిసూలము, చర్మము ధరించినది, ఎర్రని రంగుకలది, పాయసాన్నము నందు ప్రీతికలది, పశుప్రాయులైన అజ్ఞానులకు భీతి కలుగు చేయుచూ అమృత, ఆకర్షిణి, ఇంద్రాణి మొదలగు పదహారు శక్తులతో పరివృత అయిన 'డాకిని' అను పేరుకల యోగిని ఉన్నది. ఇక్కడ ఉండే శివాశివులను గురించి సౌందర్యలహరిలో ఈ విధంగా చెప్పారు.

శ్లో॥ విశుద్ధౌ తే శుద్ధస్ఫటికవిశదం వ్యోమజనకం
శివం సేవే దేవీమపి శివసమానవ్యవసితామ్,
యయోః కాన్త్యా యాన్త్యా శ్శశికిరణసారూప్యసరణే
ర్విధూతా న్తర్ధ్వాన్తా విలసతి చకోరీవ జగతీ॥

విశుద్ధి చక్రంలో స్ఫటికమువలె స్వచ్ఛమైన వాడు, ఆకాశతత్త్వాత్మకుడు అయిన శివుడు, అతనితో సమానమైన దేవి ఉంటారు. అంటే ఇక్కడ శివాశివులు సుద్ధస్ఫటికావలె

ప్రకాశిస్తూ ఉంటారు. విశుద్ధి చక్రపూజలో ప్రాణాయామం చెయ్యటం వల్ల కాంతిని కోల్పోయిన షోడశకళలకు శివాశివుల శరీరము నుండి బయటకు వచ్చిన కాంతిచే మరల ప్రకాశము కలుగుతున్నది. అంటే సాధకునికి అజ్ఞానము పోగొట్ట బడుతున్నది.

ఈ చక్రంలో శివాశివులకు

1. అధిష్టానము విశుద్ధి మందిరము
2. ఇద్దరూ ఆకాశ తత్త్వమునుత్పాదించు చున్నారు. వ్యోమజనకం అనుటచే అనుష్ఠాన సామ్యము.
3. చంద్రకిరణములతో సమానమైన కాంతి కలవారు అనుటచే అవస్థా సామ్యము
4. శుద్ధ స్ఫటికమువలె అనుటచే రూపసామ్యము
5. శివంసేవే అనుటచే నామసామ్యము చెప్పబడినాయి.

6.అజ్ఞా చక్రం :-

కనుబొమల మధ్య రెండు దళాలతో ఉండే చక్రాన్ని అజ్ఞాచక్రం అంటారు. దీనిలోని రెండు దళాలు ఆధార, స్వాధిష్టానాలకు ప్రతీకలు ఇది మన స్తత్త్వాత్మకమైన చక్రము. దీన్ని గురించి లలితాసహస్రనామావళిలో ఈ విధంగా ఉంది.

ఆజ్ఞాచక్రాబ్జనిలయా శుక్లవర్ణా షడాననా.
మజ్జాసంస్థా హంసవతీముఖ్యశక్తిసమన్వితా,
హరిద్రాన్నైకరసికా హాకినీరూపధారిణీ.

'కామకలావిలాసం'లో ఈ విధంగా ఉంది.

భ్రూమధ్యే బిందుపద్మేదళయుగకలితే శుక్ల వర్ణాం
కరాబ్జైః బిభ్రాణాం జ్ఞానముద్రాం డమరుక కమలా క్షమాలాం కపాలం
షడ్వక్త్రాం ఆధారమధ్యాం త్రినయనలసితాం హంసవత్యాదియుక్తాం.
హరిద్రాన్నైకసక్తాం సకల శుభకరీం హాకినీం భావయామః"

అజ్ఞాన చక్రంలో తెల్లని రంగుతో ఆరు ముఖములు, మూడు కనులతో చేతులయందు కపాలము, అక్షమాల, డమరుకము జ్ఞానముద్ర ధరించినది, మజ్జయందుండునది, హంసవతి క్షమావతి అను రెండుశక్తులచే పరివృత అయినది,

హరిద్రాన్నము నందు మక్కువ కలది, సకల సుఖములను ఇచ్చునది అయిన 'హాకిని' అను పేరుకల యోగిని ఉన్నది. ఇక్కడ ఉండే శివాశివులను గూర్చి సౌందర్యలహరిలో ఈ విధంగా ఉంది.

శ్లో॥ తవాజ్ఞాచక్రస్థం తపన శశికోటిద్యుతిధరం
పరం శమ్భుం వన్దే పరిమిళితపార్శ్వం పరచితా,
యమారాధ్య న్భక్త్యా రవిశశిశుచీనా మవిషయే
నిరాలోకేఽలోకే నివసతిహి భాలోకభువనే.

అజ్ఞా చక్రంలో శివాశివులు కోట్ల కొలది సూర్య చంద్రులకాంతితో ప్రకాశిస్తూ ఉంటారు. లక్ష్మీధరని 'కర్ణావతంస్తుతి'లో

**"అజ్ఞాత్మక ద్విదళపద్మగతే తదానీం విద్యున్నిభేరవి, శశి ప్రయుతోత్కటాభే గండస్థలప్రతిఫల త్కరదీపజాల కర్ణావతంసకలికే కమలాయతాక్షి"**

అజ్ఞా చక్రస్వరూపమగు ద్విదళ పద్మమందున్న ఓ దేవీ, మెరుపు తీగవలె పదిలక్షల సూర్య చంద్రులకు మించిన కాంతితో విశాలమైన నేత్రములతో ప్రకాశించుచున్నావు.

ఈ చక్రంతో శివాశివులకు

1. అధిష్టానము అజ్ఞా చక్రము
2. ముక్త ప్రదిత్వము అనుష్టానసామ్యము
3. పర అను చిచ్ఛక్తితో కూడిన సదాశివుడు అనుట చే అవస్తాసామ్యము
4. కోట్లకొలది సూర్యచంద్రుల కాంతితో ప్రకాశించుట అనుటచే రూపసామ్యము
5. పరంశంభుం (పరుడనే పేరుగల శివుడు పరఅను పేరుగల దేవి) అనుటచే నామసామ్యము చెప్పబడినాయి.

7.సహస్రారము :-

ఇది షట్చక్రాలకూ పైభాగంలో నడినెత్తిన బ్రహ్మరంధ్రం దగ్గర ఉండే సహస్రదళ కమలము. ఇది వేయి దళాలతో ప్రకాశిస్తూ ఉంటుంది. దీనిని గురించి లలితా సహస్రనామావళిలో ఈ విధంగా చెప్పబడింది.

సహస్రదళపద్మస్థా సర్వవర్ణోపశోభితా,
సర్వాయుధధరా శుక్లసంస్థితా సర్వతోముఖీ.
సర్వౌదనప్రీతచిత్తా యాకిన్యంబాస్వరూపిణీ.

బ్రహ్మరంధ్రము దగ్గర సహస్రదళ పద్మము ఉన్నది. అక్కడ సకల వర్ణములు కలది, సకల ఆయుధములు ధరించినది, వీర్యమునందు అభిమానముకలది. అన్నివైపులకు ముఖములు కలది, అన్ని విధములైన అన్నములయందు ఆసక్తి కలది, అ నుంచి క్ష వరకు అన్ని వర్ణశక్తులతోనూ పరవృత అయినది అయిన "యాకిని" అను పేరుకల యోగిని ఉంటుంది.

అజ్ఞా చక్రమునందు విద్యుల్లత వలె ఉన్న దేవి సమాస్రారము చేరి సదాశివునితో కూడి సుఖిస్తూ ఉంటుంది.

ఈ విధంగా ఉన్న షట్చక్రాలలో మూలాధార స్వాధిష్టానాలను ప్రధమ ఖండంగానూ, మణిపూర అనాహతాలను ద్వితీయ ఖండంగానూ, విశుద్ధి, అజ్ఞాచక్రాలను తృతీయఖండంగానూ విభజించటం జరిగింది. ప్రధమ ఖండాన్ని అగ్నిస్థానం అని, ద్వితీయ ఖండాన్ని సూర్య స్థానం అని, తృతీయఖండాన్ని చంద్రస్థానం అని అంటారు. అందుకే ఈ షట్చక్రాలను సోమసూర్యఅన లాత్మకములు అంటారు. ఇవి సత్వరజస్ తమోగుణాలకు ప్రతీకలు. వీటిలో ప్రధమ ఖండం పైన ఉన్న ప్రదేశాన్ని బ్రహ్మగ్రంధి అంటారు. ఇది సృష్టిస్థానం. ద్వితీయ ఖండంపై భాగాన్ని విష్ణుగ్రంధి అంటారు. ఇది స్తితిస్థానం. తృతీయగ్రంధి పైభాగాన్ని రుద్రగ్రంధి అంటారు. ఇది లయస్థానం. ఈ రకంగా మూడు గ్రంధులూ సృష్టిస్తితిలయాలకు ప్రతీకలుగా ఉన్నాయి. షట్చక్రాలలోనూ శివాశివులు ఉంటారు. శక్తి లేకుండా శివుడుగాని, శివుడులేకుండా శక్తిగాని ఎక్కడా ఉండరు. ఈ విషయాన్ని 'మానసోల్లాసం'లో చెప్పబడింది.

"యేపిబ్రహ్మాదయోదేవా భవన్తి వరదాయినః
త్వద్రూపం శక్తిమాసాద్య తే భవన్తి వరప్రదః"

అవిధంగా ప్రతి చక్రంలోనూ శివాశివులను ఇద్దరినీ సేవించుచున్నాను అనటానికి కారణము శివుడు లేని దేవిసాయిజ్యం గాని, దేవిలేని శివసాయిజ్యం గాని లేవు.

కేవలం త్వామనాదృత్య మాం భజన్తో విచేతనాః।
నార్హంతి మమసాయుజ్యం బ్రహ్మకల్ప శతైరపి॥"

షట్చక్రాల ఐక్యము :-

శరీరంలో ఉండే షట్చక్రాలు సంస్కృత భాషకు ఉన్న యాభై అక్షరాలతోనూ, షోడశకళతోనూ, శ్రీ చక్రంతోనూ, మూలమంత్రంతోనూ ఐక్యము పొందుతున్నాయి.

అక్షరాలతో షట్చక్రాల ఐక్యము :-

ఒకసారి గనక మనం ఆధ్యాత్మిక దృష్టితో చూచినట్లైతే అస్తిక దర్శనాలనీ, నాస్తిక ధర్శనాలనీ దర్శనాలు రెండు రకాలుగా ఉన్నయి. విద్యారణ్యులు పధహారు దర్శనాలు చెప్పారు కాని

"పాణినే ర్జైమినే శ్చైవ వ్యాసశ్య కపిలశ్చచ
కణాద శ్యాక్ష పాదశ్య దర్శనాని షడైవహి"

అని ఆరు దర్శనాలు మాత్రమే ప్రశిద్ధి చెందినాయి.

వీటిలో మొట్టమొదటిది పాణిని మహర్షి వ్రాసిన అష్టాధ్యాయి అను సూత్రగ్రంథము

నృత్తావసానే నటరాజరాజో ననాధ ఢక్కాం నవపంచవారమ్
ఉద్ధర్తుకామ స్సనకాది సిద్ధా నేత ద్విమర్శే శివ సూత్రజాలమ్

శివుడు తన నాట్యము పరిసమాప్తి చేసే సమయంలో సనకాది సిద్ధుల నుద్ధరింపగోరివాడై తనఢక్కను పదునాలుగు సార్లు మోగించగా పదునాలుగు రకాల శబ్దాలు వెలువడినాయి. వీటినే మహేశ్వర సూత్రాలు అంటారు. వీటి ఆధారంగా పాణిని అష్టాధ్యాయి అనే సూత్రగ్రంధం రాశాడు. సంస్కృత భాషకు ఉన్న యాభై అక్షరాలూ షట్చక్రాలలో ఐక్యముపొందు తున్నాయి. షట్చక్రాలను మూడు ఖండాలుగా విభజించటం జరిగిందని ముందే చెప్పి ఉన్నాము ఇప్పుడు

1. చంద్రఖండము (విశుద్ధి, ఆజ్ఞా చక్రాలు)తో అ నుండి అః వరకు గల పదహారు అచ్చులు ఐక్యము పొందుతున్నాయి.
2. సూర్య ఖండము (మణిపూరకము, అనాహతము)తో క చ ట త ప అనే ఐదు వర్గులు అనగా క నుంచి మ వరకు గల ఇరవై ఐదు అక్షరాలూ ఐక్యము చెందుచున్నాయి.

భవాని శ్రీహస్తై ర్వహపి ఫణిపాశం సృణిమథో
ధనుః పౌండ్రం పౌష్పం శర మథ జపస్రగ్ శుకవరమ్.
అథ ద్వాభ్యాం ముద్రా మభయ వర దానై క రపికే
క్వణద్వీణాం ద్వాభ్యా మురపి చ కరాభ్యాం చ బిభృషే.

అంటే దేవి సర్పరూప పాశము అంకుశమువుండ్రేక్షుచాపము పుష్పబాణము జపమాల శుకవరము రెండు చేతులయందు అభయ వరదముద్రలు మరి రెండు చేతులతో వీణ దరించి ఉంటుంది. అన్నారు.

'చంద్రజ్ఞాన విద్య'లో

"సూర్య మండలమధ్యస్థాం దేవీం త్రిపురసుందరీం
పాశాంకుశధనుర్బాణాన్ ధారయంతీంప్రపూజయేత్"

సూర్యమండలము మధ్యన ధనుర్బాణములు, పాశము అంకుశము ధరించి వెలుగొందుతున్న ఆత్రిపురసుందరిని పూజించాలి అని చెప్పబడింది. 'సుభగోదయ స్తోత్రం' 'లో

"సూర్య మండలమధ్యస్తాం దేవీం త్రిపురసుందరీమ్
పాంశాంకుశ ధనుర్బాణ హస్తాం ధ్యాయేత్సు సాధకః
త్రైలోక్యం మోహయేదాసు నరనారీ గణైర్యుతమ్"

సూర్యమండలము మధ్య పాశము అంకుశము ధనుర్బాణములు ధరించి ప్రకాశిస్తున్న దేవిని గనక పూజించినట్లైతే సకల జనవశ్యం కలుగుతుంది. కాళిదాసు 'చర్చాస్తవం'లో

యే చింతయంత్యరుణమండలమధ్యవ ర్తి
రూపం తవాంబ నవయావకపంకరమ్యమ్.
తేషాం సదైవ కుసుమాయుధబాణభిన్న
వక్షస్థలా మృగదృశో వశగా భవంతి॥

సాధకుడు, సూర్యమండల మధ్య వర్తియై కెంపు ఛాయెతో వెలుగొందుచున్న దేవిని ధ్యానించి నట్లయితే అతనికి లేడి కనులు గల జవరాండ్రు వశమగుచున్నారు.

మణిపూరంలో ఉన్న దేవిని మానసికంగా అర్ఘ్యపాద్యాదులిచ్చి షోడశోప చార విధిని పూజించాలి. ఆతరువాత దేవి అనాహత మందిరానికి చేరుతుంది. అక్కడ ఆమెకు ధూపదీప నైవేద్య హస్త ప్రక్షాళన వరకు పూర్తి చెయ్యాలి. అపుడు దేవి విశుద్ధి చక్రం చేరి సింహాసనం మీద కూచుని చెలులతో ముచ్చటిస్తూ ఉంటుంది. ఇక్కడ దేవిని శుద్ధ స్ఫటికాలతో పూజించాలి. శుద్ధ స్ఫటికాలు అంటే విశుద్ధి చక్రంలోని పదహారు దళాలు మాత్రమే అని తెలుసుకోవాలి. ఆతరువాత దేవిని ఆజ్ఞా చక్రానికి చేర్చి నీరుజనాదులచే సంతోష పెట్టాలి. ఆజ్ఞా చక్రంలో దేవిని లక్ష్మీధరుడు 'కర్ణావతంసస్తుతిలో' ఈ విధంగా వర్ణించాడు.

ఆజ్ఞాత్మక ద్విదళ పద్మగతే తదానీం
విద్యున్నిభే రవి శశి ప్రయుతోత్కటాభే
గండస్థలప్రతిఫల త్కరదీపజాల
కర్ణావతంసకలికే కమలాయతాక్షి.

ఆజ్ఞాచక్రము అనబడే ద్విదళ పద్మంలో దేని మెరుపు తీగవలె పదిలక్షల సూర్య చంద్రుల కాంతితో, తామరపూవులవలె విశాలమైన కనులు కలిగి ప్రకాశిస్తూ ఉంటుంది. ఆవిధంగా ఉన్న దేవి సౌదామిని వలె సహస్ర కమలంలోకి ప్రవేశించి

"సుధా శింధోర్మధ్యే సురవిటపివాటీ పరివృతే
మణిద్వీపే నీపోపవన వతి చిన్తామణి గృహే
శివాకారే మంచే పరమశివ పర్యంకనిలయామ్"

బ్రహ్మరంధ్రం దగ్గర ఉన్న సుధాసింధువులో, మణి ద్వీపంలో కల్పవృక్షచ్ఛాయలో, చింతామణి గృహంలో త్రికోణా కారమంచం మీద పరమశివుని తోకూడి సుఖిస్తూ ఉంటుంది. సహస్ర కమలంలోనే సమయా చారులు దేవిని పూజిస్తారు. ఇది సమయమతరహశ్యము.

సమయాచారులకు బాహ్యపూజ లేదు. అంతర్ పూజ మాత్రమే చెయ్యాలి. ఈ విషయాన్ని సనత్కుమార సంహితలో చెప్పినారు.

శ్లో॥ "బాహ్య పూజా న కర్తవ్యా కర్తవ్యా బాహ్య జాతిభిః
సా క్షుద్రఫలదా (క్షుద్రధర్మదా) నృణాం ఐహికార్థైక సాధనాత్॥"

బాహ్య పూజారతాః కౌలాః క్షపణాశ్చ కపాలికాః
దిగంబరాశ్చేతిహాసాః (పీతవాసాః) వామకా స్తంత్రవాదినః॥
అంతరారాధనపరా వైదికా బ్రహ్మవాదినః
జీవన్ముక్తాశ్చరం త్యేతే త్రిషు లోకేషు సర్వదా॥ ఇతి

ఉత్తమ జాతులవారికి బాహ్య పూజ పనికి రాదు. ఇతర జాతుల వారే బాహ్యపూజ చేస్తారు. ఐహిక ప్రయోజనాలకు ఇది సాధనము అల్ప ప్రయోజనకారి. కౌలులు, క్షపణికులు, కాపాలికులు, దిగంబరులు, ఇతిహాసులు, వామాచారులు, తంత్రవాదులు ఈ బాహ్యపూజ చేస్తారు. బ్రహ్మవాదులైన వైదికాచార పరులు అంతర్పూజనే చెయ్యాలి. వీరు జీవన్ముక్తులై త్రిలో కాల్లోనూ సంచరిస్తూ ఉంటారు.

అంతర్ పూజనే ఆత్మపూజ అని కూడా అంటారు. దీనిని విశేషము వామకేశ్వర తంత్రంలో చెప్పబడింది.

పాశాంకుశౌ తదీయౌతు రాగద్వేషాత్మకౌ స్మృతౌ
శబ్ది స్పర్శాదయో బాణాః మన స్తస్యాభవద్ధనుః॥
కరణేంద్రియచక్రస్థాం దేవీం సంవిత్స్వరూపిణీమ్
విశ్వాహంకార పుష్పేణ పూజయే త్సర్వసిద్ధిదాక్॥

దేవి పాశాంకుశములే రాగద్వేషములు. పంచతన్మాత్రలే బాణములు. మనస్సే ఆమెధనుస్సు శ్రీ చక్రమందున్న సవిత్స్వరూపిణి అయిన ఆదేవిని గన అమంకారము అనే పుష్పంతో పూజించి నట్లైతే అనగా అరిషడ్వర్గాలను జయించి సంవిత్స్వరూణి అయిన దేవిని ధ్యానించి నట్లైతే సాధకుడు సరవసిద్ధులూ పొందుతాడు.

కుండలినీ శక్తిని గురించి వామకేశ్వర తంత్రంలో ఈ విధంగా ఉంది.

శ్లో॥ భుజంగాకార రూపేణ మూలాధారం సమాశ్రితా
శక్తిః కుండలినీ నామ బిసతంతు నిభాఽఽశుభా

అశుభా క్షణప్రభా విద్యున్నిభేత్యర్థః.

శ్లో॥ మూలకందం ఫణాగ్రేణ దష్ట్వా కమలకందవత్
ముఖేన పుచ్ఛం సంగృహ్య బ్రహ్మరంధ్రం సమాశ్రితా॥

శ్లో॥ పద్మాసన గత స్వస్థో గుద మాకుంచ్యసాధకః
వాయుమూర్ధ్వగతిం కుర్వన్ కుంభకావిష్టమానసః॥

శ్లో॥ వాయ్వాఘాత వశా దగ్నిః స్వాధిష్ఠానగతో జ్వలన్
జ్వలనాఘాత పవనాఘాతై రున్నిద్రితోఽహిరాట్॥

శ్లో॥ రుద్రగ్రంథిం తతో భిత్త్వా విష్ణుగ్రంథిం భినత్త్యతః
బ్రహ్మగ్రంథించ భిత్త్వైవ కమలాని భినత్తి షట్॥

శ్లో॥ సహస్రకమలే శక్తిః శివేన సహమోదతే
సాచావస్థా పరా జ్ఞేయా సైవనిర్వృతి కారణమ్॥

1. భుజంగాకారము ధరించి ఆభగవతి మూలాధారము నాశ్రయించినదై కుండలని శక్తిగా పిలవబడుతూ, తామరతూడులోని దారము వలె సన్నగా, మెరుపుతీగవలె ప్రకాశిస్తున్నది.

2. ఆశక్తి అధార కమలమూలకందమునునోటితో తామర దుద్దువలె కరచి పట్టుకుని బ్రహ్మ రంధ్రము నాశ్రయించి ఉన్నది.

3. సాధకుడు పద్మాసనంలోక కూర్చుని, మడమను గుదస్థానమును సంధించి శ్వాసనుపైకి వదులుతూ కుంభకము కూర్చవలెను. అనగా వాయివును లోన నిలపవలెను.

4. ఆ వాయువు తాకిడికి స్వాధిష్టానమున ఉన్న అగ్ని ప్రజ్వరిల్లి కుండలినీ శక్తి మేల్కొంటుంది.

5,6 అంత ఆశక్తి బ్రమ్మగ్రంధి, విష్ణగ్రంధి, రుద్రగ్రంధులు ఛేదించుకుని సహస్రారము చేరి సదాశివునితో సుఖిస్తూ ఉంటుంది. ఆస్థితిలో ఉన్న ఆమెయే పరాశక్తి నిత్య సుఖకారిణి.

'తంత్రసారము' లో కూడా ఈ విషయం చెప్పబడింది.

కుండల్యేవ భవే చ్ఛక్తి స్తాంతు సంచాలయే ద్బుధః ।
స్వస్థానా దాభ్రువోర్మధ్యం శక్తిచాలన ముచ్యతే ॥
మూలాధారాది షట్చక్రం శక్తిస్థాన ముదీరితం ।
కంఠా దుపరిమూర్ధాంతం శాంభవస్థాన ముచ్యతే ।
మూలాధారే ధ్వనిం శ్రుత్వా ప్రబుద్ధా శక్తికుండలీ ।
జ్వల త్పావకసంకాశా సూక్ష్మ తేజ స్స్వరూపిణీ ॥
శక్తిః కుండలినీ నామ బిసతంతు నిభా శుభా ।
సాచ విద్యుల్లతాకారా బ్రహ్మద్వారం మనోమయమ్॥
ముఖేనాచ్ఛాద్య తద్ద్వారం ప్రసుప్తా పరమేశ్వరీ ।
సార్ధత్రివలయాకారా గ్రంథిత్రయ విభేదినీ ॥
పృథ్వ్యాప్య చక్రద్వితయం రుద్రగ్రంథి పదోదితం ।
వహ్నిసూర్యమయం చక్రద్వయం తేజోమయంమహత్ ॥
విష్ణుగ్రంథి పదేనోక్తం తైజసం సర్వసిద్ధిదం ।
వాయ్వాకాశ ద్వయీరూపం చక్రద్వితయ ముత్తమమ్॥
బ్రహ్మగ్రంథిపదే నోక్తం మంగళాయతనం మహత్ ।
రుద్రగ్రంథిం తతోభిత్వా విష్ణుగ్రంథిం భినత్త్యతః ॥
బ్రహ్మగ్రంథించ భిత్త్వైవ కమలాని భినత్తి షట్ ।
సహస్రకమలే శక్తిః శివేన సహమోదతే ॥

ఇదే విషయం లలితా సహస్రంలో కూడా చెప్పబడింది.

మూలాధారైకనిలయా బ్రహ్మగ్రంథివిభేదినీ।
మణిపూరాంత రుదితా విష్ణుగ్రంథివిభేదినీ॥
ఆజ్ఞాచక్రాంతరాళస్థా రుద్రగ్రంథివిభేదినీ।
సహస్రారాంబుజారూఢా సుధాసారాభివర్షిణీ॥

ఆధార చక్రము అనే నాలుగు దళములు కల చక్రంలో కుండలినీ శక్తి నిద్రిస్తూ ఉంటుంది. ఆశక్తిని మేల్కొల్పినట్లైతే, అది ఊర్ధ్వముఖంగా బయలుదేరి బ్రహ్మగ్రంధిని చేధిస్తుంది. అంటే మాయను తొలగించి స్వస్వరూపాజ్ఞానం కలిగిస్తుంది. సృష్ట్యాదిసంబంధాలను తొలగించి పునర్జన్మ రహితమైన ముక్తిని కలిగిస్తుంది. ఆ తరువాత జీవన భారమైన విష్ణుగ్రంధిని ఛేదించి సాధకుడుకి అంతా మిధ్య అను జ్ఞానము కలిగిస్తుంది. తరువాత రుద్రగ్రంధిని భేదిస్తుంది. అంటే సృష్ట్యాదులు జీవదశ, లయాదులు అంతా మిధ్య అనే విషయాన్ని తెలియచేసి చిదానందాన్ని కలిగిస్తుంది. తరువాత ఆశక్తి సహస్రారం చేరుతుంది. అది దేవి ఉండే ప్రదేశము. అక్కడ దేవి విద్యుల్లత వలె ప్రకాశిస్తూ ఉంటుంది. సహస్రారంలో దేవిని కొలిచిన వారికి అమృతత్వం లభిస్తుంది. సాధకుడికి నేను అనే భ్రాంతి తొలగి జీవాత్మ పరమాత్మలో లీనమౌతుంది.

హరితస గోత్రీకుడు, శ్రీమతి క్రోవినత్య పర్వతవర్ధనమ్మ, శ్రీకృష్ణమూర్తిగారల జ్యేష్ఠపుత్రుడు,
విజయవాడ శాతవాహన కళాశాల అధ్యాపకుడు అయిన

**క్రోవిపార్థసారథి**

సర్వజనామోదము పొందునట్లుగా

సులభశైలిలో వ్రాసిన శ్రీవిద్యాదర్శనము' సమాప్తము

**ఓంతత్సత్**